


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 19 బుధవారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 155
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# ఏపీ జలదోపిడిని అడ్డుకోండి



- వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయండి: సీఎం రేవంత్‌రెడ్డి
- కృష్ణానీటిని అధికంగా వినియోగించినందుకు ఏపీపై కేంద్రానికి ఫిర్యాదు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సీఎం ఆదేశం
- ఏపీ తన వాటా కంటే ఎక్కువ నీటిని వినియోగించకుండా ఆపాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సీఎం సమీక్ష

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో
కృష్ణానది నుంచి కేటాయించిన వాటా కంటే ఎక్కువ నీటిని తీసుకున్నందుకు ఆంధ్రప్రదేశ్ పై కేంద్రానికి ఫిర్యాదు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ చర్యను తీవ్రంగా పరిగణించించిన సీఎం రేవంత్ రెడ్డి.. కృష్ణానీటిని అధికంగా వినియోగించినందుకు ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రానికి ఫిర్యాదు చేయాలని సోమవారం నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఏపీ తనవాట కంటే ఎక్కువ నీటిని వినియోగించకుండా ఆపాల్సిన బాధ్యత కేంద్రం తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. టెలిమెట్రీ వ్యవస్థే పరిష్కారం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో జరిగిన సమీక్షా సమావేశంలో.. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి కృష్ణా నీటిని వినియోగించుకోవడంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన నీటి పారుదల శాఖ అధికారులను కోరారు. ఆంధ్రప్రదేశ్ తన నిర్దేశించిన కోటా కంటే ఎక్కువ నీటిని వినియోగించకుండా నిరోధించడానికి టెలిమెట్రీ వ్యవస్థ మాత్రమే పరిష్కారమని ఆయన భావించారు. టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన నిధులలో ఏపీ ప్రభుత్వం తన వాటాను చెల్లించడానికి ముందుకు రావడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. టెలిమెట్రీ వ్యవస్థ అమలుకు అవసరమైన అన్ని నిధులను తెలంగాణ ప్రభుత్వం చెల్లిస్తోందని, టెలిమెట్రీకి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని

# రేపు ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారం




2

- ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి 20 రాష్ట్రాల సీఎంలు, రైతులు
- సినీ, పారిశ్రామిక ప్రముఖులు, ఇతర దేశాల దౌత్యవేత్తలకు ఆహ్వానం
- హాజరు కానున్న బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా భాగేశ్వర్ ధీరేంద్ర శాస్త్రి
- సీఎం ఎంపికపై వీడని ప్రతిష్ఠంభన..నేడు ఎంపిక చేసే అవకాశం

హైదరాబాద్-నవభూమిబ్యూరో
ఎల్లుండి ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార మహోత్సవానికి 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, 50 మందికి పైగా సినీ, పారిశ్రామిక ప్రముఖులు, విదేశీ రాయబారులు, కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు హాజరు కానున్నారు. ఇటీవల జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. దాదాపు 27 సంవత్సరాల తర్వాత దేశ రాజధానిలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.
ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్తలను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. వీరే కాకుండా, ఢిల్లీకి చెందిన పలువురు రైతులు, మురికివాడల నివాసితులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను సైతం ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రముఖ యోగా గురువు బాబా

# చట్ట విరుద్ధంగా కూల్చివేతలేంటి?



2

- తీరు మారదా..హైడ్రాపై హైకోర్టు మరోసారి సీరియస్
- ఎన్నిసార్లు చెప్పినా నిబంధనలు ఎందుకు పాటించరు?
- చట్టవిరుద్ధంగా కూల్చివేతలు చేస్తారా?..
- సెలవురోజు కూల్చివేతలు చేయడం అలవాటుగా మారింది
- హైడ్రాపై మండి పడిన హైకోర్టు

హైదరాబాద్-నవభూమిబ్యూరో
హైడ్రా తీరుపై హైకోర్టు మరోసారి సీరియస్ అయింది. ఎన్నిసార్లు చెప్పినా నిబంధనలు ఎందుకు పాటించరు? చట్టివిరుద్ధంగా కూల్చివేతలు చేస్తారా?.. సెలవు రోజు కూల్చివేతలు చేయడం అలవాటుగా మారిందని హైకోర్టు మండిపడింది. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ముత్తంగిలో సెలవు రోజు (ఆదివారం) ప్రవీణ్ అనే వ్యక్తికి సంబంధించిన షెడ్ ను అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా కూడా అతనికి నమాచారం ఇవ్వకుండా కూల్చివేయడంతో అతను హైకోర్టును ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టి అక్కడి హైడ్రా ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ పై జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం సీరియస్ అయింది. దీంతో సెలవు రోజు కూల్చివేతలు చేయొద్దని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదని హైడ్రాకు ధర్మాసనం మొట్టికాయలు వేసినట్లు తెలుస్తోంది. ముత్తంగిలో జరిగిన కూల్చివేతలపై ఫిబ్రవరి 20న స్వయంగా హాజరుకావాలని

# విడదల రజనీకి హైకోర్టులో బిగ్‌రిలీఫ్

- చిలకలూరిపేటలో రజనీపై అట్రాసిటీ కేసు నమోదు
- పోలీసులు విడదల రజనీ అరెస్టుకు రంగం సిద్ధం
- ముందస్తు బెయిల్‌కు హైకోర్టు మెట్లు ఎక్కిన రజనీ
- రజనీపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు



2

అమరావతి-నవభూమిబ్యూరో
ఏపీలో వైసీపీ మాజీ మంత్రి విడదల రజనీకి ఇవాళ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన రజనీకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు మొదలయ్యాయి.. గతంలో ఆమె చేసిన తప్పిదాలన్నీ ఒకొక్కటిగా తవ్వడం మొదలుపెట్టింది. అయితే ఇదే క్రమంలో రజనీపై చిలకలూరిపేట పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై అరెస్టుకు సిద్ధమవుతున్న తరుణంలో ఆమె ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. విడదల రజనీతో పాటు పలువురు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన ఏపీ హైకోర్టు... చిలకలూరి పేట పోలీసులకు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో విడదల రజనీపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ముందస్తు బెయిల్ రాకపోయినా ఈ కేసులో రజనీకి ఊరట దక్కినట్లయింది. దీంతో పాటు కేసు విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. టీడీపీ సోషల్ మీడియా వింగ్ ఐటీడీపీకి సంబంధించి పోస్టులు పెట్టిన వ్యవహారంలో విడదల రజనీతో పాటు ఆమె పీఏలపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి దాఖలు చేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆయన హైకోర్టుకు వెళ్లి ఆదేశాలు తెచ్చుకున్నారు.
దీంతో రజనీపై కసు నమోదైంది. సోషల్ పోస్టుల కేసులో 2019లో అప్పటి పట్టణ సీఐ సూర్య నారాయణ తనను అరెస్ట్ చేశారని, కోర్టులో ప్రవేశపెట్టకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని హైకోర్టుకు తెలిపారు. ఈ కేసులో హైకోర్టు ఆదేశాలతో

## తెలంగాణ హైకోర్టులో
# న్యాయవాదికి గుండెపోటు

- ఆసుపత్రి తీసుకెళ్లేలోపే కన్నుమూత..విచారణలన్నీ వాయిదా

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ హైకోర్టులో విషాదం నెలకొంది. హైకోర్టులో సీనియర్ న్యాయవాది వేణుగోపాల్‌రావు గుండె పోటుకు గురయ్యారు. హైకోర్టులో కేసును వాదిస్తున్న సమయంలో న్యాయవాది ఒక్క సారిగా కుప్పకూలారు. వెంటనే ఆస్పత్రికి తరలించేలోపే మార్గమధ్యలోనే వేణుగోపాల్ రావు మృతి చెందారు. న్యాయవాది మృతికి సంతాపంగా హైకోర్టులో అన్ని బెంచ్‌లలో జడ్జిలు విచారణను నిలిపివేశారు. అన్ని కోర్టులో విచారణలు రేపటికి వాయిదా వేశారు న్యాయమూర్తులు. హైకోర్టులో మంగళవారం మధ్యాహ్నం లంచ్ విరామం తర్వాత ఓ కేసు విషయంలో వేణుగోపాల్ తన వాదనలు వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాదనలు వినిపిస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే స్పందించిన తోటి న్యాయవాదులు సీపీఆర్ చేసినప్పటికీ కూడా లాయర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. దీంతో ఆయనను స్థానిక ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యలోనే వేణుగోపాల్ రావు ప్రాణాలు కోల్పోయారు. కేసు వాదిస్తూ పడిపోయిన సమయంలో కళ్లు తిరిగి పడిపోయారని అంతా భావించారు. వెంటనే ఆస్పత్రిక తరలించగా గుండెపోటుతో న్యాయవాది మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. న్యాయవాది మృతి పట్ల న్యాయమూర్తులు విచారం వ్యక్తం చేస్తూ అన్ని విచారణలను వాయిదా వేశారు. న్యాయవాది మృతితో లాయర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

## త్వరలో అందుబాటులోకి
# క్యాన్సర్ టీకా

2

- మహిళల్లో క్యాన్సర్ నివారణ కోసం టీకా
- ఐదారు నెలల్లో టీకా అందుబాటులోకి వస్తోందన్న కేంద్రమంత్రి కేంద్రమంత్రి జాదవ్
- ఈ టీకా వేసుకోవడానికి 9 నుండి 16 ఏళ్ల లోపు వయస్సు బాలికలు అర్హులని వెల్లడి
- టీకాపై పరిశోధనలు పూర్తి కావొచ్చాయని, ట్రయల్స్ కొనసాగుతున్నాయని వివరణ



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** మహిళలను ప్రభావితం చేస్తున్న క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు మరో ఐదారు నెలల్లో టీకా అందుబాటులోకి రానుందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడించారు. అయితే, ఈ టీకా వేసుకోవడానికి 9 నుండి 16 ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ టీకాపై

## ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా
# ప్రొ. జీపీ రాజశేఖర్

- ఏపీలో పలు వర్సిటీలకు వీసీల నియామకం
- మూడేళ్ల కాలపరిమితితో తాజా నియామకం
- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**ఏపీలోని పలు యూనివర్సిటీలకు వీసీలను నియమించారు. ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ను నియమించారు. రాజశేఖర్ ప్రస్తుతం ఐఐటీ ఖరగ్ పూర్ లో మ్యాథ్స్ ప్రొఫెసర్ గా ఉన్నారు. రాజశేఖర్ ఏయూ వీసీగా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.
ఇక, కాకినాడ జేఎన్టీయూ వీసీగా ప్రొఫెసర్ సీఎస్సార్కే ప్రసాద్ ను నియమించారు. ప్రసాద్ ప్రస్తుతం వరంగల్ ఎన్ఐటీలో సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ప్రసాద్ జేఎన్టీయూ వీసీగా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.
యోగి వేమన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.ప్రకాశ్ బాబును నియమించారు. ప్రకాశ్ బాబు... హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనిస్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగంలో బయోటెక్నాలజీ సీనియర్ ప్రొఫెసర్ గా ఉన్నారు. ప్రకాశ్ బాబు యోగి వేమన వర్సిటీ వీసీగా మూడేళ్ల పాటు

# కూటమి ‘నాడి’

- మరో పది రోజుల్లో ఎన్నికలు..
- ఆరునెలల కూటమి పాలనపై
- ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:**ఏపీలో మరో పది రోజుల్లో అంటే.. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. కేవలం మూడు స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నా.. దాదాపు 70 శాతం జిల్లాల్లో ఈ ఎన్నికల ప్రభావం కనిపిస్తోంది. ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. అదేవిధంగా ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆయా జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ నెల 27న జరగనున్న ఈ ఎన్నికల పోలింగ్ అనంతరం.. ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ మూడు స్థానాల్లోనూ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు కూటమిలోని టీడీపీనే తీసుకుంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరుజిల్లాల పరిధిలో మాజీ మంత్రి సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ బరిలో ఉన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో కూడా టీడీపీ నాయకుడు, సీనియర్ నేత పేరాబత్తుల రాజశేఖర్ పోటీ చేస్తున్నారు. వీరి గెలుపు కూటమికి.. మరీ ముఖ్యంగా టీడీపీకి అత్యంత కీలకంగా మారింది. దీంతో సీఎం చంద్రబాబు ఇప్పటికి ఐదారుసార్లుగా.. మన వాళ్లను గెలిపించేందుకు కృషి చేయండి అని నాయకులు, మంత్రులకు కూడా తేల్చి చెప్పారు. ఇక, క్షేత్రస్థాయిలో పరిస్తితిని గమనిస్తే.. కూటమికి కొంత సెగ తగిలే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికల్లో విద్యాధికులు(గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు) ఓటేయనున్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, నిరుద్యోగులు కూడా ఉన్నారు. అయితే.. వీరిపై కూటమి ప్రభుత్వ ప్రభావం ఆధారంగానే ఈ ఓటు బ్యాంకు టీడీపీకి దక్కే అవకాశం కనిపిస్తోంది. ఉద్యోగులు, నిరుద్యోగుల విషయంలో వ్యతిరేకత కనిపిస్తున్నట్టు తాజాగా సర్వేల్లో స్పష్టమైంది. ఉద్యోగులు తమ బకాయిలు 257 కోట్ల రూపాయలను ఇవ్వాలని గత రెండు మాసాలుగా డిమాండ్ చేస్తున్నారు. దీనిపై సర్కారు

# ఏపీలో జీబీఎస్ విజృంభణ..



- ఏపీలో 59కి పెరిగిన కేసులు..భయపెడుతున్న మరణాల సంఖ్య
- స్వల్ప వ్యవధిలోనే విజృంభిస్తూ ప్రజలను కలవరపరుస్తున్న వైరస్
- రంగంలోకి దిగిన ఏపీ ప్రభుత్వం..వైద్యాధికారులతో సీఎం సమీక్ష
- ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న బాధితులు

2

**అమరావతి-నవభూమిబ్యూరో:**59కి పెరిగిన కేసులు కరోనా మహమ్మారిని మరచిపోక ముందే జీబీఎస్ వైరస్ సవాల్ విసురుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 59 కేసులు నమోదయ్యాయి. ఏపీలో గులియన్ బారే సింర్డోమ్ (జీబీఎస్) కలకలం రేపుతోంది. స్వల్ప వ్యవధిలోనే వైరస్ విజృంభిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 59 మంది ఈ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారు. మరోవైపు మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. కొద్దిరోజుల కిందట జీబీఎస్ లక్షణాలతో ఆరేళ్ల బాలుడు మరణించడగా, ఆదివారం ప్రకాశం జిల్లాకు చెందిన 50 ఏళ్ల మహిళ కూడా మరణించింది. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ హైఅలర్ట్ ప్రకటించింది. కరోనా మహమ్మారిని మరచిపోక ముందే జీబీఎస్ వైరస్ సవాల్ విసురుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 59 కేసులు నమోదయ్యాయి. అయితే వీరిలో కేవలం 14 మంది మాత్రమే చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు చికిత్స అనంతరం కోలుకుని ఇళ్లకు వెళ్లిపోయినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో జీబీఎస్ కేసులు పెరుగుతుండటంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పర్యవేక్షణతో మంత్రి సత్యకుమార్ యాదవ్ నిరంతరం వైద్యాధికారులతో సమీక్షిస్తున్నారు. దీంతో వైద్యాధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదు అవుతున్నా, కొన్ని ఆస్పత్రుల్లో మాత్రమే ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. కేసులు పెరుగుతున్నందున అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక బెడ్స్ ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు. కరోనా కంటే జీబీఎస్ ప్రమాదకమంటూ హెచ్చరికలు జారీ అవుతుండటంతో రాష్ట్రంలో భయానక పరిస్థితులు


## పల్లీపట్టీల పంపిణీ
# నిలిపివేత

- కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం
- ప్రభుత్వ పాఠశాలల్లో ఇక పల్లీపట్టీల పంపిణీ బంద్
- పల్లీ పట్టీలలో అధిక కొవ్వు, అధిక చక్కెర కంటెంట్ ఉండడంతో పిల్లల ఆరోగ్యంపై హానికరమైన ప్రభావం

2



**బెంగుళూరు-నవభూమిబ్యూరో:**కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి పల్లీపట్టీల పంపిణీని నిలిపివేసింది. దీని ప్రభావం పిల్లల ఆరోగ్యంపై ఉంటుందనే ఆందోళన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పల్లీ పట్టీలలో అధిక కొవ్వు, అధిక చక్కెర కంటెంట్ ఉండడం వల్ల పిల్లల ఆరోగ్యంపై హానికరమైన ప్రభావం చూపుతుందని ధార్వాడ్ డిప్యూటీ కమిషనర్(పాఠశాల విద్య) నివేదిక నేపథ్యంలో కర్ణాటక సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పిల్లల ఆరోగ్యంపై పల్లీ పట్టీలు దుష్ప్రభావం చూపే ప్రమాదం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గడువు తీరిన, సరిగా నిల్వ చేయని పల్లీ పట్టీలను పంపిణీ చేయడం వంటి కేసుల గురించి ఈ నివేదిక ఆందోళనలను లేవనెత్తింది. మధ్యాహ్న భోజన పథకం కింద పల్లి పట్టీకి బదులుగా గుడ్లు లేదా అరటి పండ్లు అందించాలని అధికారులు పాఠశాలలను ఆదేశించారు. 2021 నుంచి మధ్యాహ్నం భోజన పథకంలో గుడ్డుకు




## వావ్.. భర్త అంటే ఇలానే ఉండాలి..




హైదరాబాద్-నవభూమి:భార్య భర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు, గొడవలు మాత్రమే కాదు ప్రేమ, అప్యాయతలు కూడా ఉంటాయి. వాళ్లలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోయినా, ఏదైనా ప్రమాదం జరిగినా ఏ మాత్రం తట్టుకోలేరు. ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యకు సేవలు చేస్తున్నాడు ఓ భర్త. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు ఇది కదా నిజమైన ప్రేమంటే అంటూ కామెంట్లు పెడుతున్నారు.
మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వార్డులో ఒక జంట మధ్య జరిగిన సంఘటన అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. తెలంగాణకు చెందిన ఒక వైద్య విద్యార్థి తన సోషల్ మీడియా ఖాతాలో ఒక వీడియోను షేర్ చేశాడు. అందులో ఒక వృద్ధుడు నేలపై కూర్చుని అనారోగ్యంతో ఉన్న తన భార్య జుట్టును దువ్వుతూ, జడ వేస్తూ కనిపించాడు. చిన్న చిన్న విషయాలకే అవేశంతో భార్యను చంపేస్తున్న ఈ రోజుల్లో ఓ వృద్ధుడు ఓపికగా తన భార్య జుట్టును దువ్వి జాగ్రత్తగా జడ వేశాడు. తన భార్యపై చూపిస్తున్న ప్రేమ అందరినీ ఆకట్టుకుంటుంది.
ఈ వీడియో వైరల్ కావడంతో అందరూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. నిజమైన ప్రేమ మాటల్లో కాదు, కష్టసమయంలో తోడుగా ఉండటంలో తెలుస్తుందని, స్వచ్ఛమైన ప్రేమ ఇలాంటి సందర్భాల్లో బయటపడుతుందని కామెంట్లు పెడుతున్నారు. మరికొందరూ లవ్ సింబల్ పెడుతూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

## బర్డ్ ఫ్లూ భయం.. తగ్గిన చికెన్ బిర్యానీ సేల్స్, ఆ వంటకానికి పెరిగిన గిరాకీ



హైదరాబాద్-నవభూమి:గతకొన్ని రోజులుగా బర్డ్ ఫ్లూ భయం రెండు తెలుగు రాష్ట్రాలను వణకిస్తోంది. బర్డ్ ఫ్లూ సోకి లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. దాని ప్రభావం చికెన్ విక్రయాలపై పడింది. హైదరాబాద్ నగరంలో గతంలో పోలిస్తే విక్రయాలు సగానికి పైగా పడిపోయాయి. ఈ ఆదివారం 40 శాతం మాత్రమే విక్రయాలు సాగాయని వ్యాపారులు వాపోతున్నారు. తాజాగా.. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ చికెన్ వంటకాలపైనా పడింది. ముఖ్యంగా హైదరాబాద్ బిర్యానీపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ గట్టిగానే పడినట్లు హెూటల్ యజమానులు చెబుతున్నారు.
హైదరాబాద్ ఐకానిక్ ఫుడ్ అయిన బిర్యానీని తినేందుకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో చికెన్ బిర్యానీ తినేందుకు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు. ఒకప్పుడు ఇష్టంగా తిన్న బిర్యానీ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. బిర్యానీ ఆర్డర్లు లేక చాలా రెస్టారెంట్లు, హెూటళ్లు వెలవెలబోతున్నాయి. అదే సమయంలో మరో వంటకానికి గిరాకీ పెరిగింది. గతంలో మటన్ బిర్యానీ ఇష్టపడి వారు బర్డ్ ఫ్లూ భయంతో ఆ వంటకం వైపు మ్మొగ్గుచూపుతున్నారు. చికెన్ కంటే ఎక్కువగా మటన్ బిర్యానీలు ఆర్డర్ ఇస్తున్నారు.
'ఇంతకు ముందు మేం రోజుకు 70-80 హండీల బిర్యాని సిద్ధం చేసేవాళ్లం. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ బిర్యానీ విక్రయాలు తగ్గాయి. 50 హండీలు కూడా సేల్ కావటం లేదు. గతంలో మేం 15 హండీల మటన్ మాత్రమే విక్రయించేవాళ్లం. ప్రస్తుతం మటన్ బిర్యానీకి గిరాకీ పెరిగింది. గతంలో కంటే మూడు రెట్లు ఎక్కువగా అంటే దాదాపుగా 45 హండీల మటన్ బిర్యానీని విక్రయిస్తున్నాం.' అని సుచిత్ర సర్కిల్‌లోని ఓ ఫేమస్ హెూటల్ యజమాని తెలిపారు.చికెన్ బిర్యానీ అంటేనే ప్రజలు భయపడిపోతున్నారని హెూటల్ యజమానులు చెబుతున్నారు. 100 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద ఉడికించి చికెన్ తింటే ఎటువంటి ప్రమాదం లేదని వార్త పత్రికల్లో, టీవీల్లో ఆరోగ్య నిపుణులు చెబుతున్నప్పటికీ ప్రజలు ధైర్యం చేయలేకపోతున్నారని అంటున్నారు. చాలా వరకు చికెన్‌తో చేసిన వంటకాలు సేల్ అవ్వకుండా మిగిలిపోతున్నాయన్నారు. అదే సమయంలో మటన్‌కు మాత్రం గిరాకీ పెరిగిందని చెబుతున్నారు.

## చిన్నారి వేలికి ఇరుక్కున్న ఉంగరం.. చేతులెత్తేసిన డాక్టర్లు.. చివరకు ఏం చేశారంటే..?




హైదరాబాద్-నవభూమి:చేతి వెలికి స్టీల్ ఉంగరం ఇరుక్కొని ఐదేళ్ల చిన్నారి నరకయాత అనుభవించింది. దాదాపు 10 గంటల పాటు బాధను భరించింది. ఆడుంకుంటూ ఉండగా.. ప్రమాదవశాత్తు చేతి వేలికి ఉంగరం ఇరుక్కుపోయింది. అది ఎంతకూ రాకపోవటంతో తల్లిదండ్రులు.. సమీపంలోని ఓ స్వర్ణకారుడి వద్దకు, ఆ తర్వాత డాక్టర్ల వద్దకు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి ఉంగరాన్ని కట్ చేశారు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ టోలీచౌకి ప్రాంతానికి చెందిన దీపిక అనే ఐదేళ్ల చిన్నారి చేతికి స్టీల్ ఉంగరం ఇరుక్కుపోయింది. ఇంట్లో సరదాగా ఆడుకునే క్రమంలో చిన్నారి ఉంగరాన్ని చేతికి పెట్టుకుంది. అయితే అది కాస్త ప్రమాదవశాత్తూ వేలులో ఇరుక్కుపోవయింది. చిన్నారి ఏడుస్తూ తల్లిదండ్రులకు విషయం చెప్పగా.. వారు దాన్ని బయటకు తీసేందుకు శథవిధాల ప్రయత్నించారు. అయితే బయటకు రాకపోగా.. చిన్నారి నొప్పితో విలవిల్లాడుతోంది. దీంతో సమీపంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. తాము తీయలేమని చెప్పేశారు. అనంతరం ఓ స్వర్ణకారుడి వద్దకు చిన్నారిని తీసుకెళ్లగా చిన్న పాప చేతికి ఏమైనా గాయం అవుతుందోనన్న భయంతో అతడు కూడా తీయలేకపోయాడు.అక్కడి నుంచి ఉస్మానియా హాస్పిటల్ తీసుకెళ్లారు. చిన్నారి వేలికి ఉన్న ఉంగరాన్ని తీసే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. దీంతో వారు కూడా చేతులెత్తేశారు. అయితే గౌలిగూడ ఫైర్‌స్టేషన్‌లో పరికరాలు ఉంటాయని చిన్నారి తల్లిదండ్రులకు సలహా ఇచ్చారు. అక్కడికి తీసుకెళ్తే ఫైర్ సిబ్బంది తీసే ఛాన్స్ ఉందన్నారు. దీంతో పరుగు పరుగున చిన్నారిని ఫైర్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లి జరిగిన విషయం చెప్పారు. రంగంలోకి దిగిన ఫైర్ స్టేషన్ సిబ్బంది తమ వద్ద ఉన్న పరికరాలతో చిన్నారి చేతి వేలికి గాయం కాకుండా తీవ్రంగా శ్రమించి చాకచక్యంగా వేలికి ఉన్న ఉంగరాన్ని కట్ చేశారు. దీంతో చిన్నారితో పాటు తల్లిదండ్రులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. ఫైర్ స్టేషన్ సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పి అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో టోకరా..



హైదరాబాద్-నవభూమి: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను నకిలీ ఐటీ కంపెనీ దారుణంగా మోసం చేసింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి యువతీయువకుల నుంచి లక్షలు కాజేసి చివరికి బోర్డు తిప్పేశారు. మాదాపూర్‌లో నియోజెన్ సాఫ్ట్ టెక్ సొల్యూషన్స్ పేరుతో కాలువ భార్గవ్ అనే వ్యక్తి ఓ ఫేక్ కంపెనీ ఏర్పాటు చేశాడు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, కన్సల్టెన్సీల నుంచి రెజ్యూమ్‌లు కొనుగోలు చేశాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో యువతకు గాలం వేశాడు.
సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు మెయిల్స్ పంపాడు కేటుగాడు భార్గవ్. ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగం కావాలంటే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఫేక్ అపాయింట్మెంట్ లెటర్లు ఇచ్చి పలువురి నుంచి లక్షలు కాజేశాడు. ఎన్ని నెలలు గడిచినా ఉద్యోగాలు మాత్రం రాలేదు. దీంతో అనుమానం వచ్చిన బాధితులు పలుమార్లు డబ్బులు వెనక్కి ఇవ్వాలని నిలదీశారు. దీంతో నియోజెన్ సాఫ్ట్ టెక్ సొల్యూషన్స్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు భార్గవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పలు కీలక విషయాలను వెల్లడించారు.నిందితుడు భార్గవ్ బ్యాక్ డోర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ లక్షలు కొట్టేశాడని పోలీసులు తెలిపారు. గతంలో ఓ ఐటీ కంపెనీలో నిందితుడు హెచ్‌ఆర్‌గా పని చేశాడని చెప్పారు. దీంతో అతనికి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ, ఫార్మాలిటీలపై అవగాహన ఉందని పేర్కొన్నారు. ఆ అనుభవంతో నకిలీ అపాయింట్మెంట్ లెటర్లు సృష్టించి నిరుద్యోగులను బురిడీ కొట్టించాడని వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.లక్ష, ఐదు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, రెండు ఐడీ కార్డులు, రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా, లాలాగూడ, జీడిమెట్ల, మాదాపూర్‌తోపాటు కల్వకుర్తి పోలీస్‌స్టేషన్లలో భార్గవ్‌పై ఇప్పటికే నాలుగు కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

# హైడ్రా అధికారులపై మరోసారి హైకోర్టు సీరియస్



హైదరాబాద్-నవభూమి: హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే లక్ష్యంగా.. రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసిన హైడ్రా.. అక్రమార్కులపాటిట సింహస్వప్నంగా మారింది. ఇటీవలే హైడ్రా కార్యాలయం ఏర్పాటు చేయటంతో.. ఫిర్యాదులతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆ ఫిర్యాదులన్నింటినీ స్వయంగా హైడ్రా కమిషన్ ఏవీ రంగనాథే తీసుకుని పరిష్కారించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో.. ఇప్పటికే పలు ఫిర్యాదులపై స్పందించి.. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించారు కూడా. మరోవైపు.. అక్రమంగా నిర్మించిన కూల్చివేతలు కూడా కొనసాగిస్తున్నాయి. అయితే.. ఈ హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.ఎన్ని సార్లు చెప్పినా వినరా..? నిబంధనలు ఎందుకు పాటించరు..? చట్టివిరుద్ధంగా కూల్చివేతలు చేస్తారా..? అంటూ హైడ్రా అధికారులపై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. సెలవు రోజు కూల్చివేతలు చేపట్టొద్దని.. అంత అత్యవసరం ఏమొచ్చిం దంటూ ఇప్పటికే హైకోర్టు మొట్టికాయలు వేయగా.. మళ్లీ సెలవు రోజునే కూల్చివేతలు చేసినట్టుగా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ముత్తంగిలో ఆదివారం రోజున ప్రవీణ్ అనే వ్యక్తికి సంబంధించిన షెడ్‌ను కూల్చివేయడంతో అతను హైకోర్టును ఆశ్రయించాడు.అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా కూడా తనకు సమాచారం ఇవ్వకుండా తన షెడ్డు కూల్చివేశారంటూ ప్రవీణ్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో.. హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. సెలవు రోజు కూల్చివేతలు చేయొద్దని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదని హైడ్రా అధికారులను నిలదీసింది.మరోవైపు.. హైదరాబాద్‌లో, నగర చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ప్లాట్లు కొనుగోలు చేసే వారికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక సూచన చేశారు. ఫామ్ ప్లాట్ల పేరిట ఎలాంటి పర్మిషన్లు లేని లేఔట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని రంగనాథ్ సూచించారు. అనుమతులు లేని లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే.. ఆ తర్వాత ఇబ్బందులు పడాల్సి ఉంటుందని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. ఫామ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉందని, అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అమ్మకాలు జరుగుతున్నట్లు చెప్పుకచ్చారు.రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని లక్ష్మీగూడ గ్రామ సర్వే నెంబర్ 50 లోని 1.02 ఎకరాల్లో ఫామ్ ప్లాట్ల పేరిట లేఔట్ వేసి అమ్ముతున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందినట్టుగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

# కులగణన సర్వేలో పాల్గొనలేదా..? సింపుల్‌గా ఇలా చేసేయండి.. ఉన్నచోటే, ఆన్‌లైన్‌లో..!



హైదరాబాద్-నవభూమి:తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కులగణన సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పేరుతో చేపట్టిన కులగణన సర్వేలో సుమారు 3 శాతానికి పైగానే ప్రజలు పాల్గొనలేదని అధికారులు తేల్చారు. దీంతో.. మొదటిసారి సర్వేలో పాల్గొనని వారికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 16 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ సర్వేలో.. ఇప్పటివరకు పాల్గొనని వారు తమ వివరాలు నమోదు చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే.. ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఈసారి సర్వే కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది. దీంతో.. సర్వేలో పాల్గొనటం చాలా సింపుల్‌గా మారిపోయింది.అయితే.. మొదటిసారి ఎన్యూమరేటర్లు, దరఖాస్తులు పట్టుకుని ఇంటింటికి తిరుగుతూ వివరాలు నమోదు చేయటం.. వాళ్లు వచ్చే సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవటమో, తాళం వేసి ఉండటమో, వేరే పనిలో ఉండటమో, లేక ఉద్యోగరిత్యా వేరే ప్రాంతాల్లో నివాసముంటుండటమో, వేరే ప్రాంతాలకు వెళ్లటమో.. ఇలా రకరకాల కారణాలతో అందుబాటులో లేక సర్వేలో పాల్గొనలేని పరిస్థితులు ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని.. ప్రభుత్వం ఈసారి టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇదే కాకుండా.. ఆన్‌లైన్‌లో కూడా సర్వేలో వివరాలు నమోదు చేసుకునే సూపర్ ఛాన్స్ కల్పించింది.అయితే.. కులగణనలో పాల్గొనని వారు.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 040-211 11111కు కాల్ చేసి ఇంటి అడ్రస్ చెప్పి, ఎప్పుడు అందుబాటులో ఉంటారో చెప్తే.. ఎన్యూమరేటర్లే ఇంటికి వచ్చి మీ వివరాలు నమోదు చేసుకుని వెళ్తారు.
ఇలా కూడా సాధ్యం కానీ సందర్భంలోనో, వేరే ప్రాంతాల్లో ఉండి ఊరికి రాలేని పరిస్థితుల్లో ఉండే వారు.. సింపుల్‌గా ఆన్‌లైన్ ద్వారా కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలి అనుకునే వారు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన https://seeepsurvey.cgg.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే.. కుడివైపు కులగణనకు సంబంధించిన ఫామ్ డౌన్‌లోడ్ ఆప్షన్ కనిపిస్తుంది. అది క్లిక్ చేయగానే.. పేరు, ఫోన్ నెంబర్, జిల్లాకు సంబంధించిన వివరాలు అడుగుతుంది. ఆ వివరాలన్ని నింపిన తర్వాత.. కులగణన ఫామ్ డౌన్‌లోడ్ అవుతుంది. దాన్ని ప్రింట్ తీసుకుని.. అందులో వివరాలు నింపాల్సి ఉంటుంది. నింపిన తర్వాత.. ఆ ఫామ్‌ను దగ్గరిలోని పీపీఎస్‌కే (ప్రజాపాలన సేవా కేంద్రం)లో ఇవ్వాల్సి ఉంటుంది.ఇదే కాకుండా.. దగ్గర్లోని ఎంపీడీవో కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది ప్రభుత్వం.అయితే.. ప్రభుత్వం మొదటిసారి నిర్వహించిన కులగణన సర్వేలో 3,56,323 కుటుంబాలు పాల్గొనలేదని ప్రభుత్వం గుర్తించింది. వారి కోసం.. ప్రత్యేకంగా మరోసారి సర్వే నిర్వహిస్తున్న ప్రభుత్వం తెలిపింది. కాగా.. అప్పుడు పాల్గొనని వాళ్లంతా తప్పనిసరిగా ఈ సర్వేలో పాల్గొని తెలంగాణ జనాభా లెక్కల్లో భాగస్వామ్యం కావాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.

# ఏపీ జలదోపిడిని అడ్డుకోండి

(1వపేజీ తరువాయి) తెలియజేస్తూ కృష్ణా నది నిర్వహణ బోర్డుకు వెంటనే లేఖ రాయాలని నీటిపారుదల ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాల కేటాయింపు, నీటి వాటాల వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల కమిషన్ పై ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే మూడు నెలలు కీలకం.. ప్రణాళిక ప్రకారం రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల నుంచి పంటలకు నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వేసవిలో తీవ్రమైన వేడి పరిస్థితులను ముందుగానే అంచనా వేయడం ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. రాబోయే మూడు నెలలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్ర పర్యటనలు నిర్వహించి పరిస్థితిని పర్యవేక్షించడం ద్వారా చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. రైతులు ఎటువంటి అడ్డంకులు ఎదుర్కోకుండా..ఎండాకాలంలో పంటలను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్ట చేశారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రధాన ప్రాజెక్టులు, జలాశయాలలో నీటి మట్టాలు, నీటి వనరుల వినియోగం గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వేసవిలో నీటి సంక్షోభాన్ని నివారించడానికి తాగునీరు, నీటిపారుదల అవసరాలను తీర్చడానికి ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటిని ఉపయోగించుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాబోయే మూడు నెలలు చాలా కీలకమైనవని.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో సాగునీరు, తాగునీరు, విద్యుత్ కు నీటి డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రేవంత్ సర్కారు మౌనంగా ఉంది:కేటీఆర్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా నీటిని అడ్డంకులు లేకుండా మళ్లించడానికి ఏపీకి అనుమతి ఇచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఏపీ స్వేచ్ఛా చర్యకు దారి తీసిందని ఆయన విమర్శించారు. ఏపీ ఇప్పటికే కృష్ణా నది నుంచి 646 టీఎంసీలను వినియోగించుకుందని.. గత మూడు నెలలుగా నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా రోజుకు 10,000 క్యూసెక్కులను ఉపసంహరించుకుంటోందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే రేవంత్ సర్కారు మౌనంగా ఉందని విమర్శలు గుప్పించారు.

## చట్టవిరుద్ధంగా కూల్చివేతలేంటీ?

(1వపేజీ తరువాయి)హైడ్రా ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ ను కోర్టు ఆదేశించింది. దర్యాప్తు లేకుండానే కూల్చివేతలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్క్ ప్రాంతంలో నిర్మాణం జరుగుతోందని ఆరోపిస్తూ గాయత్రి సభ్యుల సంఘం దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా హైడ్రా నోటీసులు జారీ చేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. భూమి మార్పిడి చర్యలు, అమ్మకపు పత్రాలు, పంచాయతీ అనుమతులను సమర్పించినప్పటికీ తమను విచారించకుండా హైడ్రా ఏకపక్షంగా నిర్మాణాన్ని కూల్చివేసిందని పిటిషనర్ తెలిపారు. ఈ క్రమంలో డాక్యుమెంట్లు సమర్పించడానికి హైడ్రా 24 గంటల సమయం కూడా ఇవ్వదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. జూన్ 8న నోటీసు ఇచ్చి, జూన్ 9న కూల్చివేత జరిగిన మునపటి కేసును ఆయన ఉదహరించారు. హైడ్రా చర్యలు ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తున్నాయని కోర్టు పేర్కొంది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసే వారికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక సూచన చేశారు.ఫామ్ ప్లాట్ల పేరిట అనుమతులు లేని లేఔట్లలో ప్లాట్ లను కొనుగోలు చేయొద్దని ఆయన సూచించారు. అనుమతులు లేని లేఔట్లలో కొనుగోలు చేస్తే తర్వాత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఫామ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉందని ఆయన పేర్కొన్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో అమ్మకాలు జరుగుతున్నాయని చెప్పారు.

## వివాహమైన మూడో రోజే నవ వధువు ఆత్మహత్య

కంభం-నవభూమి: కాళ్లపారాణి ఆరక ముందే ఓ నవవధువు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ప్రకాశం జిల్లా కంభం మండల దేవనగరంలో మంగళవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవనగరం గ్రామానికి చెందిన బి.లింగయ్య, సువార్తమ్మ కుమార్తె సుస్మిత(21)కు పెద్దారవీడు మండలం సిద్దినాయుడుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు ఈనెల 16న వివాహమైంది. పెళ్లికుమారుడి గ్రామంలో వివాహం జరిగింది. సోమవారం ఉదయం సుస్మిత, వెంకటేశ్వర్లు దేవనగరం వచ్చారు. దేవనగరం నుంచి వరుడు గ్రామానికి బుధవారం సారె తీసుకుని వెళ్లాలి. అందుకోసం మంగళవారం ఉదయం నుంచి కుటుంబసభ్యులు హడావుడిగా ఉన్నారు. ఆ సమయంలో సుస్మిత తాను బాబాయి వాళ్ల ఇంట్లో నిద్రపోతానని వెళ్లింది. పెళ్లికుమారుడు అత్తగారి ఇంట్లో నిద్రపోయాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సుస్మితను భోజనానికి పిలిచేందుకు అన్న మహేష్ వెళ్లాడు. ఇంట్లో చెల్లెలు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటం గమనించి కిందికి దించాడు. విషయం తెలిసి కుటుంబసభ్యులు, బంధువులు వచ్చి చూసి అప్పటికే మృతిచెందినట్టు గుర్తించారు. వివాహమైన మూడో రోజే సుస్మిత అఘాయిత్యానికి పాల్పడటంతో రెండు కుటుంబాల వారు బోరున విలపిస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఇష్టంలేని పెళ్లి చేశారని, దీంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పెళ్లికుమారుడి కుటుంబసభ్యులు చెబుతున్నారు.

## ఏపీలో జీబీఎస్ విజృంభణ..

(1వపేజీ తరువాయి)నెలకొన్నాయి. వ్యక్తిగతంగా జీబీఎస్ పై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కరోనా సమయంలో కనీసం వ్యాధి లక్షణాలపై అందరికీ అవగాహన కల్పించారు. కానీ జీబీఎస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన లోపించింది. వ్యాధి లక్షణాలు విచిత్రంగా ఉండటంతో బాధితులు వెంటనే తెలుసుకోలేకపోతున్నారని చెబుతున్నారు. వ్యాధి లక్షణాలపై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా మరణించే ప్రమాదం ఉందని జరుగుతున్న ప్రచారం ప్రజలను భయపెడుతోంది. కాగా, జీబీఎస్ మరణాలపై ప్రభుత్వం అప్రమత్తమైంది. వ్యాధిని సరైన సమయంలో గుర్తించకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. శ్రీకాకుళంలో ఆరేళ్ల బాలుడు, ప్రకాశం జిల్లాలో మరణించిన మహిళను నాలుగైదు ఆస్పత్రులకు తిప్పడం, చివరగా ప్రభుత్వ ఆస్పత్రికి తేవడం వల్ల ఆరోగ్యం క్షీణించి మరణించినట్లు చెబుతున్నారు. దీంతో ఈ వ్యాధి నిర్ధారణకు ప్రభుత్వం ప్రత్యేక పరీక్షలను నిర్వహిస్తోంది. జీబీఎస్ లక్షణాలు అందరికీ ఒకేలా ఉండటం లేదు. కొంత మందికి దగ్గు, జ్వరంతోపాటు కాళ్లు, చేతులు పట్టేస్తున్నాయి. కొంతమందికి విరేచనాలు అవుతున్నాయి. ఏదైనా నాడీ వ్యవస్థ దెబ్బతీస్తోందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా నరాల సమస్యలు ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

## కూటమి 'నాడి'

(1వపేజీ తరువాయి)నిర్లిప్తంగా ఉంది. అదేసమయంలో 11వ పీఆర్సీ వేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపైనా సర్కారు ఏమీ తేల్చలేక పోతోంది. దీంతో ఉద్యోగులు.. కూటమి వచ్చినా..తమకు కష్టాలు తప్పలేదని అంటున్నారు. ఇక, నిరుద్యోగులకు ఇచ్చిన హామీ.. డీఎస్సీ సహా ఉద్యోగ కల్పన వంటివి కూడా ముందుకు సాగలేదు. సీఎం చంద్రబాబు మలి సంతకంగా.. డీఎస్సీపైనే చేసినా.. అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీంతో వారు కూడా రగులుతున్నారన్నది తాజాగా సర్కారుకు అందిన సమాచారం. ఇక, టీచర్లు మాత్రం మిశ్రమంగా ఉన్నారు. వారి బదిలీలవిషయంలో సర్కారు సానుకూలంగా ఉండడం ఒక్కటే కలిసి వస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ మేరకు కూటమి ప్రభావం చూపు తుందనేది ఆసక్తిగా మారింది.

## పల్లీపట్టీల పంపిణీ నిలిపివేత

(1వపేజీ తరువాయి)ప్రత్యామ్నాయంగా విద్యార్థులకు అరటి పండ్లు లేదా బెల్లం-వేరుశనగతో కూడిన పల్లిపట్టీని అందించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ 2021 చివరిలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం కావడానికి ముందే పల్లీపట్టీల శాంపిల్స్ ను అందించాలని కర్ణాటక ప్రభుత్వం మిల్క్ ఫెడరేషన్ ను కోరింది. మరోవైపు, డిసెంబర్ 2022లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డిపార్ట్‌మెంట్ అందించిన డేటా ప్రకారం 2.27 లక్షల మంది పిల్లలు మాత్రమే పల్లీపట్టీని ఇష్టపడుతున్నారు. దాదాపు 80 శాతం మంది విద్యార్థులు తమ మధ్యాహ్న భోజనంలో గుడ్లు ఉండాలని ఎంచుకున్నారు. పల్లీపట్టీలను పరిపూరక ఆహారంగా ప్రవేశపెట్టిన సంవత్సరం తర్వాత.. 1 నుంచి 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నుంచి ఈ డేటాను సేకరించారు.

## రేపు దిల్లీ సీఎం ప్రమాణస్వీకారం

(1వపేజీ తరువాయి)రాందేవ్, స్వామి చిదానంద, బాబా భాగేశ్వర్ ధీరేంద్ర శాస్త్రి హాజరు కానున్నారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.
ఎల్లుండి సాయంత్రం 4.30 గంటలకు నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. అయితే, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది ఇంకా ప్రకటించలేదు. మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. రేపు బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై, శాసనసభా పక్ష నేతను, మంత్రులను ఎన్నుకోనుంది.

## ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా ప్రొ. జీపీ రాజశేఖర్

(1వపేజీ తరువాయి)కొనసాగనున్నారు. ఈ మేరకు వీసీల నియామకంపై ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇక విక్రమ సింహపురి వర్సిటీ వీసీగా అల్లం శ్రీనివాసరావు, ఆదికవి నన్నయ వర్సిటీ వీసీగా ప్రసన్న శ్రీ, కృష్ణా వర్సిటీ వీసీగా కె.రాంజీ, తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీగా వి.ఉమ, అనంతపురం జేఎన్టీయూ వీసీగా హెచ్.సుదర్శనరావు, రాయలసీమ వర్సిటీ వీసీగా వెంకట బసవరావులను నియమించారు.

## త్వరలో అందుబాటులోకి క్యాన్సర్ టీకా

(1వపేజీ తరువాయి)పరిశోధనలు పూర్తి కావొచ్చాయని, ట్రయల్స్ కొనసాగు తున్నాయని ఆయన తెలిపారు.
ఈ రోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందని, ఈ సమస్యను పరిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. ముప్పై ఏళ్లు పైబడిన మహిళలకు ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారని తెలిపారు. వ్యాధిని గుర్తించేందుకు డే-కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.
క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని రద్దు చేసినట్లు తెలిపారు. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ టీకా రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను నియంత్రిస్తుందని కేంద్రమంత్రి తెలిపారు.

## విడదల రజనీకి హైకోర్టులో బిగ్‌రిలీఫ్

(1వపేజీ తరువాయి)రజనీ, ఆమె పీఏలపై అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే తాజాగా ఆమె దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రస్తుతానికి ఆమెపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎల్లుండి తదుపరి విచారణ జరిగే వరకూ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకునేందుకు వీల్లేదు.

## కాలినడకమార్గంలో గుండెపోటుతో భక్తుడి మృతి

తిరుమల-నవభూమి: శ్రీవారి దర్శనార్థం కాలినడకన తిరుమలకు వస్తున్న ఓ తెలంగాణ భక్తుడు మంగళవారం గుండెపోటుతో మరణించాడు. రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్‌కు చెందిన వెంకటేష్(50) కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి శ్రీవారిమెట్టు మార్గంలో మంగళవారం ఉదయం తిరుమలకు బయలుదేరాడు. 400వ మెట్టు వద్ద ఒక్కసారిగా ఛాతినొప్పితో కుప్పకూలిపోయాడు. వెంకటేష్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ | బుధవారం | 19 । ఫిబ్రవరి । 2025



# సీఎంతో విభేదాలపై ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌, ఆయన డిప్యూటీ ఏక్‌నాథ్ షిండేకు మధ్య 'ప్రచ్ఛన్న యుద్ధం' జరుగుతోందా? 20 మంది శివసేన వర్గం ఎమ్మెల్యేల భద్రతను 'వై ప్లస్' క్యాటగిరికి తగ్గించడం, రాయ్‌గఢ్, నాసిక్‌లకు ఇన్‌చార్జుల నియామకంపై షిండే శివసేన అభ్యంతరం తెలవడం వంటి వరుస పరిణామాల నేపథ్యంలో ఇద్దరి మధ్యా వ్యవహారం చెడిందనే ఊహాగానాలు ఉపందుకుంటున్నాయి. దీనిపై ఏక్‌నాథ్ షిండే ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు.సీఎం, డిప్యూటీ సీఎం మధ్య "కోల్డ్ వార్" నడుస్తున్నట్టు మీడియాలో వస్తున్న వార్తలపై షిండే స్పందిస్తూ, తమ మధ్య ఎలాంటి "కోల్డ్ వార్" లేదన్నారు. "థండా థండా కూల్ కూల్" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. "ఎలాంటి కోల్డ్ వార్ లేదు. మాదేమీ మహా వికాస్ అఘాడి (విపక్ష కూటమి) కాదు, ఇండి కూటమి కాదు. రాష్ట్ర ప్రగతి కోసం మేము సమష్టిగా పనిచేస్తున్నాం" అని ఏక్‌నాథ్ షిండే వివరణ ఇచ్చారు.20 మంది ఎమ్మెల్యేల భద్రత కుదింపు..సీఎం ఫడ్నవిస్ నేతృత్వంలో రాష్ట్ర హోం శాఖ ఇటీవల శివసేనకు చెందిన 20 మంది అధికార ఎమ్మెల్యేల 'వై' కేటగిరి భద్రతను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. బీజేపీ, ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేల భద్రతను కూడా తగ్గించనుంది. అయితే షిండే వర్గంతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువనే చెప్పాలి. గతంలో ఎంవీఏ నుంచి అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు ఈ వై కేటగిరి భద్రత కల్పించగా, రాష్ట్ర వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా ప్రభుత్వం ఆ భద్రతను 'వై ప్లస్'కు కుదించింది.

# ఆలయాలు ఎలా ఉండకూడదో తమిళనాడులో చూడొచ్చు



**తిరుపతి-నవభూమి:** ఆలయాలు ఎలా ఉండకూడదో తమిళనాడులో చూడవచ్చని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై అన్నారు. మంగళవారం నాడు తిరుపతిలో నిర్వహించిన టెంపుల్ ఎక్స్‌పోలో ఆయన మాట్లాడుతూ.. 600 ఆలయాలు వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మించినవి ఉన్నాయన్నారు. చారిత్రాత్మిక ఆలయాలను రిపేర్ల పేరుతో దుర్మార్గంగా ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. 2026 తమిళనాడులో బీజేపీ అధికారంలోకి వస్తే దేవాదాయ శాఖ నుంచి అన్ని ఆలయాలను విముక్తి చేస్తామన్నారు. తమిళనాడులో దేవాదాయ శాఖ అమల్లోకి వచ్చే నాటికి 44 వేల ఆలయాలకు చెందిన అయిదు లక్షల ఎకరాలు వారి కంట్రోల్ ఉందని.. ఇప్పుడు లక్ష ఎకరాలు మాత్రమే ఆలయాల పరిధిలో ఉందని తెలిపారు.

ఏమైంది నాలుగు లక్షల ఎకరాలు అని చూస్తే రాజకీయ నేతలే 99 నుంచి 50 సంవత్సరాలకు ఒక రూపాయి లీజుకు తీసుకుని ఉన్నారని వెల్లడించారు. మీనాక్షి అమ్మవారి ఆలయం సమీపంలో 50 మీటర్ల దూరంలో బీఫ్ మాసం అమ్ముతున్నారని తెలిపారు. లక్షల మంది మహిళలు వచ్చే ఉత్సవాలకు కూడా మరుగుదొడ్లు ఉండటం లేదని.. ఇలా చేయటం ద్వారా దేవుడికి భక్తులు దూరం అయ్యేలా ద్రవిడ పార్టీలు చేస్తున్నాయని విమర్శించారు.కాగ్‌కు దేవాదాయ శాఖ లెక్కలు చూటం లేదని.. లక్షల కొద్ది ఆడిట్ అభ్యంతరాలున్నాయన్నారు. కమిషన్ ఏజెంట్ల లాగా అధికారులు ఆలయాల్లో జలగల్లా పని చేస్తున్నారని ఆరోపించారు. వీఐపీ కల్చర్ ఆలయాల నుంచి పోవాలన్నారు. ఆలయాలు ప్రభుత్వం పరిధి నుంచి బయటకు వస్తే బ్రాహ్మణులు ఆలయాలను డామినేట్ చేస్తారని అంటారని.. తమిళనాడులో ఆ పరిస్థితి లేదన్నారు. ఏ కులం వారు ఆలయాన్ని నిర్మించారో వారే ఆయా ఆలయాల్లో అర్చకులుగా పని చేసేలా తమిళనాడులో పూర్వకాలంలో ఆలయాలు ఉన్నాయని తెలిపారు.తిరుమల ఆలయాన్ని స్టాక్ మార్కెట్‌లో పెట్టాలంటే 2.5 లక్షల కోట్లు మార్కెట్ విలువ ఉంటుందన్నారు. పది టన్నులు బంగారు బ్యాంకుల్లో ఉందని.. 2.5 టన్నుల ఆభరణాలుగా ఉన్నాయన్నారు. 960 చోట్ల ఆస్తులున్నాయని తెలిపారు. 38 శాతం ఉద్యోగాలు తిరుమల ఆలయంపైనే ఆదారపడి ఉందన్నారు. భారతదేశం మొత్తంలో 35 లక్షల ఆలయాలున్నాయని.. ఆలయాలు ఐక్యతకు వేదికలవుతున్నాయని చెప్పారు. దక్షిణాది వారు ఉత్తారాది ఆలయాలకు, ఉత్తారాది వారు దక్షిణాదికి వెళ్లటంతో ఒక్కతాటిపైకి వచ్చి కనెక్టివిటీ పెరుగుతుందని బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు.

# మృత్యుకుంభంగా మారిన మహా కుంభమేళా..: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో రచ్చ



**పశ్చిమ బెంగాల్-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ షాకింగ్ కామెంట్లు చేశారు. ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను లక్ష్యంగా చేసుకుని.. మహా కుంభమేళా మృత్యు కుంభంగా మారిందని వివరించారు. అక్కడి సర్కారు సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని.. దీని వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోగా మరెంతో మంది గాయపడ్డారని చెప్పుకొచ్చారు. అలాగే తనకు మహా కుంభమేళాపై భక్తి ఉందని.. గంగమ్మ తల్లి అంటే గౌరవం ఉందని వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.జనవరి 29వ తేదీన మౌని అమావాస్య పురస్కరించుకుని అనేక మంది భక్తులు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లారు. అక్కడే గంగ, యమున, సరస్వతీ నదులు అయిన త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఈక్రమంలోనే భక్తుల రద్దీ ఎక్కువ కాగా.. చీకట్లో ముందున్న చెత్త బుట్టలు కనిపించక కొంత మంది కిందపడ్డారు. అది గమనించకుండా వెళ్లి మరికొంత మంది వారిపై పడగా.. తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 30 మంది ప్రాణాలు కోల్పోగా.. 60 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని నేరుగా యూపీ సర్కారే వెల్లడించారు.అయితే తాజాగా ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. అసెంబ్లీలో మంగళవారం రోజు మాట్లాడుతూ.. ఉత్తర ప్రదేశ్ సర్కారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహా కుంభమేళా మృత్యుకుంభంగా మారిందని అన్నారు. అందుకు ప్రధాన కారణం అక్కడి సర్కారేనని చెప్పారు. తనకు కుంభమేళాపై ఎంతో భక్తి ఉందని.. గంగమ్మ తల్లిపై గౌరవం కూడా ఉందని వివరించారు. అయితే అన్ని కోట్ల మంది వస్తున్న కుంభమేళాలో ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందని.. కానీ అక్కడి సర్కారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని ఆరోపించారు.అలాగే తొక్కిసలాటలో గాయపడ్డ 60 మందిలో ఇప్పటి వరకు ఎంత మంది కోలుకున్నారని సీఎం మమతా బెనర్జీ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ప్రశ్నించారు. కుంభమేళాలో వీఐపీల కోసం ప్రత్యేక టెంట్లను అందించారని అందుకోసం లక్ష రూపాయల వరకూ కూడా ఛార్జ్ చేశారని చెప్పారు. కానీ మధ్య తరగతి, పేద ప్రజల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ఆరోపించారు. తొక్కిసలాట అనేది సాధారణమే అయినా.. సర్కారు వాటిని అడ్డుకోవడానికి ఏం చేసిందనేది ఇక్కడ ముఖ్యం అంటూ వ్యాఖ్యానించారు.ఇవి మాత్రమే కాకుండా అమెరికా అక్రమ వలసదారులను తిరిగి భారత్ పంపించడం, బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న గందరగోళం వంటి అంశాలపై కూడా అసెంబ్లీలో మాట్లాడారు. బీజేపీ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. ఇప్పటికైనా యూఎస్ పంపిస్తున్న అక్రమ వలసదారులను వారి విమానాల్లో కాకుండా భారత విమానాల్లో తీసుకు రావాలని చెప్పారు.

# ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారం.. 50 మంది సినీ ప్రముఖులు



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ ముఖ్యమంత్రి ఎవరు అనేది ఇంకా ఖరారు కానున్నా.. ఫిబ్రవరి 20న ప్రమాణస్వీకార కార్యక్రమం రామ్‌లీలా మైదానంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రమాణస్వీ కారానికి బీజేపీ సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రులు, వారి మిత్ర పక్షాలు హాజరుకానున్నాయి. 26 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికారం చేపట్టిన బీజేపీ.. ఈ విజయాన్ని చిరకాలం గుర్తుండిపోయేలా ప్రమాణ స్వీకర వేడుకను నిర్వహించాలని భావిస్తోందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గురువారం సాయం త్రం 4.30 గంటలకు ప్రారంభం కానుండగా.. ప్రముఖ గాయకుడు కైలాశ్ ఖేర్ షో కూడా ఏర్పాటుచేసినట్టు తెలుస్తోంది.మొత్తం 20 రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు హాజరవుతున్నారు. వీరితో పాటు ముఖ్య దేశాలకు చెందిన దౌత్యవేత్తలను కూడా ఆహ్వానించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఇందులో పాల్గొననున్నారు. 50 మందికిపైగా సినీ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు హాజరవుతున్నారు. వీరితో పాటు రైతులు, లాడ్లీ బెహన్లు సహా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులు, సామాన్యులను కూడా ప్రమాణస్వీకారానికి ఆహ్వానించడం విశేషం. వీరితో పాటు బాబా రామ్‌దేవ్, స్వామి చిదానంద, బాబా భగవేశ్వర్ ధీరేంద్ర శాస్త్రి సహా పలువురు ఆధ్యాత్మికవేత్తలను ఈ కార్యక్రమానికి పిలిచారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ... ఫలితాలు వెలువడి 10 రోజులు గడిచినా సీఎం ఎవరనేది ఇంకా తేల్చలేకపోతోంది. ప్రభుత్వ ఏర్పాటుపై కసరత్తు చేస్తోన్న కమలనాథులు... సీఎంను ఎన్నుకునేందుకు బుధవారం శాసనసభాపక్షం సమావేశం నిర్వహిస్తున్నారు. అయితే, పది రోజులు గడిచిపోయిన కొత్త ప్రభుత్వం కొలువుదీరకపోవడంపై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని నడిపే విశ్వసనీయమైన సారథే లేరని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఆతిశీ విమర్శించారు. బీజేపీ నుంచి విజయం సాధించిన 48 మంది ఎమ్మెల్యేలపై ప్రధాని మోదీకి నమ్మకం లేదని ఆమె ఎద్దేవా చేశారు. వచ్చే అయిదేళ్లలో ఢిల్లీ ప్రజలు ముగ్గురు సీఎంను చూసే అవకాశం ఉందంటూ ఆప్ సీనియర్ నేత గోపాల్ రాయ్ జోస్యం చెప్పారు. ఫిబ్రవరి 8న ఢిల్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే.

# పేపర్ల లీకేజీ వార్తలు నిరాధారం: సీబీఎస్ఈ



**న్యూఢిల్లీ-నవభూమి:** పరీక్షల పేపర్లు లీకయ్యాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై సీబీఎసఈ స్పష్టత ఇచ్చింది. ఆ ప్రచారం అంతా నిరాధారమని కొట్టిపారేసింది. అసత్య ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. 10, 12 తరగతుల పేపర్లు లీక్ అయ్యాయంటూ జరుగుతున్న ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీబీఎసఈ సూచించింది. వదంతులకు కారకులపై చర్యలు తీసుకుంటున్నామని బోర్డు అధికారులు వెల్లడించారు. "వదంతుల ప్రచారంలో విద్యార్థుల పాత్ర ఉంటే.. తదనంతర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. సీబీఎసబీ నిబంధనలు, ఐపీసీ సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని బోర్డు సీనియర్ అధికారి అన్నారు.

# ఎయిర్‌పోర్ట్ అథారిటీలో 83 ఖాళీలు



**న్యూఢిల్లీ-నవభూమి:**న్యూఢిల్లీలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) 83 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనుంది. వాటిలో జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీసెస్) పోస్టులు 13, జూనియర్ ఎగ్జిక్యూటివ్(హ్యూమన్ రిసోర్సెస్) పోస్టులు 66, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (అఫీషియల్ లాంగ్వేజ్) పోస్టులు 4 ఉన్నాయి. సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, ఎంబీఏ, పీజీ పాసై, అనుభవం ఉన్నవారు మార్చి 18లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం వివరాల కోసం https://www.aai.aero వెబ్‌సైట్ చూడవచ్చు.

# త్రిబుల్ బెడ్రూం ఫ్లాట్‌లో 350 పిల్లులు..
# అమ్మాయి ప్రేమ చూసి అవాక్కవుతున్న జనాలు!



**న్యూఢిల్లీ-నవభూమి:**కొందరికి పెంపుడు జంతువులు అంటే చాలా ఇష్టం ఉండగా.. మరికొంత మందికి అవంటే అసలు నచ్చవు. భయంతోనే, పెంచాలనే ఆసక్తి లేకనో, చూస్తేనే ఇష్ట పడకపోవడం వల్లనో ఇలా చేస్తుంటారు. అలాంటి వారి ఇళ్ల పక్కన పెంపుడు జంతువులు పెంచుకునే వాళ్లుంటే వారు పడే సమస్యలు మాటల్లో చెప్పలేం. అచ్చంగా ఇలాంటి సమస్యలనే ఎదుర్కొం టున్నారు పుణేకు చెందిన ఓ అపార్ట్‌మెంట్ వాసులు. అక్కడే ఉండే ఓ అమ్మాయి ప్రేమ వల్ల తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎందుకు అనేది మనం ఇప్పుడు తెలుసుకుందాం.పుణేలోని హడప్సర్ ప్రాంతంలోని మార్వెల్ బౌంటీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని ఓ అపార్ట్‌మెంట్‌కు చెందిన మహిళ త్రిబుల్ బెడ్రూం గదిలో నివసిస్తోంది. అయితే ఆమెకు చిన్నప్పటి నుంచి పిల్లులు అంటే చాలా ఇష్టం. దీంతో ఆమె తన ఇంట్లో పిల్లులు పెంచుకుంటోంది. ఒకటో, రెండో లేదా మూడో పెంచుకుంటే పెద్ద సమస్య ఏమీ లేదు. కానీ ఆమె ఏకంగా ఏకంగా 350 పిల్లలను పెంచుకుంటోంది. వాటిని చూసుకునేందుకు గాను మొత్తంగా ఆరుగురు పని వాళ్లను కూడా నియమించుకుంది.

వారంతా రోజూ ఉదయమే అక్కడకు వస్తూ.. ఫ్లాట్‌లోనే ఉండి వాటి బాగోగులు చూసేవారు. ముఖ్యంగా పిల్లులకు ఆహారం పెట్టడం, స్నానం చేయించడం, గదులు శుభ్రం చేయడం వంటివి చేసేవారు. అయితే మొదట్లో తక్కువ పిల్లులను మాత్రమే పెంచగా.. ఎవరూ అడ్డు చెప్పలేదు. కానీ అంతకంతకూ వాటి సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో పిల్లులు తరచుగా అరవడం, గోల చేయడంతో.. పక్క ఫ్లాట్ల వారికి సమస్యలు ప్రారంభం అయ్యాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు అయితే భయంతో ఉలిక్కిపడుతూ ఏడవడం ప్రారంభించారు. కొందరు మహిళలు సైతం తీవ్ర భయాందోళనకు గురయ్యారు.


ఇలా రోజూ సమసస్యలు వస్తుండగా.. వారు ఆ ఇంట్లో ఎన్ని పిల్లులు ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈక్రమంలోనే ఆ ఇంట్లో పని చేస్తున్న వారి ద్వారా మహిళ మొత్తంగా 350 పిల్లులు పెంచుతున్నట్లు తెలుసుకుని షాక్ అయ్యారు. వెంటనే వెళ్లి మహిళతో మాట్లాడారు. పిల్లులను ఎక్కువగా పెంచొద్దని ఆమెను కోరగా.. ఆమె మాత్రం అందుకు అంగీకరించలేదు. నా పిల్లులు, నా ఇంట్లో నేను పెంచుకుంటున్నానంటూ వాదన ప్రారంభించింది. అలాగే పని వాళ్లను పెట్టుకుని ఇళ్లు, పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకుంటున్నానని.. అలాంటప్పుడు మీకేంటి సమస్య అంటూ తగువులాడింది.దీంతో కొంత కాలం భరించిన ఇరుగుపొరుగు వాళ్లు ఆ తర్వాత నేరుగా వెళ్లి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే అధికారులు ఆమె ఇంటికి వచ్చి తనిఖీ చేయగా.. 350 పిల్లులను గుర్తించారు. ఆపై 48 గంటల్లోనే పిల్లులను ఖాళీ చేయించాలని నోటీసులు జారీ చేశారు. లేకపోతే అధికారులే వచ్చి పిల్లులను ఇంటి నుంచి తీసుకెళ్లిపోతారని చెప్పారు. అయితే దీనిపై మహిళ ఇంకా స్పందించలేదు. మరి అధికారుల ఆదేశాల మేరకు పిల్లలను తరలిస్తుందా.. లేక ఇంట్లోనే ఉంచుకుని అపార్ట్‌మెంట్ వాసులందరికీ సమస్యలు సృష్టిస్తుందా చూడాలి.

# ఢిల్లీలో భూకంపం ఆ సమయంలో 'బూమ్' అని భారీ శబ్దం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీ, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో సోమవారం ఉదయం 5.36గంటలకు భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.0గా నమోదైంది. ఢిల్లీకి ఆనుకొని ఉన్న ధౌలా కౌన్ ప్రాంతంలోని జీల్ పార్కు కేంద్రంగా 5 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉన్న కారణంగా బలమైన భూ ప్రకంపనలు సంభవించాయి. దీంతో, ఢిల్లీ, నోయిడా, గాజియాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఢిల్లీలో ఈ స్థాయిలో బలమైన ప్రకంపనలు ఇంతకుముందు రాలేదని స్థానికులు తెలిపారు. భూకంపం సంభవించినప్పుడు బాంబు పేలినట్లు 'బూమ్' అని భారీ శబ్దం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు.

# ఐటీ బిల్లులో ఎన్నికల బాండ్లకు అవకాశం!




**న్యూఢిల్లీ-నవభూమి::** కొత్త ఆదాయ పన్ను బిల్లు-2025లో ఎన్నికల బాండ్లకు సంబంధించి నిబంధనలను చేర్చడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల బాండ్లను సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంది. గత ఏడాది ఫిబ్రవరి 15న ఇచ్చిన ఉత్తర్వుల్లో కేంద్ర ఎలక్టోరల్ బాండ్ స్కీంను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే కొత్త ఐటీ బిల్లు షెడ్యూల్ 8లో ఎన్నికల బాండ్ల గుర్తించి ప్రస్తావన చేశారు. చట్టాల్లోని లోపాలను ఆసరాగా చేసుకొనో, లేదంటే వేరే వేరే రూపాల్లోనో ఎన్నికల బాండ్లను తిరిగి ప్రవేశపెట్టాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోందని నిపుణులు విశ్లేషించారు.

# ఆ పనులకు నీళ్లు వాడారంటే రూ.5 వేల జరిమానా..
# బెంగళూరు వాసులకు షాకిచ్చిన సర్కారు!



**న్యూఢిల్లీ-నవభూమి:**వేసవి కాలం రాకముందే ఎండలు మండిపోతున్నాయి. ఈక్రమంలోనే భూగర్భ జలాలు తగ్గిపోతూ.. ప్రజలను ముప్పుతిప్పులు పెడుతున్నాయి. ముఖ్యంగా బెంగళూరు పట్టణంలో నీటి సంక్షోభం ఎక్కువగా ఉండగా.. అక్కడి సర్కారు ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటుంది. తాగేందుకు గుక్కెడు మంచినీళు దొరక్కుండా అనేక మంది పడుతున్న ఇబ్బందులను గుర్తించి.. నీటి వృథాను అరికట్టబోతుంది. తాగునీటిని ఆయా పనులకు వాడారంటే కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసింది. మరి ఆ పనులు ఏంటి, ఎంత మొత్తంలో జరిమానాలు విధించబోతుందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.వేసవి కాలం రాకముందే బెంగళూరు వాసులు తాగేందుకు నీళ్లు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. ఈక్రమంలోనే ఎండల తీవ్రతను, నీటి సమస్యను దృష్టిలో పెట్టుకున్న కర్ణాటక ప్రభుత్వం ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. తాగు నీటితో కార్ వాష్, గార్డెనింగ్, భవన నిర్మాణం, రోడ్లను శుభ్రపరచడం, ఫౌంటేయిన్సు, వినోద ప్రయోజనాల కోసం, సినిమా హాళ్లు, క్లీనింగ్, వంటగదిలో పాత్రలు కడగడం వంటివి చేయడాన్ని నిషేధించింది.

ఒకవేళ తమ మాట పట్టించుకోకుండా తాగు నీరు ఈ రకంగా వృథా చేస్తే.. వాటర్ బోర్డు చట్టంలోని సెక్షన్ 109 ప్రకారం రూ.5 వేల జరిమానా విధిస్తామని కూడా ప్రకటించింది. తొలి సారి నిబంధనలు ఉల్లంఘించిన వారికి 5 వేల రూపాయలే జరిమానా విధిస్తామని.. కానీ పదే పదే తప్పును పునరావృతం చేస్తే 500 రూపాయల చొప్పున పెంచుకుంటూ పోతామని బెంగళూరు నీటి సరఫరా మురుగు నీటి పారుదల బోర్డు వెల్లడించింది.అంతేకాకుండా ఎవరైనా తాగు నీటిని వృథా చేస్తూ కంటపడితే 1916 నెంబర్ ద్వారా బీడబ్ల్యూఎస్ఎస్‌బీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించింది. పెరుగుతున్న ఉష్ణోగ్రత దృష్ట్యా భూగర్భ జలాలు క్షీణించి నీటి సమస్య ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉండడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా బెంగళూరులో ప్రస్తుతం 1.40 కోట్ల జనాభా ఉందని.. వారందరికీ సరిపడా నీళ్లు కావాలంటే ఏ ఒక్కరూ నీటిని వృథా చేయకూడదని వివరించింది.గతేడాది కూడా ఇలాంటి సమస్యలే ఏర్పడగా.. ఒక్క నీటి ట్యాంకర్ కోసం ప్రజలు 1500 రూపాయల నుంచి 6 వేల రూపాయల వరకూ చెల్లించాల్సి వచ్చిందని గుర్తు చేసింది. అలాగే పట్టణ వ్యాప్తంగా మొత్తం 16 వేల 781 బోర్ వెల్స్ ఉండగా.. అందులో 7,784 మాత్రమే పని చేస్తున్నాయని చెప్పింది. మిగతా 6, 997 ఎండిపోయినట్లు వెల్లడించింది. మరోసారి ఇలాంటి సమస్యలు రాకూడదనే ఉద్దేశంతోనే ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని.. ప్రజలంతా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిని వినియోగించాలని చెప్పుకొచ్చింది.

# నేవీలో 270 ఉద్యోగాలు



**కేరళ-నవభూమి:** కేరళ ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో 2026 జనవరి నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్‌సీ) కోర్సులో 270 ఖాళీలకు అవివాహిత యువతీ, యువకుల నుంచి భారత నౌకాదళం దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(హైడ్రో కేడర్) పోస్టులు 60, పైలెట్ పోస్టులు 26, నేవీ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(అబ్జర్వర్) పోస్టులు 22, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ పోస్టులు 18 పోస్టులు, లాజిస్టిక్స్ పోస్టులు 28, ఎడ్యుకేషన్ పోస్టులు 15, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) పోస్టులు 38, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) పోస్టులు 45, నేవీ కన్‌స్ట్రక్షన్ పోస్టులు 18 ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం https://www.joinindiannavy.gov.in వెబ్‌సైట్ చూడవచ్చు.

# ఆర్మీలో ఎన్‌సీసీ అధికారి పోస్టులు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఎన్‌సీసీ అధికారి పోస్టులకు భారత సైన్యం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇండియన్ ఆర్మీ ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ 58వ కోర్సు ద్వారా అవివాహితులైన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. పురుషులకు 70 పోస్టులు, మహిళలకు 6 పోస్టులున్నాయి. ఇందులో 8 పోస్టులను యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు. 50 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసిన వారే ఈ ఉద్యోగాలకు అర్హులు. అలాగే ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్‌లో కనీసం బీ గ్రేడ్ సాధించాలి. ఆర్మీ అమరుల పిల్లలకు సీ సర్టిఫికెట్ అవసరం లేదు. అభ్యర్థుల వయసు 2025 జూలై 1 తేదీ నాటికి 19 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. అర్హత కలిగిన అభ్యర్థులు మార్చి 15వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల కోసం https://joinindi anarmy.nic.in/default .aspx వెబ్‌సైట్ సందర్శించవచ్చు.

## కొత్త సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం ఎన్నికల కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జ్ఞానేశ్‌కుమార్.. భారతదేశ 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా.. ప్రస్తుతం హరియాణా సీఎస‌గా విధులు నిర్వర్తిస్తున్న వివేక్ జోషి (1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి) నియమితులయ్యారు. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారం ముగియనున్న నేపథ్యంలో.. తదుపరి సీఈసీని ఎంపిక చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ సోమవారం భేటీ అయింది. ప్రధానమంత్రి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరయ్యారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ నేతృత్వంలోని సెర్చ్‌కమిటీ ప్రతిపాదించిన ఐదుగురు అభ్యర్థుల జాబితా నుంచి జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీగా వారు ఎంపిక చేసి తమ నిర్ణయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఫారసు చేసినట్టు కేంద్ర న్యాయశాఖ వెల్లడించింది.కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన జ్ఞానేశ్‌కుమార్ (61) గతంలో పలు కీలక శాఖల్లో సేవలందించారు. ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసే బిల్లు రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. అయోధ్యలో రామమందిరం కేసుకు సంబంధించిన పత్రాల వ్యవహారాన్ని.. హోం శాఖలో అదనపు కార్యదర్శిగా ఆయనే పర్యవేక్షించారు.



## పరీక్షా ఫలితాలే జీవిత విజయమా?

పరీక్షల సీజన్లలో దేశంలో ప్రతి ఏటా విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. అధిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం 2022లో మొత్తం 1,70,924 ఆత్మహత్యలు నమోదు కాగా, వాటిలో 7.6 శాతం ఆత్మహత్యలు విద్యార్థులవి. వీటిలో పరీక్షల్లో ఫెయిల్ అవుతామన్న భయంతో చేసుకున్న ఆత్మహత్యలు 2,248. ఈ ఆందోళనకరమైన ధోరణి భారతీయ సమాజాన్ని ఆవరించిన విద్యా ఒత్తిడిని నొక్కి చెబుతుంది.పెరుగుతున్న పరీక్షా ఒత్తిడి సంక్షోభానికి ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం 2018లో 'పరీక్షా పే చర్చ' (పీపీసీ)ను ప్రారంభించింది. ప్రతి సంవత్సరం జనవరి / ఫిబ్రవరి నెలల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎంపిక చేయబడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి, ఎంపిక చేయబడ్డ ప్రశ్నలకు ప్రధానమంత్రి సమాధానాలిస్తూ ప్రసంగిస్తారు. పరీక్షలకు సంబంధించిన ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో సలహాలు అందిస్తారు. ఈ సంవత్సరం దాని ఎనిమిదవ ఎడిషన్ కార్యక్రమం ఇటీవలే ముగిసింది. పీపీసీ లక్ష్యం ప్రశంసనీయమైనప్పటికీ, దాని ప్రభావం, ప్రాధాన్యత ప్రశ్నార్థకంగానే ఉన్నాయి.పీపీసీపై ఉన్న ప్రాథమిక విమర్శల లో ఒకటి దాని వనరుల కేటాయింపు. 2022 నుంచి 2024 వరకు మూడేళ్ళకు ఈ కార్యక్రమానికి రూ.62 కోట్ల ఖర్చు అయింది. 2022, 2023 సంవత్సరాలలో ఈ కార్యక్రమానికి రిజిస్టర్ చేసుకొని ఆన్‌లైన్‌లో వీక్షించిన వారికి ప్రశంసాపత్రాలను పంపించారు. దీనికోసం నేషనల్ బుక్ ట్రస్ట్ రూ.28 కోట్లు ఖర్చు చేసింది. ఒక కేంద్రీయ విద్యాలయాన్నీ, ఒక నవోదయ విద్యాలయాన్నీ ఒక ఏడాది పాటు నిర్వహించడానికి అయ్యే ఖర్చు కంటే ఒక పీపీసీ కోసం ఒక ఏడాది పెట్టే ఖర్చు ఎక్కువ. మరొక వైపు నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష ద్వారా పదవ తరగతి పిల్లలకు పీహెచ్‌డీ చదువు వరకు ఇవ్వబడే స్కాలర్‌షిప్ పథకాన్ని రద్దు చేశారు. దేశవ్యాప్తంగా ప్రతిభ కలిగిన పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకం 1963 నుండి కొనసాగుతున్నది. సంవత్సరానికి సుమారు పన్నెండు కోట్ల రూపాయలు ఈ పథకానికి ఖర్చు అవుతాయి. ఒకపక్క ఇటువంటి ప్రభావవంతమైన కార్యక్రమాలకు బడ్జెట్లు రద్దు చేస్తూ, పీపీసీ లాంటి కార్యక్రమాలను మాత్రం నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.ప్రేరణాత్మక ప్రసంగాలు, పరీక్షల ఒత్తిడి నిర్వహణ చిట్కాలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించవచ్చు. కానీ అవి పరీక్షల ఒత్తిడికి ఉండే మూల కారణాలను పరిష్కరించవు. నిజానికి ఇలాంటి ప్రసంగాలు, నిర్వహణ చిట్కాలను టీచర్లు చాలా ప్రొఫెషనల్‌గా నిత్యం అందిస్తూనే ఉంటారు. వాటికంటే ముఖ్యంగా, ఆరోగ్యకరమైన, మరింత స్థిరమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడానికి, విధాన నిర్ణేతలు ఈ క్రింది అంశాలపై దృష్టి పెట్టాలి:1) పరీక్షా ఫలితాలే జీవిత విజయం అనే ఇరుకైన నిర్వచనాన్ని సవాలు చేయాలి. వృత్తి శిక్షణ, కళలు, క్రీడలు వంటి ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాలు సమానంగా చెల్లుబాటు అయ్యే విధానాలను పెంపొందించాలి, వాటి ఎంపికలను ప్రోత్సహించాలి. 2. అధిక పోటీతో ఉండే పరీక్షలపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించాలి. తుది పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఏడాది పొడవునా విద్యార్థుల పురోగతిని అంచనా వేసే నిరంతర, సమగ్ర మూల్యాంకన పద్ధతులను అమలు చేయాలి. లాభాపేక్షతో నడిచే కోచింగ్ సెంటర్లను చైనా నిషేధించింది. హోంవర్క్‌పై పరిమితులను విధించింది. మనం ఈ చర్యలను చేపట్టలేకపోతున్నాము, 'ఒకే దేశం-ఒకే పరీక్ష' విధానాలను తెస్తూ ఇంకా ఒత్తిడి పెరిగేటట్లు చేస్తున్నాము. 3. శిక్షణ పొందిన కౌన్సిలర్లు, మనస్తత్వవేత్తల సేవల ద్వారా పాఠశాలలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ శ్రేయస్సుపై అవగాహన కార్యక్రమాలను పాఠ్యాంశాల్లో విలీనం చేయాలి. 4.విద్యార్థుల విద్యా అనుభవాలను రూపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థి -కేంద్రీకృత అభ్యాసంపై మొక్కుబడి శిక్షణలు గాక సరైన శిక్షణ అందించడం వలన మరింత ఆకర్షణీయమైన తరగతి గది వాతావరణం ఏర్పడుతుంది. 5.మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తులను తగ్గించడానికి, వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించడానికి ప్రభుత్వం తగినంత నిధులను కేటాయించాలి. ప్రజా సంబంధాలను పెంచుకునే పనిలో భాగంగా పెద్దగా ప్రభావాన్ని కలిగించని కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తూ, ముఖ్యమైన కార్యక్రమాలకు బడ్జెట్ తగ్గిస్తున్నారు. ఇది ప్రతికూల ఫలితాన్నిస్తుంది.పరీక్షల ఒత్తిడి కారణంగా పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య వ్యవస్థాగత సంస్కరణల తక్షణ అవసరాన్ని గుర్తు చేస్తుంది. 'పరీక్ష పే చర్చ' వంటి కార్యక్రమాలు ఈ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం పరిమితం. సామాజిక విలువలను పునర్నిర్వచించడం, మూల్యాంకన పద్ధతులను సంస్కరించడం, ఉపాధ్యాయ శిక్షణలో పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే నిజమైన పరిష్కారాలు సాధ్యం.'పరీక్ష పే చర్చ' వంటి కార్యక్రమాలు విద్యార్థి ఆత్మహత్యల సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం పరిమితంగా ఉంది. సామాజిక విలువలను పునర్నిర్వచించడం, మూల్యాంకన పద్ధతులను సంస్కరించడం, ఉపాధ్యాయ శిక్షణలో పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే నిజమైన పరిష్కారాలు సాధ్యం.

# రాజకీయాల్లో అందరివాడు - అజాతశత్రువు



కంటోన్మెంట్ మల్కాజ్గిరి ప్రజల మనసు దోచిన తిరుగులేని నాయకుడు జ్ఞాని సాయన్న . కంటోన్మెంట్ ప్రజల గడప గడపకు చెరగని ముద్ర వేసిన నాయకుడు. సామాన్యుడి లో అతి సామాన్యుడిగా కలిసిపోయి ఆడంబరాలు అలంకరణలు లేకుండానే అందరివాడుగా చరిత్ర ఉన్నంతకాలం చెరగని ముద్దుల వేసిన సౌమ్యుడు సాయన్న ఆయన ఎవరు ఊహించని విధంగా ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులతో సహా అందరిని ఆశ్చర్యపరిచి దుఃఖ సాగరంలోకి నెట్టింది. కంటోన్మెంట్ ప్రజలు నాయకులతోపాటు అన్ని రాజకీయ పార్టీల అభిమానం సంపాదించుకున్న ఏకైక నేతగా అందరి మన్నలను పొందిన నాయకుడు సాయన్న క్రింది స్థాయి కార్యకర్తల నుండి మంత్రులు ముఖ్యమంత్రుల నుండి ప్రశంసలు అందుకున్న నాయకుడు ఆయన ఆకస్మిక మృతిజీర్ణించుకోలేకపోయారు.ప్రజల సంక్షేమం కోసం రాత్రింబగళ్లు కష్టపడుతూ నిత్య కృషివలుడు హైదరాబాద్ నగరంలో ఐదు పర్యాయాలు గెలిచి చరిత్రకెక్కిన అజాతశత్రువు జ్ఞాని సాయన్న



**బాల్యము - విద్య - ఉద్యోగము - కుటుంబం**

నిజామాబాద్ జిల్లా మక్లూరు మండలం వల్లభ పూర్ లోని దళిత మాల కుటుంబంలో ని సాయన్న, భూదేవి దంపతులకు మూడవ సంతానంగా 05 మార్చి 1951 న జన్మించారు.ఆయన ప్రైమరీ స్థాయి విద్యను స్థానికంగానే అభ్యసించి హైస్కూల్ విద్య కోసం నిజామాబాద్ పట్టణంలో సాంఘిక సంక్షేమ హాస్టల్ కు చేరారు. అక్కడ ఎస్ .ఎస్. సి . ఇంటర్ పూర్తి చేసిన తర్వాత ముందుగా ఉన్నత విద్య కోసం నాందేడ్ లో చేరారు. వెంటనే హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో బిఎస్సి లో చదువుల కోసం అవకాశం రావడంతో ఉస్మానియాలో చేరి బీఎస్సీ ి ఎల్.ఎల్.బి పూర్తి చేశారు. 1978లో ఎంప్లాయ్మెంట్ ద్వారా చాలా ఉద్యోగాలు వచ్చాయి . అందులో తనకు నచ్చిన సిండికేట్ బ్యాంకు లో ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నా. మొదటగా మెహిదీపట్నంలోని మిలిటరీ అట్లరీ సెంటర్లో ఉన్న సిండికేట్ బ్యాంకు బ్రాంచ్ లో ఉద్యోగంలో చేరారు. కొన్నాళ్ళకు సికింద్రాబాద్ లోని ఆర్. పి.రోడ్ లో ఉన్న బ్రాంచ్ కి బదిలీ అయ్యారు. సిండికేట్ బ్యాంకులో ఉద్యోగం నిర్వహిస్తున్న సమయంలోనే అశోక్ నగర్ లో నివాసం ఉన్న ఎల్ ఎస్ బాబురావు కూతురు గీత తో వివాహం జరిగింది. సాయన్న గీత దంపతులకు ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు . నమ్రత, నివేదిత, లాస్య నందితలు వీరిలో చిన్న కూతురైన లాస్య నందిత గతంలో కవాడి గూడ కార్పొరేటర్ గా పని చేశారు. ఆ తరువాత సాయన్న మన మరణానంతరం కంటోన్మెంట్ శాసన సభ్యురాలుగా గెలిచి మూడు మాసాలకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి అందరికీ తెలిసిందే .

**తెలుగుదేశం పార్టీలో చేరిక**
**దోమలగూడ డివిజన్ కార్పొరేటర్ గా ఓటమి**

1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించడంతో రాజకీయాల వైపు మక్కువ చూపారు తెలుగుదేశం పార్టీలో విద్యావంతులకు అవకాశం ఇవ్వటంతో చేస్తున్న ఉద్యోగానికి దూమ్మాల కొడుతూ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. స్వయాన నందమూరి రామారావు కు అభిమాని ఐన అయిన సాయన్న తెలుగుదేశం పార్టీలో చేరారు. 1986 లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఎన్నికలు వచ్చాయి. దోమలగూడ డివిజన్ ఎస్సీలకు రిజర్వ్ కావడంతో సాయన్న కు మొదటి లిస్టులోనే కార్పొరేటర్ గా టికెట్ దక్కింది. దీంతో తాను చేస్తున్న సిండికేట్ బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ తరఫున దోమలగూడలో పోటీ చేశారు. స్వల్ప మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. దీంతో ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. కార్పొరేటర్ గా ఓడిపోయిన సాయన్న మిత్రుడైన ముఠాగోపాల్ జవహర్ నగర్ డివిజన్ నుంచి గెలిచారు. రాజకీయాల్లో సోదర భావంతో అభినావ సంబంధం ఇద్దరికి ఉంది. కార్పొరేటర్ అయిన ముఠా గోపాల్ తో తిరుగుతూనే అంతకుముందే %గూడీ% పాస్ కావడంతో న్యాయవాదిగా జీవితం ప్రారంభించారు. మరోవైపు వ్యాపారం పై మొగ్గుచూపి మైనింగ్ వ్యాపారంలో దిగారు. ముఠా గోపాల్, సాయన్న భాగస్వామ్యంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మైనింగ్ వ్యాపారం ప్రారంభించారు.

**కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా**

తెలుగుదేశం పార్టీలో అప్పటికే మంత్రిగా పనిచేసిన అల్లాడి రాజ్ కుమార్ తో అనుబంధం ఏర్పరచుకున్నారు . ముఠా గోపాల్, సాయన్నలు ఆయన శిష్యులుగా ముషీరాబాద్ ప్రాంతంలో నిలిచారు. అల్లాడి రాజ్ కుమార్ ప్రోత్సాహంతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పంచ కమిటీలో హైదరాబాద్ జిల్లా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ కమిటీ విభాగం చైర్మన్ గా ఎంపికైనారు. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తుకు పునాది పడింది. హైదరాబాద్ జిల్లాలో ఉన్న కంటోన్మెంట్ నియోజకవర్గం ఎస్సీకి కేటాయించడంతో ఆయన ను పార్టీ అధిష్టానం కంటోన్మెంట్ ఇన్చార్జిగా నియమించారు. గతంలో తెలుగుదేశం పార్టీలో డాక్టర్ ఎన్ ఏ కృష్ణ, సర్వే సత్యనారాయణ లు తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు పార్టీ మారి వెళ్లిపోయారు. 1994లో వచ్చిన సాధారణ ఎన్నికల్లో సాయన్నకు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది అప్పటికే మంత్రిగా ఉన్న డి నరసింగరావు పై స్వల్ప మెజారిటీ 3636 తో గెలిచారు. దీంతో కంటోన్మెంట్లో రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది.

**ఐదుసార్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా**

1994 సాధారణ ఎన్నికల్లో ఎన్నో ఆశలతో గెలిచిన సాయన్న హైదరాబాదు నగరంలో 1999, 2004 మూడుసార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్స్ సాధించారు .2004 లో రాష్ట్రం మొత్తం వైయస్సార్ పాదయాత్ర హవాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కంటోన్మెంట్ లో మాత్రం సాయన్న నే గెలిచారు.

నాలుగవసారి 2009 ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. 2014లో తెలంగాణ రాష్ట్ర మొత్తం టిఆర్ఎస్ హవా నడిచినా తెలుగుదేశం పార్టీ నుండి 4 వ సారి ఎమ్మెల్యేగా గెలిచారు . 2018 లో బి.ఆర్.ఎస్ పార్టీ తరఫున 5 వ సారి గెలిచి హైదరాబాదు నగరంలో ఐదు సార్లు గెలిచిన వ్యక్తిగ చరిత్రకి ఎక్కారు సాయన్న.

**మంత్రి పదవి దక్కని సాయన్న - మనస్థాపం**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో తిరుగులేని నాయకునిగా అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తల ప్రజల అభిమానం పొందిన సాయన్నకు మంత్రి పదవి దక్కలేదు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పదవి వస్తుందని ప్రకటనలు వచ్చిన చైర్మన్ పదవి మాత్రం రాలేదు. తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడే ప్రతి సారి మంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు తనకు అవకాశం రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యా రు. మనస్థాపానికి గురైన తనను తాను అధిగమించుకొని కార్యకర్తలకు అభిమానులకు నవ్వుతూ సమాధానం చెప్పేవారు.

**రాజకీయ అతి జోక్యం తోటి చివరి నిమిషంలో మన స్థాపం**

కంటోన్మెంట్ నియోజకవర్గం రిజర్వ్ కావడంతో అగ్ర కుల నాయకులు జోక్యం చేసుకోవడంతో అనేక సందర్భాల్లో పార్టీ పెద్దలకు వారి జోక్యాన్ని నివారించక పోవటం తో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 1994లో గెలిచిన నాటి నుండి కూడ స్థానికంగా ఆధిపత్య పోరు జరుగుతూనే వచ్చింది. నియోజకవర్గ పునర్విభజన తర్వాత కూడా కంటోన్మెంట్ లో బి ఆర్ ఎస్ పార్టీలో సాయన్న ఏకాకిగా మారారు. టిఆర్ఎస్ పార్టీలో స్థానికంగా గెలిచిన సాయన్నకు ఏ రకమైన పదవులు కట్టబెట్టడాని అధిష్టానం ఇదే ప్రాంతానికి సంబంధం ఉన్న ముగ్గురికి చైర్మన్ పదవులు ఇవ్వడంతో బయటికి చెప్పుకోలేనంతగా సాయన్న ఆందోళన చెందారు. ఒకవైపు అనారోగ్యం మరోవైపు నియోజకవర్గ రాజకీయాల్లో అందరి జోక్యంతో సతమతమయ్యారు. దీనితోటే ఆసుపత్రిలో చేరి 19 ఫిబ్రవరి 2023 న 72 సంవత్సరాల వయసులో ఆకస్మిక మృతి చెందారు.

**అందరివాడుగా గుర్తింపు**

రాజకీయాల్లో వర్గ విభేదాలు ఉన్న తరుణంలో అందరినీ కలుపుకొని పోవడం సాధ్యమయ్యే పని కాదు సాయన్న విషయంలో మాత్రం అది సాధ్యమైంది అని చెప్పవచ్చు. నియోజకవర్గంలో నిరంతరంగా గెలవడంతో ప్రతి కాలనీ ప్రతి బస్తి లో ని మిత్రులందరికీ వ్యక్తిగతంగా గుర్తించి వారి వారి అవసరాల మేరకు పనులు చేపట్టారని రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పనులు చేసి అందరివాడుగా అజాతశత్రువుగా సాయన్న గుర్తింపు తెచ్చుకున్నారు.

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

**(నేడు సాయన్న 2వ వర్ధంతి సందర్భంగా)**

# బిరుదులన్నీ వ్యక్తి పూజలే!



ఏటా రిపబ్లిక్ దినానికి, 'పద్మ ఎవార్డు'ల పేరుతో, నాలుగు రకాల బిరుదుల్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. భారత రత్న, పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ. ఈ నాలుగు బిరుదుల వరసా చూస్తే, ప్రాచీన కాలంలో ఉండిన నాలుగు వర్ణాల వ్యవస్థ గుర్తుకు వస్తుంది. కానీ, భారత పాలకవర్గాలు రాసుకున్న 1950 నాటి రాజ్యాంగంలో, ప్రభుత్వం బిరుదులు ఇవ్వకూడదనే ఉంది. కానీ, 1954లో, ఈ బిరుదుల్ని అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిరుదులు రాజ్యాంగంలో రాసుకున్నదానికి విరుద్ధమైనవి కాబట్టి, వీటిని రద్దు చెయ్యాలని అప్పట్లో కొందరు కొన్ని రాష్ట్రాల హైకోర్టులకి వెళ్ళారు. చివరికి, ఐదుగురు జడ్జీల సుప్రీం కోర్టు ధర్మాసనం, "అవి బిరుదులు కావు, 'గౌరవ పురస్కారాలు' ('ఆనరరీ ఎవార్డ్స్'). కాబట్టి అవి రాజ్యాంగానికి విరుద్ధమైనవి కావు" అని తేల్చింది. బిరుదులు కాకపోతే, ఈ ఎవార్డులను పొందినవారిని, "భారత రత్న, ఫలానా", "పద్మ విభూషణ్, ఫలానా", "పద్మశ్రీ, ఫలానా" అని సభల్లోనూ, పత్రికల్లోనూ, సంబోధించడం ఎందుకు? ఆ పురస్కారాలు పొందిన కొందరు తమ లెటర్ హెడ్స్ లోనూ, తమ జీవిత విశేషాల్లోనూ ('బయోడేటా') ఆ ఎవార్డుల్ని చెప్పుకోవడం ఎందుకు? ఇతరులు చెబుతూ ఉంటే ఆనందిస్తూ కూచోడం ఎందుకు? కాబట్టి, గౌరవ పురస్కారాలైనా, బిరుదులైనా, రెండూ సారాంశంలో ఒకటే. ఒక రకంగా అవి పర్యాయపదాలే!దేశంలో మనుషులందరూ సమానులే అని ఒక పక్క చెప్పుకుంటూనే, ఆ దేశంలోనే కొంతమందిని ఎక్కువ సమానులుగా బిరుదులు ఇవ్వడం ఏమిటి? ప్రభుత్వం ప్రకటించినా, తీసుకోవడం ఏమిటి? "అవును, మేము అందరితో సమానం కాము. మేము ప్రత్యేకం! మేము 'పద్మ' బిరుదాంకితులం! అల్లాటప్పాగాళ్ళం కాదు!" అని చెప్పుకోవడం కాదూ? ఏం? "ఎందుకీ గౌరవ పురస్కారాలూ? ఏముందీ? మాకు ఆయా రంగాల్లో పరిస్థితులూ, అవకాశాలూ కుదిరాయి. మాకు చేతనైన పనులు మేము చేశాము. అంతమాత్రాన, తోటి మనుషులనించీ, మమ్మల్ని విడగొట్టి గొప్ప చెయ్యడం ఏమిటి?" అనవద్దా? "నేను ఫలానా రంగంలో కృషి చేసినందుకు గుర్తింపుగా నాకు ఈ పురస్కారం లభించింది. ఇది నా రంగంలో కృషి చేస్తున్నవారందరికీ లభించిన పురస్కారంగా భావిస్తాను" అని ఒకరంటే, "ఇది నా జాతి (కులం) ప్రజలందరికీ దక్కిన గౌరవం" అని ఇంకొకరు అంటారు. అసలీ బిరుదులన్నీ, ఆ సమయానికి ఉన్న ప్రభుత్వానికి అనుకూలంగానో, వ్యతిరేకత లేకుండానో ఉండేవారికే వస్తాయి. పైగా ఆ బిరుదుల కోసం స్వయంగా గానీ, మిత్రుల ద్వారా గానీ, సిఫార్సులూ, పైరవీలూ జరుగుతాయని ఎన్నో వింటాం!ప్రభుత్వాలు బిరుదులిచ్చినట్టే, కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా, ఒక వ్యక్తిని గొప్ప చెయ్యడానికి, కొన్ని బిరుదులిస్తూ ఉంటాయి. ఉదాహరణకి, సినిమా హీరోల విషయంలో: నట సామ్రాట్, నట రత్న, విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మెగాస్టార్, పవర్ స్టార్, రెబెల్ స్టార్... ఇలా రకరకాల బిరుదులున్నాయి. అవన్నీ, ఆ హీరోలతో తీసిన సినిమాలను బాగా అమ్ముడయ్యే సరుకులుగా ప్రచారం చేసుకోవడానికి ఉపయోగించుకుంటారు. అలాగే, కవులకి కూడా కొన్ని రకాల బిరుదులున్నాయి. 'విశ్వ కవి', 'మహా కవి', 'ప్రజా కవి', 'కవి సామ్రాట్', 'కవి రత్న', 'కవి కోకిల', 'కవి రాజు' వగైరాలు. గతంలో అయితే, 'గండపెండేరాలు' తొడిగి, ఏనుగు మీద ఊరేగించడం కూడా చేసేవారు!ఈ బిరుదులూ, ప్రత్యేక గౌరవ పురస్కారాలూ, ఇవన్నీ మనుషుల మధ్య అసమానత్వానికి గుర్తులు. వీటిని ఇచ్చేవారూ, పులకించి పుచ్చుకునే వారూ, వారిని చూసి సమ్మోహితులయ్యేవారూ, 'మాకు రాలేదే' అని బెంగ పడేవారూ... అందరూ సమానత్వ భావనకి వ్యతిరేకులు, తెలిసిగానీ, తెలియక గానీ! ఇతర్లని పొగడ్డమూ, పొగిడించుకోవడమూ ఇష్టమైనవారు! అంటే, 'వ్యక్తి పూజ'కి అనుకూలురు! ఈ కీర్తి దాహానికి ('కీర్తి కండూతి' అని ఒక పరుషపదం కూడా ఉంది) లొంగిపోయే వారూ, ప్రోత్సహించేవారూ, బానిస యజమానులే కాదు, ఫ్యూడల్ చక్రవర్తులే కాదు, బూర్జువా నాయకులే కాదు, విప్లవ కమ్యూనిస్టులు కూడా! 'కామ్రేడ్ స్టాలిన్', 'కామ్రేడ్ మావో' ఈ విషయంలో, అందరినీ అధిగమించారు 'వ్యక్తి పూజ' చరిత్రలో! నిజానికి, సమానత్వ సిద్ధాంతమైన కమ్యూనిజం పూర్తిగా వంటబట్టిన వారెవ్వరూ, వ్యక్తి పూజని అంగీకరించరు. దానికి, శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంతకర్తలైన, మార్క్సు, ఎంగెల్సుల్ని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చును.'విల్ హెల్మ్ బ్లాస్' అనే ఒక జర్మన్ పత్రికా సంపాదకుడికి రాసిన ఉత్తరంలో- ఎంగెల్స్ గురించీ, తన గురించీ మార్క్సు ఇలా అంటాడు. (మార్క్సు, ఏంగెల్స్: సెలెక్టడ్ కరెస్పాండెన్స్- పే. 291) "మాలో ఎవ్వరం పాప్యులారిటీకి గడ్డిపరకంత విలువ్కెనా ఇవ్వం. వ్యక్తి పూజ ('పెర్సనాలిటీ కల్టు') ఏ రకమ్కెంద్కెనా మాకు విముఖతే. అనేక దేశాల నించీ వచ్చే ఎన్నో రకాల పొగడ్తల ఉత్తరాలు బహిరంగం కావడానికి నేను ఎన్నడూ ఒప్పుకోలేదు. ఇంటర్నేషనల్ ఉన్నంత కాలం ఆ ఉత్తరాలు నన్ను మహా చికాకు పెట్టేవి. వాటికి నేను ఎన్నడూ జవాబే ఇవ్వలేదు- ఎప్పుడ్కెనా ఓసారి తప్ప. అద్కెనా వాటిని వ్యతిరేకిస్తున్నానని గట్టిగా చెప్పడానికే. "ఎంగెల్సూ, నేనూ మొట్టమొదట రహస్య కమ్యూనిస్టు సంఘంలో చేరినప్పుడు, 'అధికారం' గురించి మూఢ విశ్వాసాన్ని ప్రోత్సహించే ప్రతీ అంశాన్నీ నిబంధనావళి నించి తీసెయ్యాలని షరతు పెట్టాం."

**భక్తి**

## ముచ్చింతల్ లో వైభవంగా సాగుతున్న సమతాకుంభ్..



భగవంతుడు రథాన్ని వాహనంగా చేసుకుని వేంచేస్తాడు. రథంలో వేంచేసిన ఆ సాకేతరాముడ్ని దర్శిస్తే మనం పవిత్రులమవుతామనీ.. కర్మబంధముల నుండి విముక్తులమవుతామని శాస్త్రాలు చెబుతున్నాయి. ముందుగా రథంలో శ్రీ సాకేత రామచంద్ర ప్రభువు వేంచేసారు. తర్వాత 108 దివ్యవేదశ శ్రీమూర్తులలో నుంచి మొదటి దివ్యదేశ పెరుమాళ్లయిన శ్రీరంగనాథుడు, అంతిమ దివ్యదేశ పెరుమాళ్లయిన శ్రీ వైకుంతనాథుడు వేం చేస్తారు.

సమతాకుంభ్ -2025 బ్రహ్మోత్సవాల తొమ్మిదో రోజు (మంగళవారం-%ఫీవఎ% 18) ఉదయం రథోత్సవ ఘట్టం ఘనంగా నిర్వహించారు. యాగశాలలో వేదికపైన 18 దివ్యదేశ పెరుమాళ్లకు తిరుమంజన సేవ అనంతరం రథోత్సవం మొదలైంది. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలోని రథానికి ప్రత్యేకత ఉంది. శ్రీరంగంలో ఉండే ప్రణవాకార విమానంలా..ఈ రథానికి కూడా ప్రణవాకార విమాన గోపురం ఉండటం విశేషం! చుట్టూరా దేవతామూర్తులు, ఆళ్వార్లు, ఆచార్యులు, చతుర్ముఖ బ్రహ్మ, అనేక శిల్పకళా సౌందర్యానికి కాణాచిలా ఉండటం..ఈ రథం ప్రత్యేకత!భగవంతుడు రథాన్ని వాహనంగా చేసుకుని వేంచేస్తాడు. రథంలో వేంచేసిన ఆ సాకేతరాముడ్ని దర్శిస్తే మనం పవిత్రులమవుతామనీ.. కర్మబంధముల నుండి విముక్తులమవుతామని శాస్త్రాలు చెబుతున్నాయి. ముందుగా రథంలో శ్రీ సాకేత రామచంద్ర ప్రభువు వేంచేసారు. తర్వాత 108 దివ్యవేదశ శ్రీమూర్తులలో నుంచి మొదటి దివ్యదేశ పెరుమాళ్లయిన శ్రీరంగనాథుడు, అంతిమ దివ్యదేశ పెరుమాళ్లయిన శ్రీ వైకుంతనాథుడు వేం చేస్తారు. శ్రీ సుదర్శన భగవానుడు కూడా రథంలోకి వేం చేస్తారు. గరుడ భగవానుడు, బ్రహ్మతోపాటు విశ్వకర్మ ముందు ఉండటం విశేషం. భగవంతుడు రథంలోకి ప్రవేశించగానే దేవతలకి సాత్విక బలిహరణ జరిగింది.ఆ తర్వాత గోవింద నామాలతో సంకీర్తనలతో భాజా భజంత్రీలతో కోలాట నృత్యాలతో భక్తులు వెంటరాగా శ్రీస్వామివారు రథయాత్రను ప్రారంభించారు. అనంతరం సమతా ప్రాంగణం ప్రవేశవాటికకు పక్కనున్న ద్వారం గుండా..విరజా పుష్కరిణికి రథయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా పెరుమాళ్లకు మంగళ హారతులు, స్నానాలు చేయించారు. అనంతరం పెరుమాళ్లతో చిన్న జీయర్ స్వామి వారు కోనేరులోకి దిగి స్నానమచరించారు. ఈ కార్యక్రమంలో అశేష భక్తజనంతో పాటు మై హోమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్ బుధవారం 19 ఫిబ్రవరి 2025

## విషాల్ని హరించే కాఫీ



కాఫీని సరైన మోతాదులో తీసుకుంటే శరీరంలోని విషాలు హరిస్తాయి. దాంతో కాలేయ పనితీరు మెరుగు పడుతుంది. కాఫీ గింజల్లోని క్లోరోజెనిక్ యాసిడ్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీర్యాడికల్స్‌ను స్థిరీకరిస్తాయి. దాంతో మూత్రపిండాల పనితీరు మెరుగై, మూత్రం ద్వారా శరీరంలోని విషాలు బయటకు వెళ్లిపోతాయి. అయితే ఈ ప్రయోజనాలు పొందాలంటే సరైన కాఫీ దినుసులను, సరైన విధానంలో వాడుకుని, సరైన సమయాల్లో, సరైన మోతాదుల్లో కాఫీ తయారుచేసుకుని తాగాలి. అందుకోసం, పురుగు మందులు ఉపయోగించకుండా పండించిన, సేంద్రీయ కాఫీ విత్తనాలను వాడుకోవాలి. అలాగే డికాక్షన్‌కు చక్కెర జోడించకూడదు. బ్లాక్ కాఫీ లేదా దాల్చిన చెక్క జోడించిన కాఫీ తాగాలి. నచ్చినవాళ్లు ఆరోగ్యకరమైన కొబ్బరి నూనె, లేదా వెన్నలను కాఫీకి జోడించి బుల్లెట్‌ప్రూఫ్ కాఫీ తాగొచ్చు. రాత్రిపూట కాఫీ తాగితే విషాలు హరించే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అయితే ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండున్నర మధ్య సమయం కాఫీకి అనువైన సమయం. కానీ ఉదయాన్నే నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు కాఫీ తాగకూడదు. వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీ తాగితే, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. వ్యాయామంతో శరీరం చురుగ్గా మారడం వల్ల విషాలు శరీరంలో నుంచి సునాయాసంగా బయటకు వెళ్లిపోతాయి. అయితే కాఫీ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలంటే రోజుకు రెండు నుంచి మూడు కప్పులకే పరిమితం కావాలి.

# కల్తీ పన్నీర్‌ను కనిపెట్టేద్దాం!



ఇటీవలి కాలంలో వంటనూనెలతో కూడా పన్నీర్‌ను తయారు చేస్తున్నారు. అనలాగ్ పన్నీర్ అనే పేరుతో దొరుకుతున్న ఈ పన్నీర్‌లో పోషకాలు తక్కువ. అసలైన పన్నీర్ మృదువుగా, చిదిమితే విరిగిపోతూ, పాల వాసనను వెలువరిస్తూ ఉంటుంది. కానీ అనలాగ్ పన్నీర్, రబ్బరులా గట్టిగా ఉంటుంది. వేడిచేసినప్పుడు పాలతో తయారైన పన్నీర్ పాల కొవ్వును విడుదల చేస్తే, అదనపు నీళ్లను విడుదల చేస్తుంది. అలాగే ఈ నకిలీ పన్నీర్‌ను పరీక్షించడం కోసం, నీళ్లలో ఉడకబెట్టి, చల్లారిన తర్వాత కొన్ని చుక్కల అయొడిన్ టింక్చర్‌ను జోడించాలి. అప్పుడు పన్నీర్ నీలం రంగులోకి మారితే, దాన్లో స్టార్చ్ ఉందనీ, నకిలీదని అర్థం. అలాగే పన్నీర్‌ను నీళ్లలో ఉడకబెట్టి, చల్లారిన తర్వాత దాని మీద కందిపప్పు పొడి లేదా సోయాబీన్ పొడి చల్లాలి. పది నిమిషాల తర్వాత అది లేత ఎరుపు రంగులోకి మారితే ఆ పన్నీర్‌లో డిటర్జెంట్ లేదా యూరియా కలిసిందని అర్థం. మన దేశంలో అనలాగ్ పన్నీర్ విక్రయం చట్టబద్ధం. అయితే లేబుల్ మీద 'నాన్ డైరీ' అని స్పష్టంగా పేర్కొనాలి. కాబట్టి పన్నీర్ కొనేటప్పుడు ఆ అక్షరాల కోసం వెతకాలి. అనలాగ్ పన్నీర్ సింథటిక్ కాబట్టి దాంతో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుందనీ, జీర్ణకోశ సమస్యలు వేధిస్తాయనీ, ట్రాన్స్‌ఫ్యాట్స్ ఎక్కువగా ఉండే ఈ పన్నీర్‌తో గుండెజబ్బులు

# పిల్లలు బలంగా



రాగులు: క్యాల్షియం, ఇనుము పుష్కలంగా కలిగి ఉండే రాగులు ఎముకలకు బలాన్నిచ్చి, హీమోగ్లోబిన్ మోతాదును పెంచుతాయి. వీటితో జావ, దోస, లడ్లు తయారుచేసి పిల్లలకు అందించవచ్చు.

ఉసిరి: విటమిన్ సి ఎక్కువగా ఉండే ఉసిరి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. జీర్ణశక్తిని మెరుగు పరిచి, చర్మం, వెంట్రుకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. కాబట్టి ఉసిరి రసం, చట్నీ, మురబ్బా రూపంలో అందించవచ్చు.

నెయ్యి: ఆరోగ్యకరమైన కొవ్వుల భాండాగారమిది. జీర్ణశక్తిని పెంచి, మెదడు అభివృద్ధికి తోడ్పడుతుంది. కాబట్టి అన్నంతో, చపాతీల్లో నెయ్యి జోడిస్తూ ఉండాలి.

పసుపు: పసుపుకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. రోగనిరోధకశక్తిని పెంచే పసుపు గాయాలను త్వరగా మాన్పుతుంది. కాబట్టి తరచూ పాలు లేదా సూప్స్‌లో పసుపు కలిపి అందిస్తూ ఉండాలి.

మఖ్‌నా: ప్రొటీన్, క్యాల్షియం సమృద్ధిగా దొరికే మఖనాలు ఎముకల దృఢత్వాన్ని పెంచుతాయి. వీటిని తింటే పిల్లలు రోజంతా చురుగ్గా ఉంటారు.

ఖర్జూరం: సహజసిద్ధ చక్కెరలను కలిగి ఉండే ఖర్జూరాలు శక్తినిస్తాయి. స్మూదీలు, పండ్ల రసాలు, ఎనర్జీ బాల్స్ రూపంలో ఖర్జూరాలను తినిపిస్తూ ఉండాలి.

బెల్లం: శుద్ధి చేసిన చక్కెరకు ప్రత్యామ్నాయమైన బెల్లంలో ఇనుము ఎక్కువగా దొరుకుతుంది. కాబట్టి పిల్లల కోసం తయారుచేసే తీపి వంటకాల్లో చక్కెరకు బదులుగా బెల్లం వాడుతూ ఉండాలి.


పచ్చి కొబ్బరి: కొబ్బరినీళ్లతో డీహైడ్రేషన్ తొలగిపోతే, కొబ్బరితో ఆరోగ్యకరమైన కొవ్వులు దక్కుతాయి. కాబట్టి కూరలు, స్మూదీలలో పచ్చి కొబ్బరి కోరు కలుపుతూ ఉండాలి. కొబ్బరి చట్నీలు విరివిగా వాడుకోవాలి.

మొలకలు: పెసర మొలకల్లో ప్రొటీన్లు ఎక్కువ. ఇవి తేలికగా అరుగుతాయి కూడా. కాబట్టి సలాడ్స్, వేపుళ్లలో వీటిని కలిపి పిల్లలకు తినిపిస్తూ ఉండాలి.

చిలకడదుంపలు: వీటిలో పీచుకు కొదవ ఉండదు. విటమిన్ ఎ కూడా పుష్కలంగా ఉంటుంది. వీటిని ఉడకబెట్టి, వేయించి, నిప్పుల్లో కాల్చి పిల్లలకు తినిపించవచ్చు.



# ఎకోఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం అబ్బురపరిచే అద్భుత లోకం





రామ్‌దేవ్ రావు తల్లితండ్రులది వరంగల్ జిల్లాలోని నెక్కొండ. తండ్రి నారాయణరావు అటవీ కాంట్రాక్టర్. చెట్లను నరికి అమ్మడం ఆయన పని. కానీ ఆయన ప్రకృతి అంటే మమకారం. చెట్లు నరుకుతూ ఉంటే అడవులు అంతరించిపోతాయని ఆయనకు కలత చెందారు. 80 ఎకరాలలో సొంతంగా ఒక అడవిని పెంచారు. రామ్‌దేవ్ పెరిగింది ఆ అడవిలోనే. ప్రకృతిని కాపాడాలనే ఆలోచన పుట్టింది కూడా ఆ అడవిలోనే! ఆ తర్వాత ప్రపంచంలోని అనేక దేశాలను తిరిగి చెట్లను సేకరించి వాటిని మన దేశానికి తీసుకువచ్చి పెంచటం ప్రారంభించారు. ఎవ్వరి దగ్గర లేని చెట్లను అందించటం ఆయన ప్రత్యేకత. దీనితో అనేక మంది ప్రముఖులు ఆయన దగ్గర నుంచి చెట్లు కొనుగోలు చేయటం మొదలుపెట్టారు. రామ్‌దేవ్ ఆలోచన అక్కడితోనే ఆగిపోలేదు. ప్రపంచంలోనే ఎక్కడా లేనన్ని చెట్లను ఒక చోటకు తీసుకురావాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ ఆలోచనల రూపమే ఎక్స్‌పీరియం. 150 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఇలాంటి పార్కు ప్రపంచంలోనే ఎక్కడా లేదనటం అతిశయోక్తి కాదు. ఒక్కసారి ఈ పార్కులోకి అడుగుపెడితే రకరకాల మొక్కలు సందర్శకులను కళ్లు తిప్పుకోనివ్వవు. అందుకే వెయ్యిరూపాయల ఎంట్రీ టిక్కెట్టు కొని... వేల మంది ఈ ఎక్స్‌పీరియంకు వస్తున్నారు.

**అన్ని వ్యాపారాలూ వదిలేసి...**

మొక్కలపై ఉన్న ఆసక్తితో రామ్‌దేవ్ తన అన్ని వ్యాపారాలనూ వదిలేశారు. ప్రపంచంలో పేరొందిన నర్సరీలను చూసేందుకు ఇప్పటి వరకు 78 దేశాలు తిరిగారు. ఎక్స్‌పీరియంలోని మొక్కల విలువ కోట్లలో ఉంటే.. ఆ భూమి విలువ మాత్రం వెయ్యి కోట్లకు పైనే ఉంటుంది. "ఇంత విలువైన భూమిలో రియల్‌ఎస్టేట్ చేస్తే ఎక్కువ లాభం వస్తుంది కదా?" అని ఎవరైనా ఆయన్ని ప్రశ్నిస్తే చిన్నగా నవ్వుతారు. "ఇది నాకు హాబీ. ఇష్టమైన పని. ఉన్న వ్యాపారాలన్నీ ఎప్పుడో వదిలేశా. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎందుకు?" అంటారాయన. ఎక్స్‌పీరియం నిర్వహణకు ప్రతి నెల మూడు కోట్లకు పైనే ఖర్చు అవుతుంది. "అందుకే సందర్శకులకు టిక్కెట్టు పెడుతున్నాం. ఆదాయం కోసం కాదు" అంటారాయన.

**మనసు పడితే కొనేస్తారు**

చెట్లు అమ్మడమే కాదు... కొనడం కూడా ఆయనకు హాబీనే. ప్రపంచంలో ఎక్కడైనా అరుదైన మొక్క కానీ, చెట్టు కానీ ఉందని తెలిస్తే అక్కడ వాలిపోతారు. చూసింది మనసుకు నచ్చితే ఎంత ఖర్చైనా దాన్ని కొనేసి ఇక్కడకు తీసుకువచ్చి తన పార్కులో పెట్టుకుంటారు. ఇలా బయట దేశాల నుంచి ఆయన కొనుగోలు చేసిన చెట్ల ఖరీదు వందల కోట్లలో ఉంటుంది. ఎక్స్‌పీరియంలో 150 ఏళ్ల వయసు ఉన్న బోధివృక్షం కనిపిస్తుంది. ఇది ఇండోనేషియాలోని జావా ద్వీపకల్పంలోనిది. దీనిని రూ.60లక్షలకు కొని ఇక్కడకు తరలించారు. ఈ చెట్టు కొమ్మలు, ఆకులను కట్ చేసి 'కమలం' ఆకారం తీసుకువచ్చి మధ్యలో బుద్ధుడి విగ్రహాన్ని పెట్టి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ చెట్టును ఇలా తీర్చిదిద్దటానికి రాందేవ్ 75 లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. 2008 చైనాలో ఒలింపిక్స్ జరిగిన సమయంలో ఓ నర్సరీ యజమాని ఒక చెట్టును ఒలింపిక్స్ చిహ్నాలతో రూపుదిద్దాడు. దీని కోసం అతను 5 ఏళ్లపాటు శ్రమించాడు. ఒలింపిక్స్ సమయంలో చైనాలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తరువాత కాలంలో ఈ చెట్టును కొనేందుకు ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు దాన్ని రామ్‌దేవ్ 50 లక్షలకు కొనుగోలు చేశారు.

**సృజనాత్మకతతో...**

రామ్‌దేవ్ స్వతహాగా చిత్రకారుడు. దీనితో మొక్కలను, చెట్లను ఏఏ డిజైన్లలో పెంచాలనే విషయాన్ని ఆయన నిర్ణయిస్తారు. ఇలా పుట్టిందే ప్రపంచంలో అతి పెద్ద గ్రీన్ డోమ్. అనేక చెట్ల సముదాయాలతో ఉండే ఈ గ్రీన్ డోమ్‌ను పై నుంచి చూస్తే పెద్ద గొడుగులా కనిపిస్తుంది. ఇదే విధంగా సందర్శకులకు మొక్కల వివరాలు తెలియటానికి వీలుగా స్కానింగ్ బోర్డ్‌లను ఏర్పాటు చేశారు. ఈ బోర్డులను స్కాన్ చేస్తే మొక్కల వివరాలన్నీ తెలుస్తాయి. ఆయన దూర దృష్టికి మరో నిదర్శనం- మొక్కల శ్మశానం. "ఎవరైనా చనిపోయిన తర్వాత ఒక మొక్కగా మారాలనుకుంటే వారికి ఆ అవకాశం కల్పిస్తాం. చనిపోయిన తర్వాత పార్థివదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చి ఖననం చేసుకోవచ్చు. దానిపై వారికి నచ్చిన మొక్కను పాతి పెంచుతాం. వారి కుటుంబ సభ్యులు వచ్చి ఈ మొక్కను ఎప్పుడైనా చూడవచ్చు. నేను కూడా నా దేహంపై మొక్కను పెంచాలని నా కుటుంబ సభ్యులకు చెప్పా" అంటారు రామ్‌దేవ్.

హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులో నిర్మించిన అతిపెద్ద ఎకో పార్క్... ఎక్స్‌పీరియంకు ఇప్పటి దాకా అయిన ఖర్చు రూ.450 కోట్లు. అర్జెంటీనా, మెక్సికో, థాయ్‌లాండ్, ఉరుగ్వే, ఇటలీ, స్పెయిన్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా, మెక్సికో మొదలైన 85 దేశాల నుంచి తెప్పించిన 25 వేలకు పైగా మొక్కలు, వృక్షాలు ఇక్కడ కనిపిస్తాయి. వీటి ధర మార్కెట్లో వేల కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ పార్క్‌లో రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకోవటానికి కూడా అవకాశముంది. దీనిలో 1500 మంది కూర్చోవడానికి వీలైన యాంఫీ థియేటర్ ఉంది. రూ.50 కోట్లతో నిర్మించిన గ్లో గార్డెన్ ప్రపంచంలోనే మొదటిది. సహజమైన రాతితో మలచిన తొలి బార్ కౌంటర్.. అతిపెద్దవైన స్నో పార్క్.. బాక్స్ క్రికెట్ సౌకర్యం ఇక్కడ ఉన్నాయి. అలాగే 10 వేల మంది కూర్చోవడానికి వీలైన కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు.



చల్లని చలికాలం నుంచి వేడిగా ఉండే వేసవి కాలంలోకి అడుగుపెడుతున్నాం. అటు చలి, ఇటు వేసవి కాని ఈ మధ్యస్థ కాలంలో, రోజు మొత్తంలో వాతావరణం భిన్నమైన ఉష్ణోగ్రతలకు లోనవుతూ ఉంటుంది. పొద్దున్న చలి ఎక్కువగా, మధ్యాహ్నం వేడి ఎక్కువగా, సాయంత్రానికి మళ్లీ చలి పెరుగుతూ ఇలా శరీరం భిన్నమైన ఉష్ణోగ్రతలకు బహిర్గతమవుతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితులకు శరీరం అలవాటు పడే క్రమంలో వాతావరణంలోని పలురకాల వైరస్‌ల వల్ల వేర్వేరు ఇన్‌ఫెక్షన్లు సోకుతూ ఉంటాయి. వాటిలో ప్రధానమైనది... 'ఫారింగ్జయిటిస్'. ముక్కు, నోరు, శ్వాస నాళిక వెనక భాగంలో ఉండే ఫారింగ్స్‌కు వాతావరణంలో విజృంభించే చిన్నపాటి వైరస్‌లు సోకుతూ ఉంటాయి. ప్రధానంగా బడికెళ్లే పిల్లలకు సోకే ఈ ఇన్‌ఫెక్షన్ క్రమేపీ కుటుంబానికీ, ఇతరులకూ వ్యాపిస్తూ ఉంటుంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

ఇది తీవ్రంగా పరిగణించవలసిన సమస్య కాకపోయినప్పటికీ, స్వల్పకాలిక మందులతో లక్షణాలను అదుపులోకి తెచ్చుకోవాలి. అంతిమంగా జ్వరం వరకూ సమస్య ముదిరిపోకుండా ఉండడం కోసం ముందు నుంచే జాగ్రత్త పడాలి. ప్రధానంగా అలర్జీ ప్రతిస్పందన, వైరస్ విజృంభణ మూలంగా ఫారింగ్జయిటిస్ వేధిస్తుంది కాబట్టి అలర్జీని తగ్గించే మందులతో, ఉపశమనాన్నిచ్చే గృహ వైద్యాలతో చికిత్స మొదలుపెట్టాలి. అందుకోసం....

# ఆ రెండూ ఒకటి కావు



- చల్లని గాలికి బహిర్గతం కాకుండా చూసుకోవాలి
- యాంటీ ఎలర్జిక్ మందులు పరిమితంగా వాడుకోవాలి
- వీలైనంత తక్కువ మోదాదులో పారాసిటమాల్ వాడుకోవాలి
- యాంటీబయాటిక్స్ వాడకూడదు
- రోజుకు మూడు సార్లు ఆవిరి పట్టాలి
- చల్లని పదార్థాలు, ద్రవాలకు దూరంగా ఉండాలి
- గోరువెచ్చని నీళ్లలో ఉప్పు కలిపి నోరు పుక్కిలించాలి

**బర్డ్ ఫ్లూలో కూడా ఇవే లక్షణాలు**

జ్వరం, ఎగువ శ్వాసకోస ఇన్‌ఫెక్షన్, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, వాంతులు బర్డ్ ఫ్లూ ప్రధాన లక్షణాలు. అయితే ఇవి ఫారింగ్జయిటిస్‌ను పోలినట్టే కనిపించినా, బర్డ్ ఫ్లూలో జ్వరం, ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉంటాయి. వీటితోనే ఈ వ్యాధి మొదలవుతుంది. ఫారింగ్జయిటిస్‌లో, ముక్కు దిబ్బెడ, గొంతునొప్పితో మొదలై అంతిమంగా జ్వరం కనిపిస్తుంది. కానీ బర్డ్ ఫ్లూ ఏకంగా జ్వరంతో మొదటి రోజే ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు వేధిస్తాయి. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులకు మినహా బర్డ్‌ఫ్లూ తీవ్రమైన పరిణామాలకు దారి తీయదు. అయితే బర్డ్ ఫ్లూ సోకినప్పుడు, లక్షణాల ఆధారంగా చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. అవసరాన్ని బట్టి వైద్యులు మాత్రమే తగిన యాంటీబయాటిక్స్ సూచించగలుగుతారు. దగ్గు, జలుబులను తగ్గించుకోవడం కోసం వేడి నీటి ఆవిరి, గోరువెచ్చని నీటితో నోరు పుక్కిలించడం లాంటి చిట్కాలు పాటించవచ్చు.

ఫారింగ్జయిటిస్‌ను, ఎటువంటి వైద్య చికిత్స అవసరం లేకుండా, రోగనిరోధకశక్తి సహాయంతో ఐదు రోజుల్లోనే అదుపులోకి తెచ్చుకోవచ్చు. కానీ బర్డ్ ఫ్లూకు వైద్య చికిత్స అవసరమవుతుంది. అయినప్పటికీ లక్షణాల తీవ్రతను బట్టి వైద్యులను సంప్రతించడం అవసరం.






బరువు తగ్గడం కోసం ఒకే రకమైన పదార్థాలను తినడమే... మోనోట్రోపిక్ డైట్. ఈ తరహా డైట్‌తో బరువు తగ్గినా అది తాత్కాలికం కావచ్చు. దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని నష్టపరచవచ్చు. ఈ డైట్‌ను అనుసరించడం కోసం ఒకే పదార్థానికి దీర్ఘకాలం పాటు కట్టుబడి ఉండాలి. అరటిపండ్లు ఎంచుకునే అరటిపండే తినాలి. కొందరు బంగాళాదుంపలు, గుడ్లు కూడా ఎంచుకుంటూ ఉంటారు. అవి తప్ప వేరే పదార్థాలేవీ తినకూడదు. ఇలా క్యాలరీల మీద కోత విధించే మోనో డైట్ వల్ల బరువు తగ్గే ప్రక్రియ వెంటనే మొదలైపోతుంది. అయితే ఒంట్లో నీటి శాతం తగ్గడం, కండర

## బరువు తగ్గించే 'మోనో డైట్'

క్షీణత వల్ల కూడా బరువు తగ్గే అవకాశం ఉందనే విషయం గుర్తుంచుకోవాలి. బరువు తగ్గడంతో కూడా నీరసం, నిస్సత్తువలు కూడా వేధిస్తాయి.

దుష్ప్రభావాలు..మోనో డైట్‌లో భాగంగా పోషకాల కొరత ఏర్పడడం వల్ల ఆహారం మీద వ్యామోహం పెరుగుతుంది. దాంతో అవసరానికి మించి తినే ప్రమాదం ఉంటుంది. పోషక లోపం వల్ల గాల్‌స్టోన్స్, ఎలక్ట్రొలైట్ అసమతౌల్యం, మలబద్ధకం, తలనొప్పి, నీరసం, పోషకలోపాలు, కండర క్షీణతలు వేధిస్తాయు. మరీ ముఖ్యంగా అధిక రక్తపోటు, మధుమేహం, హృద్రోగాలు లాంటి ఆరోగ్య సమస్యలున్నవారు వైద్యులను సంప్రతించకుండా మోనో డైట్‌ను అనుసరించకూడదు.

## తీవ్ర ఒడిదుడుకులు.. చివరకు నష్టాలతోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు..






**న్యూఢిల్లీ-నవభూమి:**విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు దేశీయ సూచీల పతనాన్ని శాసిస్తున్నాయి. మరోవైపు వాణిజ్య యుద్ధాల భయంతో ప్రపంచ మార్కెట్లు కూడా నష్టాలనే చవిచూస్తున్నాయి. దీంతో సోమవారం కాస్త ఊపిరి పీల్చుకున్న దేశీయ సూచీలు మంగళవారం తీవ్ర ఒడిదడుకులను ఎదుర్కొన్నాయి. చివరకు స్వల్ప నష్టాలతో రోజును ముగించాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ మరింత క్షీణించింది. సోమవారం ముగింపు (75, 996)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 400 పాయింట్ల లాభంతో రోజును ప్రారంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత లాభనష్టాలతో దోబూచులాడింది. ఒక దశలో 76 వేల పైకి ఎగబాకి తిరిగి నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడే గరిష్ఠం నుంచి 500 పాయింట్లకు పైగా కోల్పోయి 75, 531 వద్ద కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 29 పాయింట్ల స్వల్ప నష్టంతో 75, 967 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 14 పాయింట్ల స్వల్ప నష్టంతో 22, 945 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో పెర్సిస్టెంట్, సోనా బీఎల్‌డబ్ల్యూ, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, ఫియోనిక్స్ మిల్స్ షేర్లు లాభాలను ఆర్జించాయి. ఎన్‌బీసీసీ, కల్యాణ్ జువెల్లర్స్, హెచ్‌ఎఫ్‌సీఎల్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి.

## కీలక పరిణామం.. భారత్‌లో ఉద్యోగుల నియామకాలు ప్రారంభించిన టెస్లా!



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత ఈవీ మార్కెట్‌లో ప్రవేశించాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టెస్లా సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో సిబ్బంది నియామకాలను ప్రారంభించింది. ఢిల్లీ, ముంబై నగరాల్లో వివిధ పోస్టుల్లో ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్టు లింక్డ్‌ఇన్ వేదికగా ప్రకటించింది. టెస్లా ప్రకటన ప్రకారం, సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతోంది. మగిలిన పోస్టులకు నియామకాలు ముంబైలో చేపడుతోంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా అధినేత మోదీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టెస్లా భారత్‌లో నియామకాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. టెస్లా సంస్థ కొన్నేళ్లుగా భారత విపణిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. 40 వేల డాలర్లకు పైబడిన ఖరీదైన కార్లపై భారత్ ఇప్పటివరకూ 110 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని విధించింది. ఇటీవల దీన్ని 70 శాతానికి తగ్గించింది. భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ చైనాతో పోలిస్తే చిన్నదే అయినా టెస్లాకు ప్రస్తుత పరిస్థితుల్లో కీలకంగా మారింది. భారత్‌లో గతేడాది లక్ష యూనిట్ల విద్యుత్ కార్లు విక్రయం కాగా చైనాలో ఈ సంఖ్య ఏకంగా 11 మిలియన్లు. అయితే, దశాబ్దం తరువాత తొలిసారిగా టెస్లా కార్ల అమ్మకాలు తగ్గాయి. దీనికి చెక్ పెట్టేందుకు భారత మార్కెట్‌లో ఎంట్రీకి టెస్లా ప్రయత్నిస్తోందని సమాచారం.
ఇటీవల డోనాల్ట్ ట్రంప్‌తో సమావేశం అనంతరం ప్రధాని మోదీ అమెరికాతో వాణిజ్యలోటుపై దృష్టి పెట్టేందుకు అంగీకరించారు. రక్షణ రంగ కొనుగోళ్ల పెంపు, ఎఫ్-35 యుద్ధ విమానాల డీల్ వంటివి తెరపైకి వచ్చాయి. ఇక ట్రంప్ కేబినెట్‌లో కీలకంగా మారిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. అయితే, మస్క్ వ్యక్తిగత హోదాలో మోదీని కలిశారా లేక అమెరికా ప్రభుత్వం తరుపున సమావేశమయ్యారా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, ట్రంప్ ప్రభుత్వంలో మస్క్‌కు ప్రాధాన్యం పెరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ, ప్రభుత్వ అవసరాల మధ్య సరిహద్దు రేఖ చెరిగిపోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఇటలీ ప్రభుత్వ కమ్యూనికేషన్ కోసం స్పేస్‌ఎక్స్ సేవలు వినియోగించుకునేందుకు చర్చలు జరుగుతున్నట్టు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. డొనాల్డ్ ట్రంప్‌తో ఇటలీ ప్రధాని సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

## మార్చిలో టీసీఎస్‌లో శాలరీ పెంపు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ టీసీఎస్ ఉద్యోగుల శాలరీలు పెంచేందుకు రెడీ అయ్యింది. మార్చిలో జీతాల్లో పెంపు ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు ఏప్రిల్ నుంచి ఉద్యోగులు పెరిగిన జీతాలు అందుకోనున్నారు. అయితే, శాలరీ పెంపు ఈ మారు 4 నుంచి 8 శాతం మధ్య ఉంటుందని సమాచారం. "శాలరీ పెంపు సమాచారం మాకు అందింది. ఈ సారి 4 - 8 శాతం మధ్య ఉంటుందని తెలిపారు. ఈసారి శాలరీ పెంపు తక్కువగానే ఉందని చెప్పకతప్పదు" అని ఓ ఉద్యోగి జాతీయ మీడియాకు తెలిపారు. 2022 ఆర్థిక సంవత్సరంలో టీసీఎస్ ఉద్యోగుల శాలరీలు సగటున 10.5 శాతం మేర పెరిగాయి. కానీ గత ఆర్థిక సంవత్సరంలో మాత్రం ఇది 7-9 శాతానికి పడిపోయింది. ఇక భారతీయ టాప్ ఐటీ కంపెనీలు అన్నింటిలో ఈసారి జీతాల పెంపు ఓమోస్తరు స్థాయిలోనే ఉండనుంది.
ప్రపంచవ్యాప్తంగా ఆర్థికరంగంలో ఒడిదుడుకులు భారతీయ ఐటీ రంగంపై పడటమే ఇందుకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొవిడ్ సంక్షోభ సమయంలో భారతీయ ఐటీ ఉద్యోగులు అత్యధిక స్థాయిలో శాలరీల పెంపు పొందిన విషయం తెలిసిందే. మరోవైపు, భారత్‌లో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ శాలరీ పెంపునకు సంబంధించి ఫిబ్రవరి చివరికల్లా ఉద్యోగులకు సమాచారం ఇవ్వనుంది. ఇన్ఫోసిస్‌లో శాలరీ పెంపు 5 నుంచి 8 శాతం వరకూ ఉండొచ్చని అంచనా. ఇక టీసీఎస్‌లో ప్రస్తుతం ఆరు లక్షల పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. ఈ మార్చి నెలాఖరు కల్లా మరో 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునేందుకు టీసీఎస్ యోచిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఇంతకంటే ఎక్కువ మందిని నియమించుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇక టీసీఎస్‌లో శాలరీ పెంపు, వేరియబుల్ పేఔట్ చెల్లింపులు ఉద్యోగుల రిటర్న్ టూ ఆఫీస్ లింక్ చేసినట్టు కూడా తెలుస్తోంది. రిటర్న్ టూ ఆఫీస్ విధానాన్ని కంపెనీ 2024 మొదట్లో ప్రవేశపెట్టింది.

## త్వరలో రూ.లక్షకు చేరుకోనున్న పది గ్రాముల బంగారం..

**న్యూఢిల్లీ-నవభూమి:**అమ్మో అనిపిస్తోంది బంగారం ధర. పెరగడమే తప్ప..తగ్గడమే లేదనట్టు దూసుకువెళ్తోంది. దీంతో కొందామంటే ఒక భయం..ఆగుదామంటే ఇంకో భయంగా ఉంది..గోల్డ్ లవర్స్ పరిస్థితి. త్వరలోనే 10గ్రాముల బంగారం ధర రూ. లక్ష దాటడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ పుత్తడి పరుగు ఎంతవరకూ..? లక్ష టార్గెట్ ఈ ఏడాదే రీచ్ అవుతుందా..? పసిడి పరుగులు ఆగట్లేదు. ఊహించిన దానికంటే వేగంగా పరిగెడుతోంది. తొలిసారి 89 వేల రూపాయల మార్కు తాకి, ఆల్ టైమ్ హైని టచ్ చేసింది గోల్డ్. నేను మాత్రం తక్కువ తిన్నానా అన్నట్లు వెండి కూడా పరుగులు తీస్తోంది. ఈ పసిడి పరుగులు ఎందాకా? లక్షను టచ్ చేసి ఆగుతుందా? ఇంకా ముందుకు సాగుతుందా?సప్త సముద్రాలు దాటి ఉన్న ఒక దేశ అధ్యక్షుడు ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరను శాసిస్తున్నాడు. అవును, ఇది పూర్తిగా నిజం. అమెరికాలో కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తలుచుకుంటే, భారతదేశంలో తులం బంగారం (10 గ్రాములు) ధర లక్ష రూపాయలు దాటుతుంది. ఎలా అనుకుంటున్నారా? భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలలో బంగారం ధర ఆకాశానికి అంటుతోంది. త్వరలోనే 10గ్రాముల బంగారం ధర రూ. లక్ష దాటడం ఖాయంగా కనిపిస్తోంది

## ఎంజీ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌గా అనురాగ్ మెహ్రోత్రాను నియమించింది



**న్యూఢిల్లీ-నవభూమి:** JSW MG మోటార్ ఇండియా టుడే, అనురాగ్ మెహ్రోత్రాను కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియోగిస్తున్నట్లుగా ఈ రోజు ప్రకటించింది. మూడు దశాబ్దాల ప్రొఫెషనల్ అనుభవం కలిగిన ఆయన, ఆటోమేటివ్ రంగం విక్రయాలు, మార్కెటింగ్, వ్యూహరచన, వ్యాపారాభివృద్ధిలో కీలకమైన లీడర్‌షిప్ పాత్రలను నిర్వహించారు. ఆయనకు ఉన్న విస్తృతమైన అనుభవంలో, ప్రముఖ జాతీయ అంతర్జాతీయ కంపెనీల్లో లీడర్షిప్ హోదాలు కూడా ఉన్నాయి. ఆయన గతంలో టాటా మోటర్స్ కమర్షియల్ వెహికల్స్‌లో స్ట్రేటజీ అండ్ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగపు వైస్ ప్రెసిడెంటుగా, ఫోర్డ్ ఇండియాలో ప్రెసిడెంట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవులు నిర్వహించి ఉన్నారు. అనురాగ్ గారి స్వస్థలం గురుగ్రామ్. ఆయన కంపెనీ వ్యూహాత్మక అభివృద్ధి కార్యకలాపాలను ముందుకు నడిపించటమే కాక, కంపెనీ నాలుగు బ్రాండ్ పునాదులైన – వైవిధ్యం, అనుభవం, ఆవిష్కరణ కమ్యూనిటీలను పటిష్టం చేస్తారు. రాజీవ్ ఛాబా ఆరంభం నుండి భారతదేశంలో MG బ్రాండును స్థాపించటంలో కీలకమైన పాత్రను నిర్వహించారు. ఆయన నాయకత్వంలో, MG, దేశంలోని నాలుగు అగ్రగామి కార్ బ్రాండ్లలో ఒకటిగా ఆవిర్భవించి, ఆవిష్కరణకు, వివిధ విభాగాల్లో కొత్తపుంతలకు ప్రమాణాలను నిర్ధారించింది. అధునాతనమైన పలు వినూత్నమైన ఉత్పత్తులను లాంచ్ చేయటానికి ఆయన శ్రీకారం చుట్టారు. దాతృత్వం, వైవిధ్యం, పారదర్శకతలను బలంగా విశ్వసించే రాజీవ్ గారి నాయకత్వంలో ప్రామాణికత, ప్రమేయమున్న పక్షాలతో ప్రత్యక్ష కమ్యూనికేషన్ ఆయన నాయకత్వంలో ప్రత్యేకతలు. పటిష్టమైన, అత్యుత్తమమైన పనితీరు కలిగిన టీమును ఆయన నిర్మించారు. ఈ జట్టు, విజయవంతంగా ఎన్నో సవాళ్ళను అధిగమించి, MG సత్వర అభివృద్ధికి దోహదం చేసి, భారత మార్కెట్‌లో స్థానాన్ని పటిష్టం చేసేందుకు కృషి చేసింది. జాయింట్ స్టీరింగ్ కమిటీ సభ్యునిగా మేనేజ్‌మెంటుకు, షేరుహోల్డర్లకు సలహాసంప్రదింపులను రాజీవ్ అందించటం కొనసాగిస్తారు. క్రొత్త నియామకాన్ని గురించి మాట్లాడుతూ, యూదే, SAIC ప్రెసిడెంటుకు అసిస్టెంట్ ఇంటర్నేషనల్ ఆపరేషన్ హెడ్, SAIC మోటార్ ఇలా చెప్పారు, "భారతదేశంలో బ్రాండు నిర్మాణంలో ఆయన చూపిన అసామాన్యమైన నాయకత్వానికిగాను మేము ఆయనకు కృతజ్ఞులం. అనురాగ్ గారి వైవిధ్యభరితమైన అనుభవం, స్థానిక అంతర్జాతీయ మార్కెట్ తీరుతెన్నుల పట్ల ఆయనకు ఉన్న లోతైన అవగాన, ఈ ప్రస్థానాన్ని తదుపరి స్థాయికి తీసుకువెళ్ళటంలో కీలకం కాగలదు." పార్థ్ జిందల్, డైరెక్టర్, JSW MG మోటార్ ఇండియా ఇలా అన్నారు, 'We are at an inflexion point in our NEV ప్రస్థానంలో మనం ఒక మలుపు వద్ద ఉన్నాము, ఉత్కంఠభరితమైన ఉత్పత్తులు పైప్‌లైన్‌లో ఉన్న తరుణంలో ఒక కొత్త యుగంలోకి దూసుకుపోవటానికి సిద్ధంగా ఉన్నాము. బ్రాండు కోసం ఆయన చేసిన అమూల్యమైన కృషికిగాను రాజీవ్‌కు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాము. మోటార్ ఇండియాకు అనురాగ్ గారిని ఆహ్వానించటం మాకు ఆనందంగా ఉన్నది. భారతీయ మార్కెట్ పట్ల ఆయనకు ఉన్న లోతైన అవగాన, న్యూ ఎనర్జీ వెహికల్స్ విషయంలో ఆయనకు ఉన్న వ్యూహాత్మక విజన్, సుస్థిరమైన మొబిలిటీ విషయంలో మాకు ఉన్న నిబద్ధతతో చక్కగా మిళితం కాగలదు."

## మహా కుంభమేళా 2025లో లక్షలాది మందికి సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్‌ను అందిస్తున్న ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్

**న్యూఢిల్లీ-నవభూమి:**తన కార్పొరేట్ సామాజిక బాధ్యత )లో భాగంగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సరళంగా, సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ అనుభవాన్ని అందిస్తూ, భక్తులు, వ్యాపారులు ఇద్దరికీ మహా కుంభమేళాలో అనుభవాన్ని మెరుగుపరుస్తోంది. ఒక వైపు లక్షలాది మంది భక్తులు పవిత్ర స్నానం చేస్తుండగా, బ్యాంక్ ఆర్థిక సేవలను సులభంగా పొందేలా చేస్తూ, సురక్షితమైన లావాదేవీలను నిర్ధారిస్తోంది. ఇక్కడ కార్యక్రమాలన్నీ సజావుగా నిర్వహించేందుకు సహకారాన్ని అందిస్తోంది. ఈ ప్రయత్నం అతిపెద్ద మతపరమైన సమావేశాలలో ఒకటైన కుంభమేళాలో ఆధ్యాత్మిక ప్రయాణానికి మద్దతు ఇవ్వడమే కాకుండా, ప్రపంచంలోని డిజిటల్ ఆర్థిక చేరికను బలోపేతం చేస్తుంది. వినియోగ దారులకు మెరుగైన సేవలను అందించేందుకు చేస్తున్న తన ప్రయత్నాలలో భాగంగా, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ విశాలమైన మేళా మైదానంలో పది (10) వ్యూహాత్మక ప్రదేశాల్లో ఉన్న కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. ఈ కియోస్క్‌లు అవసరమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తుండగా, భక్తులు తమ ఖాతాల నుంచి నగదు డ్రా చేసుకునేందుకు లేదా ఏదైనా బ్యాంకు ఖాతాకు నిధులను బదిలీ చేసేందుకు అవకాశం కల్పిస్తాయి. ఆధార్-లింక్ అయిన బ్యాంక్ ఖాతా ఉన్న ఏ బ్యాంకు వినియోగ దారుడు అయినా ఈ సేవల ప్రయోజనాన్ని పొందవచ్చు. ఇది నగదు నిర్వహణ సవాళ్లను పరిష్కరించేం దుకు, భక్తులు తమ సందర్శన సమయంలో అవసరమైనప్పుడు తమకు కావలసిన నగదును పొందేలా నిర్ధారించుకునేం దుకు సహాయపడుతుంది. అదే విధంగా, స్థానిక వ్యాపారులు ఈ బ్యాంకింగ్ కియోస్క్‌ల ద్వారా తమ రోజువారీ ఆదాయాలను నేరుగా తమ ఖాతాల్లోకి జమ చేసుకోవచ్చు. ఇది వ్యాపారులు తమ దుకాణాల నుంచి ఇళ్ల వరకు నగదును తీసుకెళ్లాల్సిన అవసరాన్ని తప్పించి, వారికి భద్రత అందిస్తూ, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఈ ప్రయత్నం సముదాయాలను శక్తివంతం చేయడంలో, జాతీయ ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో బ్యాంక్ అంకితభావాన్ని చాటి చెబుతుంది. నగదుపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా, బ్యాంక్ అందరికీ సురక్షితమైన, మరింత వ్యవస్థీకృత వాతావరణాన్ని సృష్టించడంలో సహాయపడు తుంది. భక్తులు ఇప్పుడు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి చింతించకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోవచ్చు

## ఇయులోకి ప్రవేశించే సరుకుల మెరుగైన భద్రత, రక్షణకు 1 ఏప్రిల్ 2025 నుండి రైలు, రోడ్డు వరకు ఇంపోర్ట్ కంట్రోల్ సిస్టం 2

**న్యూఢిల్లీ-నవభూమి:**ద యూరోపియన్ యూనియన్ ఇంపోర్ట్ కంట్రోల్ సిస్టం 2 ఇప్పటికే ఉన్న గగన, సముద్ర ఇన్ ల్యాండ్ వాటర్ వే సదుపాయాలకు అదనంగా రోడ్డు రైలు మార్గాలు సహా అన్ని రవాణా విధానాల కోసం ప్రామాణికమైన, ప్రీ-అరైవల్ కస్టమర్స్ ప్రక్రియను ప్రవేశపెట్టడం ద్వారా ప్రవేశించే సరుకుల భద్రత రక్షణను మెరుగుపరిచే లక్ష్యాన్ని కలిగి ఉంది. రావడానికి ముందే ఖచ్చితమైన పూర్తి ఎంట్రీ సమ్మరి డిక్లరేషన్స్ డేటా సమర్పించవలసిందిగా ఆదశించడం ద్వారా రాబోతున్న సరుకులతో కలిగే ప్రమాదాలను మెరుగ్గా అంచనా వేయడానికి కస్టమర్స్ అధికారులకు ICS2 వీలు కల్పిస్తుంది, తద్వారా కస్టమర్స్ నేరాలను నివారించి పోరాడటంలో EU సామర్థ్యాన్ని మెరుగుప రుస్తుంది. అంతిమంగా సురక్షితమైన మరింత భద్రతతో కూడిన వాణిజ్య వ్యాపారాన్ని నిర్ధారిస్తుంది. 1 ఏప్రిల్ 2025 నుండి, రోడ్డు రైలు వాహకాలు EUకి లేదా దాని ద్వారా పంపించిన సరుకుల పై డేటాను పూర్తి ENS ద్వారా కేటాయించాలి. ఈ రవాణా విధానాలను ఉపయోగించి వాహనాలను రవాణా చేసే తపాలా ఎక్స్ ప్రెస్ క్యారియర్లకు, అదే విధంగా లాజిస్టిక్స్ ప్రొవైడర్స్ వంటి ఇతర పార్టీలకు కూడా ఈ బాధ్యత వర్తిస్తుంది. కొన్ని పరిస్థితులలో, EUలో నిర్ణయించబడిన తుది కన్సైనీలు కూడా ICS2లో ENS డేటాను సమర్పించాలి.
ఈ తేదీ నాటికి సిద్ధంగా లేని ఎకనామిక్ ఆపరేటర్స్ కూడా తాజాగా మార్చి 1, 2025 నాటికి నియామక విండోను అభ్యర్థించడానికి , తాము నమోదు చేసుకున్న వారి EORI నంబర్ ను పొందిన EU సభ్య రాష్ట్రం ( నేషనల్ కస్టమ్స్ అథారిటీ) నేషనల్ సర్వీస్ డెస్క్ ని సంప్రదించాలి. విస్తరణ విండోలు అభ్యర్థన పై మాత్రమే మంజూరు చేయబడతాయి. ICS2 ఆవశ్యకాలకు అనుగుణం గా ఉండటానికి, ప్రభావానికి గురైన వ్యాపారాలు తమ క్లైంట్ల నుండి ఖచ్చితమైన పూర్తి డేటాను వారు సేకరించడాన్ని నిర్ధారించాలి, తమ - వ్యవస్థ లను కార్యకలాపాల ప్రక్రియలను అప్ డేట్ చేయాలి, తమ సిబ్బందికి కావలసినంత శిక్షణ కేటాయించాలి. ఎకనామిక్ ఆపరేటర్లు కూడా కస్టమ్స్ అధికారులతో సందేశాలను పొందడానికి మార్చుకునే తమ సామర్థ్యాన్ని ధృవీకరించడానికి ICS2కి కనక్ట్ అవడానికి ముందు స్వీయ- అనుగుణ్యత పరీక్షను విజయవంతంగా పూర్తి చేయవలసి ఉంది. వ్యాపారులు ICS2 ఆవశ్యకతలను సకాలంలో నెరవేర్చకపోతే సరుకులు EU సరిహద్దుల వద్ద ఆపుచేయబడవచ్చు.

## రూ.3.5 కోట్లకు పైగా పరిరక్షణ నిధులను అందిస్తున్న హాబిటాట్స్ ట్రస్ట్ గ్రాంట్

### 8వ ఎడిషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది

**నోయిడా-నవభూమి:**భారతదేశ సహజ ఆవాసాలు, స్వదేశీ జాతులను రక్షించేందుకు కట్టుబడిన లాభాపేక్షలేని సంస్థ హాబిటాట్స్ ట్రస్ట్, ది హాబిటాట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ తన 8వ ఎడిషన్‌ను ప్రారంభించామని ప్రకటించింది. ఈ ఎడిషన్ ముఖ్యాంశం ది హాబిటాట్స్ ట్రస్ట్ రీసెర్చ్ గ్రాంట్‌ను పరిచయం చేస్తుండగా, ఇది పర్యావరణ పరిరక్షణ, సామాజిక సాంకేతిక అంశాలపై ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యాన్ని కలిగి ఉంది. దరఖాస్తులు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 17 వరకు పంపించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఫైనల్స్‌కు చేరుకున్న వారి వివరాలను అక్టోబర్ 2025లో ప్రకటిస్తారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు www.thehabitatstrust.orgలో దరఖాస్తు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా పరిరక్షణ ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చేందుకు, ఈ ఏడాది చరిత్రలో అతిపెద్ద ఫండింగ్ సైకిల్ రూ. 3.5 కోట్లకు పైగా నిధులు కేటాయించారు.

**గమనించవలసిన ముఖ్యమైన తేదీలు**

**దరఖాస్తు సమర్పణ తేదీలు**

**ఫిబ్రవరి 15 నుంచి మార్చి 17, 2025 వరకు**

**గ్రాంట్ గ్రహీత ప్రకటన**

అక్టోబర్ 2025ఈ ఏడాది నిధుల విస్తరణ ప్రాధాన్యతను ది హాబిటాట్స్ ట్రస్ట్ అధిపతి రుషికేష్ చవాన్ వివరిస్తూ "టిహెచ్‌టి గ్రాంట్లు అంతగా తెలియని జాతులు కీలకమైన ఆవాసాలలో అర్థవంతమైన మార్పును పరిరక్షించేందుకు, ముందుకు తోడ్కొని వెళ్లేందుకు మా నిబద్ధతను సూచిస్తుంది. ప్రభావవంతమైన ప్రాజెక్టులలో పెట్టుబడి పెట్టడం ద్వారా, భారతదేశ జీవవై విధ్యాన్ని రక్షించేందుకు, నరుద్ధరించేందుకు పరిష్కారాలను సృష్టిస్తున్న సంస్థలు వ్యక్తులతో మేము భాగస్వామ్యం చేస్తాము" అని తెలిపారు.
మూల్యాంకన ప్రక్రియ:దరఖాస్తులను శాస్త్ర వేత్తలు పరిరక్షకు లతో సహా నిపుణుల బృందం పలు-దశల మూల్యాంకనం చేస్తారు. ప్రాజెక్టులను వాటి ఔచిత్యం, ఆశించిన పరిరక్షణ ప్రభావం, వాటా దారుల ఎంగేజ్‌మెంట్, స్కేలబిలిటీ, ప్రతిరూపత స్థిరత్వం ఆధారంగా అంచనా వేస్తారు. దీర్ఘకాలికం, భూమిపై ప్రభావం చూపే అవ కాశం ఉన్న ప్రయత్నాలకు నిధులు వినియోగి స్తారని కఠిన మైన ప్రక్రియ నిర్ధారిస్తుంది. భారతదేశంలో జీవవైవిధ్య పరిరక్షణ కోసం పనిచేసే భావి దరఖాస్తుదారులు ఈ దిగువ పేర్కొన్న విభాగాల **కింద దరఖాస్తు చేసుకోవచ్చు:**

**టిహెచ్‌టి పరిరక్షణ గ్రాంట్**

సంరక్షణలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న రెండు సంస్థలకు పరిరక్షణ గ్రాంట్ ఒక్కొక్కరికి ?1 కోటి అందిస్తుంది. ఇది ఆవాస క్షీణత, జీవవైవిధ్య నష్టం, మానవ-వన్యప్రాణుల సంఘర్షణ వంటి క్లిష్టమైన సవాళ్లపై దృష్టి పెడుతుంది. గతేడాది, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి డాక్టర్ ఉమేష్ శ్రీనివాసన్ డాక్టర్ అనుభాబ్ ఖాన్, మిల్లో టాసర్ సింగ్చుంగ్ విలేజ్ కౌన్సిల్‌తో కలిసి, అరుణాచల్ ప్రదేశ్‌లో బుగున్ లియోసిచ్లాను సంరక్షించేందుకు చేసిన కృషికి నిధిని అందుకున్నారు. ఇది కేవలం 14 నుంచి 20 సంఖ్యతో ఒకే ప్రాంతంలో మాత్రమే కనిపించే తీవ్రంగా అంతరించిపోతున్న పక్షి. టిహెచ్‌టి యాక్షన్ గ్రాంట్‌టిహెచ్‌టి యాక్షన్ గ్రాంట్‌ను తక్కువగా తెలిసిన జాతులు, ఆవాసాలపై దృష్టి సారించిన లక్ష్య పరిరక్షణ ప్రయత్నాల కోసం ఎంపిక చేసిన మూడు సంస్థలు లేదా వ్యక్తులకు ఒక్కొక్కరికి 25 లక్షలు అందిస్తారు. గత ఏడాది నిధులను అందుకున్న వారు లక్షద్వీప్ ద్వీపసమూహంలో అంతరించిపోతున్న నీలి తిమింగ లాలను నిష్క్రియాత్మక శబ్ద పర్యవేక్షణను ఉపయోగించి అధ్యయనం చేసే సీటాసియన్ బయోఅకౌస్టిక్స్ నిపుణురాలు దివ్య పనికర్‌బీ గడ్డి గుజ్జర్ పశువుల కాపరులతో కూడిన సముదాయం నేతృత్వం లోని పర్యావరణ పర్యాటకం ద్వారా హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రాలో తీవ్రంగా అంతరించిపోతున్న రాబందుల ఆవాసాలను రక్షిస్తున్న మాల్యశ్రీ భట్టాచార్య పర్యవేక్షణ సంఘర్షణ తగ్గింపు ద్వారా మానవ ఆధిపత్య ప్రకృతి దృశ్యాలలో భారతీయ బూడిద రంగు తోడేళ్లను రక్షించేందుకు పశ్చిమ బెంగాల్‌లో సముదాయ-ఆధారిత పరిరక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న దుర్గాపూర్ వైల్డ్‌లైఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ నేచర్ గైడ్ సొసైటీబీ ఘరి యల్స్, గంగా డాల్ఫిన్లు భారతీయ స్కిమ్మర్లు వంటి జాతులకు ప్రయోజనం చేకూర్చే ఇసుక తవ్వకాల వల్ల ముప్పు పొంచి ఉన్న నదీ తీర ఆవాసాలను రక్షించడానికి పర్యావరణ పాలన పౌరుల భాగస్వామ్యాన్ని పెంచుతున్న మధ్యప్రదేశ్‌లోని వెడిటమ్ ఇండియా ఫౌండేషన్ ఉన్నాయి.

## పోంజీ స్కాం పేరుతో రూ. 870 కోట్లు లూటీ..




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో మరో స్కాం వెలుగులోకి వచ్చింది. పోంజీ పేరుతో తక్కువ సమయంలో పెట్టుబడులు చేయడం ద్వారా ఎక్కువ మొత్తాలను పొందవచ్చని అనేక మందిని మభ్యపెట్టారు. ఈ క్రమంలో ఓ సంస్థ వేలాది మందిని చీట్ చేసి దాదాపు రూ. 1,700 కోట్లు వసూలు చేసింది. తాజాగా ఈ కేసు గురించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అనే సంస్థ అమెజాన్, బ్రిటానియా వంటి ప్రముఖ కంపెనీలతో డిపాజిటర్లతో సంబంధం ఉందని చెప్పి, 22% వరకు రాబడి ఇస్తామని హామీ ఇచ్చారు. సగం మాత్రమే.. ఈ నేపథ్యంలో 2021 నుంచి ఫాల్కన్ సంస్థ దాదాపు 7,000 మంది పెట్టుబడిదారుల నుంచి రూ. 1,700 కోట్లు వసూలు చేసింది. ఈ మొత్తం నుంచి కేవలం సగం మాత్రమే తిరిగి వసూలు చేసినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకా దాదాపు 100 మిలియన్ డాలర్లు తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు అధికారులు. ఈ సంస్థ అధిక రాబడి ఇస్తామని అనేక మందికి హామీ ఇచ్చి మోసగించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని పోలీసు అధికారులతోపాటు బాధితులు కూడా మీడియాకు తెలియజేశారు. ఈ కేసు విషయంలో పోలీసులు శనివారం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

**సోషల్ మీడియా ద్వారా..**


న్యూఢిల్లీకి చెందిన ఆభరణాల వ్యాపారి అంకిత్ బిహానీ గత వారం 50 మంది పెట్టుబడిదారులతో సమావేశమయ్యారు. ఆ క్రమంలో వారు కోల్పోయిన రూ. 500 కోట్లు తిరిగి పొందడానికి చట్టపరమైన పరిష్కారాల గురించి చర్చించారు. వారిలో ఎక్కువ మంది సోషల్ మీడియా ద్వారా పెట్టుబడి గురించి తెలుసుకుని అందులో మనీ పెట్టినట్లు బిహానీ తెలిపారు. తాను కష్టపడి సంపాదించిన డబ్బు, ఇప్పుడు ఎలా తిరిగి పొందాలో అర్థం కావడం లేదని 15 మిలియన్లు కోల్పోయిన టెక్ ఉద్యోగి రూపేష్ చౌహాన్ అన్నారు. ఇలా అనేక మంది వారి సంపదను కోల్పోయారు.

**అవగాహన లేకుండా..**

ఇటీవల సోషల్ మీడియా గ్రూపుల్లో నకిలీ పెట్టుబడి పథకాల పేరుతో ప్రజలను మోసం చేసే ఘటనలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇది కూడా అలాంటిదే అని చెప్పవచ్చు. అయితే వీటిలో మోసపోతున్న వారిలో అనేక మంది విద్యావంతులే ఉండటం విశేషం. ఈ మోసాలకు ప్రధాన కారణం పలు రకాల యాప్స్, వెబ్‌సైట్‌లు, కాల్ సెంటర్‌లు కారణమవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో మోసపూరిత పథకాలపై అవగాహన లేకుండా పెట్టుబడులు చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు.
ఫాల్కన్ సంస్థ కొత్త పెట్టుబడుల నుంచి వచ్చిన డబ్బును పాత పెట్టుబడులకు ఉపయోగించింది. మిగిలిన నిధులను వివిధ షెల్ సంస్థలకు మళ్లించిందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఫాల్కన్ వ్యవస్థాపకుడు, ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్ కోసం పోలీసులు వెతుకుతున్నారు.

## రూ.250తో నెలవారీ 'సిప్'

**న్యూఢిల్లీ-నవభూమి:** మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ (ఎస్‌బీఐ ఎంఎఫ్) మరింత సులభతరం చేసింది. తన 'జననివేశ్ సిప్' పథకం కింద మదుపరులు నెలనెలా క్రమానుగత పెట్టుబడుల పథకం (సిప్)లో పెట్టే కనీస పెట్టుబడి పరిమితిని రూ. 250కు కుదించింది. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ సమక్షంలో ఎస్‌బీఐ ఎంఎఫ్ ఈ పథకాన్ని ప్రారంభించింది. ఎస్‌బీఐ యోనో యాప్‌తో పాటు పేటీఎం, జీరోధా, గ్రో వంటి ఫిన్‌టెక్ కంపెనీల ద్వారానూ మదుపరులు ఈ సిప్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. ఈ సిప్ పెట్టుబడుల కోసం బ్యాంకు ద్వారా చేసే చెల్లింపులను ఎస్‌బీఐ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చింది. సిప్ ద్వారా ఎంఎఫ్ పథకాల్లో తొలిసారిగా మదుపు చేసే మదుపరులు, చిన్న పొదుపరులు, అసంఘటిత రంగంలోని మదుపరులను దృష్టిలో ఉంచుకుని ఈ రూ. 250 సిప్ పథకం ప్రారంభించాం' అని ఎస్‌బీఐ ఎంఎఫ్ ఎండీ, సీఈఓ నంద కిశోర్ చెప్పారు. ఆర్థిక అభివృద్ధిలో వినూతనత్వం, సమ్మిళితం కూడా కీలకం. అందులో భాగంగానే ఈ పథకం తీసుకొచ్చాం' అని ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. 'సిప్' ద్వారా ఎస్‌బీఐ ఎంఎఫ్ పథకాల్లో పెట్టే కనీస పెట్టుబడిని రూ. 250కి తగ్గించడంపై కార్యక్రమంలో పాల్గొన్న సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది తన చిరకాల కల అన్నారు. అంతర్జాతీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు గిట్టుబాటు కాదని వదిలేసిన ఈ ప్రతిపాదనను ఎస్‌బీఐ ఎంఎఫ్ ప్రారంభించడాన్ని ఆమె అభినందించారు.





## ఆప్ మాజీ మంత్రి ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రపతి గ్రీన్‌సిగ్నల్


**న్యూఢిల్లీ-నవభూమి:**ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ కు మరిన్ని లీగల్ చిక్కులు తప్పేలా లేవు. మనీలాండరింగ్ కేసులో ఆయనపై విచారణ జరిపేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారంనాడు అనుమతించారు. సత్యేంద్ర జైన్ ప్రాసిక్యూషన్‌కు అనుమతించాలని హోం మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 14న రాష్ట్రపతిని కోరింది.సత్యేంద్ర జైన్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు తగినన్ని ఆధారాలను ఎన్?ఫోర్సెంట్ డైరక్టరేట్ సేకరించినట్టు ఎంహెచ్ఏ తెలిపింది. దీంతో ఆయనపై లీగల్ చర్యలు తీసుకునేందుకు అనుమతించాల్సిందిగా రాష్ట్రపతిని తాము కోరామని పేర్కొంది. రాష్ట్రపతి ఆమోదించడంతో భారతీయ నాగరిక్ సురక్షా సమితి (బీఎన్ఎస్ఎస్) 2023లోని సెక్షన్ 2018 కింద కేసు విచారణ జరుగుతుందని తెలిపింది.సత్యేంద్ర జైన్‌పై ఆరోపణలు ఏమిటి?మనీలాండరింగ్ కేసులో సత్యేంద్ర జైన్ 2022 మే 30న అరెస్టయ్యారు. 2015-2016లో షెల్ కంపెనీల ద్వారా రూ.16.39 కోట్ల మేరకు లాండరింగ్‌కు పాల్పడ్డారు. అరెస్టు అనంతరం తీహార్ జైలుకు ఆయనను తరలించారు. విచారణలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యం, జైలులో సుదీర్ఘకాలం ఉండటంతో ఆయనకు 2023 అక్టోబర్ 18న ఢిల్లీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. కాగా, తాజాగా సత్యేంద్రజైన్ ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో కోర్టులో విచారణ మొదలవుతుంది. కోర్టులో దోషిగా తేలితే లీగల్‌పరంగా చిక్కులు తప్పవు. ఆయన రాజకీయ కెరీర్‌పై కూడా ఆ ప్రభావం పడే అవకాశాలు ఉంటాయి.

## పారిశ్రామికవేత్త హత్య కేసులో షాకింగ్ నిజాలు!



**న్యూఢిల్లీ-నవభూమి:**సమాజంలో బంధాలు, అనుబంధాలు, మమతలు, మానవత్వాలు మట్టికొట్టుకుపోతున్నాయి. చిన్న పిల్లాడి నుంచి కాటికి కాలుచాచిన పెద్దమనిషి దాక అందరూ డబ్బుకు దాసోహం అంటున్నారు. భార్యాభర్తల మధ్య డబ్బుల గొడవలే..తల్లిదండ్రులు పిల్లల మధ్య డబ్బుల గొడవలే..చుట్టాల నుంచి స్నేహితుల దాక అన్నీ పైసా బంధాలే..భూమి పంచాయితీలు మొదలు బిజినెస్ పంపకాల వరకు నిత్యం ఏదో ఒక చోట కలహాలు కలవరపెడుతున్నాయి. డబ్బు కోసం కొట్టుకున్నారంటే అర్థముంటుంది కానీ ఏకంగా ప్రాణాలు తీసేస్తున్నారు నేటి మనుషులు. డబ్బు సంపాదన ధ్యేయంగా పరుగులు పెడుతూ ఈజీ మనీ కోసం జనాలు వెంపర్లాడుతున్నారు. మనీ మత్తులో మనోళ్లు అని కూడా చూడకుండా మటాష్ చేసేస్తున్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఓ బడా పారిశ్రామికవేత్త హత్య అందరినీ కలిచివేసింది. తాత తనకు ఆస్తి పంచివ్వలేదని సొంత మనవడే దారుణంగా చంపిన విషయం తెలిసి సగటు జీవి మనస్సు కకావికలమైంది. హైదరాబాద్ మహానగరంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త చంద్రశేఖర్ జనార్దన్ రావు హత్య విషయం అందరికీ తెలిసిందే. ఆయన హత్య చేసింది సొంత మనవడు. కుమార్తె కొడుకు అయిన కిలారు కీర్తితేజ. జనార్దన్ రావు హత్య జరిగిన తర్వాత వెంటనే పోలీసులు నిందితుడిని గుర్తించారు. కీర్తితేజను అరెస్ట్ చేసి అతడి నుంచి హత్య వివరాలను రాబట్టారు. కీర్తితేజ పోలీస్ కస్టడీ సోమవారమే ముగిసింది. పోలీస్ విచారణలో షాకింగ్ గురి చేసే ఎన్నో అంశాలు బయటపడ్డాయి. కీర్తితేజ తన తాతను హత్య చేయడానికి దారితీసిన కారణాలు, హత్య చేసిన విధానం చూసి పోలీసులే నివ్వెరపోయారు. తాజాగా కీర్తితేజ నుంచి రాబట్టిన విషయాలను పోలీసులు వెల్లడించారు. తాత జనార్దన్ రావు తనను నిత్యం అవమానించేవాడని, అది భరించలేకే హత్య చేసినట్టు కీర్తితేజ విచారణలో చెప్పినట్టు సీఐ శోభన్ తెలిపారు.. బీసీసీఐకి నిరసనల సెగ తాత జనార్దన్ రావు..తనను ఏనాడు మనవడిగా చూడలేదని, కనీసం కుటుంబ సభ్యుడినన్నా వాత్సాల్యం చూపించలేదని.. అందరి కంటే హీనంగా చూస్తూ తనపట్ల దయనీయంగా వ్యవహరించేవాడని కీర్తితేజ పోలీసుల ఎదుట వాపోయాడు. ప్రతీ రోజూ తనను బెగ్గర్ అంటూ సంబోధించడమే కాకుండా తమ ఆఫీస్ కు వెళ్తే అక్కడ కూడా హీనంగా చూసేవాడట. దీంతో తమ సిబ్బంది కూడా తనను చిన్నచూపు చూసేవారని చెప్పుకొచ్చాడు. ఆస్తి పంపకాలు పదవులు కేటాయింపుల్లోనూ తనను తక్కువగా చూశాడని, చివరకు డైరెక్టర్ పదవి కూడా జనార్దన్ రావు రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడని, అప్పటి నుంచి తనకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయని, దీంతో చేసేదేంలేక తాతను హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు కీర్తితేజ వెల్లడించాడు. తాతను హత్య చేస్తేనే తనకు ఆస్తి దక్కుతుందని ఇన్ స్టా మార్ట్ నుంచి ఓ కత్తిని కొనుగోలు చేశాడని చెప్పాడు. హత్య జరిగిన రోజు తనకు తాత జనార్దన్ రావుకు పెద్ద గొడవ జరిగిందని, తనకు వాటా కావాలని అడిగితే..ఇవ్వను పో అంటూ దూషించాడట. ఇక కోపంతో రగిలిపోయిన కీర్తితేజ తాను కొన్న కత్తితో తాతను కసితీరా పొడిచి అక్కడి నుంచి పారిపోయాడు. హత్య చేసిన తర్వాత బీఎస్ మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో కత్తి, రక్తంతో తడిచిన బట్టలను తగులబెట్టానని కీర్తితేజ వెల్లడించాడు. అయితే మంటల్లో కత్తి కాలిపోకపోవడంతో దాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన వెంటనే కీర్తితేజను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ ప్రారంభించారు. అయితే మొదటి రోజు విచారణలో అతడు నోరు విప్పలేదు. సీన్ రీకన్ స్ట్రక్షన్ కు కూడా సహకరించలేదు. ఏ ప్రశ్న అడిగినా నేలచూపులు చూసేవాడు. ఇక రెండో రోజు సైతం సీన్ రీకన్ స్ట్రక్షన్ కు తీసుకెళ్లిన పోలీసులు తమదైన శైలిలో విచారణ మొదలుపెట్టారు. ఇక అప్పటి నుంచి కీర్తితేజ హత్యపై నోరువిప్పాడు. నిందితుడిని విచారణ అనంతరం చంచల్ గూడ జైలుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు. కీర్తితేజ లాంటి యువత నేడు సమాజంలో ఎక్కువగా పెరిగిపోతుండడం కలవరపరిచే అంశమే. ఆస్తి పంపకాలు ఇప్పుడు చాలెంజింగ్ గా మారాయి. కుటుంబ సభ్యులు అందరు కూర్చుని మాట్లాడుకుంటే సద్దుమణిగే సమస్యలు ఎన్నో ఉంటాయి. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు మనుషుల ప్రాణాలను తీసుకుంటుండడం బాధాకరం.

## అమెరికాపై అక్రమంగా కాలుమోపని తెలుగోడు.. డిపోర్టేషన్ జాబితానే సాక్ష్యం



**అమెరికా-నవభూమి:**అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారో లేదో.. డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన డిపోర్టేషన్ (అక్రమ వలసదారుల తరలింపు) ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. ఆ దేశం వారు ఈ దేశంవారు అని చూడకుండా అక్రమం ఉంటున్నవారందరినీ బలవంతంగా విమానాలు ఎక్కించి మరీ అమెరికా నుంచి పంపేస్తున్నారు. ఎవరు జోక్యం చేసుకున్నా ఆగేది లేదంటూ సైనిక విమానాల్లో సంకెళ్లు వేసి వారి స్వదేశాల్లో దింపేస్తున్నారు. అమెరికా నుంచి 104 మంది అక్రమ వలసదారులతో కూడిన విమానం ఈ నెల 5న ఒకటి వచ్చిన సంగతి తెలిసిందే. 116 మందితో ఈ నెల 15న రెండో విమానం, 112 మందితో మూడో విమానం అమృత్ సర్ లో ఆదివారం రాత్రి ల్యాండ్ అయింది. అమెరికా నుంచి ఇప్పటివరకు 332 మంది అక్రమ వలసదారులు స్వదేశానికి చేరారు. వీరిలో పంజాబీలే 126 మంది ఉన్నారు. దీనికి పొరుగు రాష్ట్రమైన హరియాణకు చెందినవారు 110, గుజరాత్ వారు 74, యూపీ 6, మహారాష్ట్ర 5, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, గోవా, చండీగఢ్ కు చెందినవారు ఇద్దరు చొప్పున, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్ కు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. తెలుగువారున్నారా? అమెరికా తరిమేసిన అక్రమ వలసదారుల్లో ఇప్పటివరకు ఇక్కరు తెలుగువారు లేరు. అంటే.. మనవారంతా సక్రమ పద్ధతుల్లో, సరైన పత్రాలతో అమెరికా గడ్డపై కాలుమోపుతున్నారని భావించవచ్చు. అంతేకాదు.. ఇప్పటివరకు వచ్చినవారంతా ఉత్తర భారత దేశం వారే కావడం గమనార్హం. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఏపీలవారు ఒక్కరూ లేపోవడం విశేషం. అయితే, ఇప్పటివరకు లేనందున ఇకపై కూడా ఉండరని భావించడం సరైనది కాదు. ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన మాస్ డిపోర్టేషన్ లో తెలుగోళ్లు ఒకరిద్దరైనా దొరికితే అది ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. బహుశా అలా జరగదనే అభిప్రాయం వినిపిస్తోంది.

## శంభాజీ జీవిత విశేషాలు తెలుసా..? ఔరంగజేబును ఎదిరించిన 'సింహం పిల్ల'..!



**న్యూఢిల్లీ-నవభూమి:**మరాఠా సామ్రాజ్యాన్ని పరిపాలించిన రెండో పాలకుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్ తనయుడు శంభాజీ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన ఛావా సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. తన నటనతో శంభాజీ పాత్రకు విక్కీ కౌశల్ ప్రాణం పోస్తే.. ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాపై సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు కురుస్తోంది. హిందూ రాజ్య స్థాపనే లక్ష్యంగా తన పోరాటం సాగించిన శివాజీ మహరాజ్.. నాటి మొఘల్ పాలకుడు ఔరంగజేబుకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. గెరిల్లా వ్యూహాలతో మొఘల్ సైన్యాలను మట్టికరిపించిన శివాజీ.. 1674లో రాయగఢ్ కోటలో మరాఠా సామ్రాజ్యాధినేతగా ఛత్రపతి బిరుదుతో పట్టాభిషక్తుడయ్యారు.కేవలం హిందుత్వమే కాదు న్యాయబద్ధమైన పరిపాలన, సంక్షేమం, సమర్థవంతమైన పన్నులపై శివాజీ దృష్టి పెట్టారు. తన దేశభక్తి, ధైర్యం, నాయకత్వంతో తరతరాలకు ప్రేరణగా నిలిచారు. తన ధైర్యసాహసాలతో భారత చరిత్రలో తనకంటూ ఓ అధ్యాయాన్ని శివాజీ లిఖించుకున్నారు. అయితే, ఛత్రపతి శివాజీ ఆకస్మిక మృతితో మరాఠా సింహాసనాన్ని ఆయన పెద్ద కుమారుడు శంభాజీ అధిరోహించి.. 9 ఏళ్ల పాటు రాజ్యాన్ని కాపాడుతూ వచ్చారు. ఓవైపు రాజ్యంలో అస్థిర పరిస్థితులను చక్కదిద్దుతూ.. ఇంకోవైపు మొఘులులతో తన తండ్రి శివాజీలాగే పోరాటం సాగించారు. ఆయన జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగానే ఛావా సినిమా రూపొందింది.శంభాజీ జీవితం గురించి ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శంభాజీగా ప్రసిద్ధి చెందిన శంభాజీరాజే శివాజీరాజే భోంస్లే..1681 నుంచి 1689 వరకు మరాఠా రాజ్యాన్ని పాలించారు. 1657, మే 14న శివాజీ, సాయిబాలకు మొదటి సంతానంగా జన్మించిన శంభాజీ.. రెండేళ్ల వయసులోనే తల్లిని కోల్పోయారు. ఆయన బాల్యం అంతా శివాజీ తల్లి జిజియాబాయి వద్దే గడిచింది. పిలాజీ షిర్కే కుమార్తె జివుబాయిని శంభాజీ వివాహం చేసుకున్నారు. తరువాత కాలంలో ఆమే యేసుబాయిగా పేరు మార్చుకున్నారు.

అనేక సైనిక దాడులకు శంభాజీ నాయకత్వం వహించారు. అందులో ముఖ్యమైంది మొఘల్ పాలనలోని బుర్హాన్‌పూర్‌పై దాడి. నాటి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దక్కన్‌ను జయించాలనే ప్రయత్నానికి శంభాజీ అడుగడుగునా అడ్డుపడ్డారు. మరాఠా రాజ్యాన్ని కాపాడుకోడానికి 1682 నుంచి 1688 వరకు అనేక పోరాటాలు సాగించారు. శంభాజీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే తన హత్యకు కుట్రలు చేస్తోన్న వ్యక్తులను గుర్తించారు. అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరించి, తన తండ్రి స్థాపించిన హిందూ స్వరాజ్యాన్ని రక్షించారు.కానీ, 1689లో శంభాజీని ఔరంగజేబు బంధించి, రోజుల తరబడి చిత్రహింసలకు గురిచేశారు. అత్యంత దారుణంగా 1689 మార్చి 11న శంభాజీని ఉరితీశారు. అయితే, మరణం కళ్ల ముందు ఉన్నప్పటికీ ఆయన భయపడలేదు. మతం మారితే వదిలేస్తానన్న ఔరంగజేబు ప్రతిపాదనను తిరస్కరించిన ఆయన.. హిందూ ధర్మం కోసం ప్రాణాలు వదలడానికే మొగ్గు చూపారు. శంభాజీ ధైర్యమే మరాఠాల హృదయాల్లో ఆయనకు శాశ్వతమైన స్థానాన్ని సంపాదించి పెట్టింది. శంభాజీ మహారాజ్ ధైర్యం, జ్ఞానం, సవాళ్లను ఎదుర్కొని నిలబడిన విధానం నేటి తరానికి పట్టుదల, దేశభక్తికి అమూల్యమైన పాఠాలను నేర్పుతాయి. అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, ఆయన నిర్భయంగా, దృఢ సంకల్పంతో ఉన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా వెనక్కి తగ్గొద్దని చాటారు.

ఇక, శంభాజీ ఓ పరిశోధకుడు కూడా. రాజ్యాన్ని కాపాడుకోవడానికి ఓవైపు అలుపెరగని పోరాటం చేస్తూనే.. మరోవైపు పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. విద్య, విజ్ఞానానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన యుద్ధ వ్యూహాలు, నాయకత్వం నుంచి చాలా నేర్చుకోవచ్చు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి.. ప్రజల కోసం ఆయన చేసిన త్యాగం, వారిపట్ల ఆయన చూపిన విధేయత అనిర్వచనీయం.అన్నింటికీ మించి ఆయన దృఢ సంకల్పం, క్రమశిక్షణ, స్వావలంబన.. నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. నిజమైన బలం కేవలం అధికారంలో కాదు, వ్యక్తిత్వం, పట్టుదలలో ఉందని ఆయన జీవితం తెలియజేస్తుంది

## త్వరలోనే భారత్‌లోకి ఎయిర్ అంబులెన్సులు.. గాల్లో ఎంత స్పీడుగా దూసుకెళ్లనున్నాయంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశవ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా వెంటనే అంబులెన్సుకు ఫోన్ చేసేస్తుంటాం. అయితే మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారికి, ముఖ్యంగా రోడ్డు మార్గాలు లేని, రోడ్లు బాగాలేని స్థితిలో ఉన్నవారికి అంబులెన్సు సేవలు అందడం కాస్త కష్టమే అవుతుంది. కానీ ఈ సమస్యకు చెక్ పెడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఓ అద్భుతమైన ఆలోచన చేసింది. ముఖ్యంగా దేశ వ్యాప్తంగా అందుబాటులోకి ఎయిర్ అంబులెన్సులను తీసుకు రావాలని నిర్ణయించింది. ఈక్రమంలోనే ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని ప్రత్యేకంగా ఎయిర్ అంబులెన్సులను తయారు చేయిస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.రోడ్డు మార్గాలు సరిగ్గా లేని, రోడ్డుపై ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు అన్ని జిల్లాల్లోనూ త్వరలోనే ఎయిబ్ అంబులెన్సులు అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాల్లో మాత్రం ఈ ఎయిర్ అంబులెన్సుల అందుబాటులో ఉండగా.. తాజాగా భారత ప్రభుత్వం కూడా వీటిని వినియోగంలోకి తీసుకు రావాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలోనే బెంగళూరుకు చెందిన విద్యుత్ విమాన అంకుర పరిశ్రమ "ఇప్లేన్"తో ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యంగా 788 ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ ఎయిర్ అంబులెన్సులను తయారు చేసేందుకు గాను 100 కోట్ల డాలర్లు చెల్లిచేందుకు రంగం సిద్ధం చేసింది. అయితే రన్‌వే అవసరం లేని నిటారుగా టేకాఫ్, ల్యాండయ్యే ఈ ఎయిర్ అంబులెన్సులను దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలో అందుబాటులోకి తీసుకు వస్తుండగా.. ఆయా వాతావరణ పరిస్థితులకు తగ్గట్లుగా తయారు చేయబోతుంది ఇప్లేన్ సంస్థ. అయితే 2026 చివరి త్రైమాసికం వరకు వీటిని తయారు చేసి ప్రభుత్వానికి అందజేయాలని భావిస్తోంది.దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రజలను బేరీజు వేసుకుని.. ఆయా భౌగోళిక పరిస్థితులకు అనుగూలంగా మూడు రకా ప్రోటోటైప్ విమానాలను ఇప్లేన్ తయారు చేయబోతుంది. అయితే ఈ విమానాలు గంటకు 200 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించగల్గుతాయని నేరుగా సంస్థనే ప్రకటించింది. ఒకసారి ఛార్జి చేస్తే 110 నుంచి 200 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్తాయట.ఇదంతా ఇలా ఉండగా.. సాధారణ అంబులెన్సులో ఒక డ్రైవర్, ఒక వైద్య సిబ్బంది, స్ట్రెచర్, అత్యవసర మందులు ఉన్నట్లుగానే.. ఈ ఎయిర్ అంబులెన్సులోనూ ఉండబోతు న్నాయి. కాకపోతే డ్రైవర్ స్థానంలో పైలెట్ ఉండనున్నాడు. అలాగే ఇందురో రోగితో పాటు మరో వ్యక్తి కూడా ప్రయాణించే వెసులుబాటు ఉంది. 2026లోనే అందుబాటులోకి రాబోతున్న ఈ ఎయిర్ అంబులెన్సు సేవల వల్ల గిరిజన ప్రాంతాల ప్రజలతో పాటు రోడ్డు రవాణా సరిగ్గా లేని, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల ప్రజలకు కూడా పెద్ద ఎత్తున లాభ పడబోతున్నారు.

## మహా ఆశ్చర్యం.. అమెరికాలో 360 ఏళ్ల వ్యక్తి.. 2 కోట్ల మందికి 100 ఏళ్లు



**వాషింగ్టన్- నవభూమి:** భూమ్మీద ఒక వ్యక్తి ఎంత కాలం బతుకుతాడు..? జీవన ప్రమాణాలు మెరుగైన ప్రస్తుత పరిస్థితుల్లో 75 ఏళ్లు.. ఇక అమెరికా వంటి దేశాల్లో అయితే మరో ఐదేళ్లు అధికంగా జీవిస్తారు అనుకుందాం.. కానీ, అమెరికాలో ఓ వ్యక్తి 360 ఏళ్లు దాటినా సజీవంగా ఉన్నాడంటే నమ్మాల్సిందే..? అంతేకాదు 100 ఏళు దాటినవారు 2 కోట్ల మంది వరకు ఉన్నారంటే ఆశ్చర్యపోవాల్సిందే.. అక్కడి సోషల్ సెక్యూరిటీ విభాగం రికార్డులు ఇదే విషయాన్ని చెబుతున్నాయి. వినగానే ఎవరికైనా కళ్లు తిరిగే.. చదవగానే నోరెళ్లబెట్టే ఈ విషయాలు డోజ్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ) టీమ్ పరిశీలన బయటపడ్డాయి. అమెరికా అధ్యక్షుడు అయ్యాక డొనాల్డ్ ట్రంప్.. అపర కుబేరుడు స్పేస్ ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ సారథ్యంలో డోజ్ ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వ్యవస్థల ప్రక్షాళన దీని లక్ష్యం. ఇప్పుడు డోజ్ టీమ్.. సోషల్ సెక్యూరిటీ రికార్డులను తిరగేస్తోంది. ఇందులో వందల ఏళ్ల వయసున్నవారు ఇంకా బతికి ఉన్నట్లు తేలడంతో ఆశ్చర్యపోవడం అందరి వంతు అవుతోంది. వీరిలో 200 ఏళ్లు దాటినవారు 2 వేల మంది పైగా, 360-369 ఏళ్ల మధ్య వయసున్నవారు ఒకరున్నారట. వందేళ్లు.. అయినా సోషల్ సెక్యూరిటీలో.. ఈ సంగతులను మస్క్ తన సొంత సామాజిక మాధ్యమం 'ఎక్స్' ట్విటర్లో వెల్లడించారు. అంతేకాదు.. వందేళ్లు దాటిన 2 కోట్ల మంది సోషల్ సెక్యూరిటీ లబ్ధికి అర్హుల జాబితాలో ఉన్నట్లు మస్క్ తెలిపారు. మనదగ్గర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు అమెరికాలో మరో రూపమే సోషల్ సెక్యూరిటీ. అయితే, దీనిలోని అర్హుల జాబితా అమెరికా జనాభా కంటే అధికంగా ఉండడం గమనార్హం. అంటే.. భారత్ లో జనాభా కంటే రేషన్ కార్డులు అధికంగా ఉన్నట్లు అన్నమాట. దీంతో చరిత్రలోనే ఇది అతిపెద్ద మోసమని పేర్కొన్నారు. 2023లో సోషల్ సెక్యూరిటీ ఆడిట్ లో 18.9 మిలియన్ల మంది వందేళ్లు దాటినవారున్నట్లు గుర్తించారు. వారు ఆదాయం పొందడం లేదా.. ప్రయోజనాలను స్వీకరించడం కానీ, చేయడం లేదు. అయితే, ఆ జాబితాను సవరించలేదు. అమెరికాలో 112 ఏళ్లున్నవారు 65 లక్షల మందికి సోషల్ సెక్యూరిటీ నంబర్లున్నాయి. వీరికి సంబంధించి ఎటువంటి డెత్ ఇన్ఫర్మేషన్ నమోదు చేయలేదు. వీరంతా ఎలక్ట్రానిక్ డెత్ ఇన్ఫర్మేషన్ నమోదు వ్యవస్థ రాకముందే చనిపోయారు. భూమ్మీద 35 మంది మాత్రమే ఈ వయస్సు దాటిన వారున్నారు. జనాభా లెక్కల ప్రకారం అమెరికాలో 100 ఏళ్లు దాటినవారు 86 వేలు మాత్రమే. అమెరికాలోని సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రజలకు చెందిన రిటైర్మెంట్, వైకల్యంతో బాధ పడేవారికి ఆదాయ మార్గాలను సమకూరుస్తుంది.

## ఢిల్లీకి ఖతార్ అధినేత.. స్వయంగా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి మోదీ స్వాగతం!



**న్యూఢిల్లీ-నవభూమి:**రెండు రోజుల అధికారిక పర్యటన కోసం ఖతార్ అధినేతకు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీ భారత్‌కు సోమవారం చేరుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ... స్వయంగా ఢిల్లీ విమానాశ్రయానికి వెళ్లి ఆయనకు ఘన స్వాగతం పలకడం విశేషం. ఈ విషయాన్ని మోదీ ఎక్స్ (ట్విట్టర్)లో వెల్లడించారు. "నా సోదరుడు, ఖతార్ ఎమిర్ హెచ్ హెచ్ షేక్ తమిమ్ బిన్ హమద్ అల్-థానీకి స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. ఆయన భారత్ పర్యటన ఫలవంతం అవుతుందని ఆశిస్తున్నా.. రేపు మేము ఇరువురం భేటీ కాబోతున్నాం" అని పేర్కొంటూ ఫొటోలను మోదీ పోస్ట్ చేశారు. విమానాశ్రయం నుంచి వచ్చిన అనంతరం విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో తమీమ్ బిన్ హమద్ భేటీ అయ్యారు.ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఖతర్ ఎమిర్ మంగళవారం కలవనున్నారు. ఈ భేటీ తర్వాత హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారు. ఇరువురు భారత్- ఖతార్ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపుతారని విదేశాంగశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. పలు కీలక ఒప్పందాలు కూడా చేసుకుంటారని తెలిపింది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు ఢిల్లీకి వచ్చిన తమీమ్ బిన్ హమద్.. భారత్‌లో పర్యటించడం ఇది రెండోసారి. గతంలో మార్చి 2015లో ఆయన భారత్‌కు వచ్చారు. మళ్లీ దాదాపు పదేళ్ల తర్వాత భారత్‌కు వచ్చారు. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యాన్ని తాజా పర్యటన మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగశాఖ అభిప్రాయపడింది.ఎమిర్ వెంట ఖతార్ మంత్రులు, ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలతో కూడిన ప్రతినిధుల బృందం సైతం భారత్‌కు చేరుకుంది. ఇదిలా ఉండగా, భారత్, ఖతార్ మధ్య చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇరుదేశాల మైత్రికి శతాబ్దాల చరిత్ర ఉంది. భారత్‌కు నమ్మకమైన భాగస్వాముల్లో ఖతార్ ఒకటి. ఇటీవల కాలంలో రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడులు, ఎనర్జీ, టెక్నాలజీతో పాటు ప్రజల మధ్య బంధం మరింత బలోపేతమవుతోంది. ఖతార్‌లో నివసిస్తోన్న విదేశీయుల్లో భారతీయులే మొదటి స్థానంలో ఉండటం విశేషం.

## ఏసీలు, టీవీ, కుర్చీలు ఎత్తుకెళ్లిన ఆప్ అగ్రనేత



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మనీష్ సిసోడియాపై ప్రతాప్‌గంజ్ బీజేపీ ఎమ్మెల్యే రవీందర్ సింగ్ నేగి సంచలన ఆరోపణ చేశారు. ప్రతాప్‌గంజ్ ఏరియాలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆస్తులను (వస్తువులు) మనీష్ సిసోడియా, ఆప్ కార్యకర్తలు ఎత్తుకెళ్లిపోయారని అన్నారు. ఏసీలు, టెలివిజన్లు, కుర్చీలు, ఫ్యాన్లు, ఎల్ఈడీలతో సహా ప్రతీదీ పట్టుకుపోయారని తెలిపారు.'ఎన్నికల ముందు కూడా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతాప్‌రాజ్‌గంజ్ ఎమ్మెల్యే తన నిజరూపం ప్రదర్శించారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నుంచి ఏసీ, టీవీ, టేబుల్, చెయిర్, ఫ్యాన్ ఎత్తుకుపోయారు. అవినీతి మరోసారి హద్దులు దాటింది. అలాంటి అవినీతి పరుల గుట్టును బయటపెట్టి ప్రజల హక్కులను మేము కాపాడతాం" అని నెగి అన్నారు. ఖాళీగా ఉన్న ఎమ్మెల్యే కార్యాలయాన్ని చూపిస్తూ సామాజిక మాధ్యమంలో ఒక వీడియో క్లిప్‌ను ఆయన విడుదల చేశారు.


ఆప్ వివరణ..కాగా, దీనిపై పీడబ్ల్యూడీ జేఈ వేద్ ప్రకాష్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కార్యాలయానికి ఎలాంటి సామగ్రి తాను ఇవ్వలేదని చెప్పారు. సిసోడియా ప్రతినిధి మరింత వివరణ ఇస్తూ, ప్రభుత్వానికి చెందిన వస్తువులేవీ తాము తీసుకెళ్లలేదని చెప్పారు. ఆప్ కార్యకర్తలు తమ సొంత వస్తువులు ఏవైతే ఉన్నాయో వాటినే తీసుకు వెళ్లారని, మాయమయ్యాయని చెబుతున్న రెండు ఏసీలు కూడా అద్దెకు తెచ్చినవేనని అన్నారు. ఏసీల యజమానులు వాటిని వెనక్కి తీసుకు వెళ్లిపోయారని వివరించారు.ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతాప్ రాజ్ గంజ్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన నెగి 28,072 ఓట్ల ఆధిక్యంతో ఆప్ నేత అవధ్ ఓఝాపై గెలిచారు. ఇంతకుముందు ప్రతాప్‌రాజ్‌గంజ్ నుంచి గెలిచిన మనీష్ సిసోడియా ఈసారి జాంగ్‌పుర నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

## అదేం భాష? మీ బుర్రలోని చెత్త.. సుప్రీం నిప్పులు



**న్యూఢిల్లీ-నవభూమి:**అత్యంత పాపులారిటీ సంపాదించుకుని.. అథపాతాళంలోకి పడిపోయిన వ్యక్తి రణవీర్ అల్హాబాదియా. దీరూబాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ లో చదువుకుని.. డాక్టర్ కుమారుడై ఉంది.. ఇంజనీరింగ్ కూడా చేసిన అతడు ఇటీవల ఇండియాస్ గాట్ లాటెంట్'(ఐజీఎల్)లో అత్యంత నీచమైన వ్యాఖ్యలు చేశాడు. రణవీర్ అల్హాబాదియా వ్యాఖ్యలు ఎంత దారుణంగా ఉన్నాయంటే.. మనిషి నైతికంగా పతనానికి అంతకంటే మరొక పద్ధతి లేదనేంతగా అన్నమాట. మన సమాజంలో తల్లిదండ్రులు, గురువులను దైవంగా పూజిస్తాం. అలాంటి తల్లిదండ్రుల లైంగిక జీవితం గురించి బహిరంగంగా మాట్లాడడంతో రణవీర్ పై సమాజంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అతడిపై కేసు నమోదు చేయాలంటూ నేరుగా మహారాష్ట్ర సీఎం ఆదేశించేవరకు వ్యవహారం వెళ్లింది. సొంత రాష్ట్రం మహారాష్ట్రలోనే కాక ఇతర రాష్ట్రాల్లోనూ రణవీర్ పై కేసుల నమోదు, తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సమయ్ రైనా షోలో రణవీర్ అల్హబాదియా చేసిన వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. కోర్టులో 81 కోళ్లకు వేలం వేస్తే రూ.16.65 లక్షలు పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్ లు నమోదు కావడంతో రణవీర్ వాటిపై ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అన్ని ఎఫ్ఐఆర్ లను క్లబ్ చేయాలని పిటిషన్ వేశాడు. దీనిపై మంగళవారం విచారణ జరిగింది. విచారణ సందర్భంగా "ఇదంతా అసభ్యత కాకపోతే ఏమిటి? మీ మెదడులోని చెత్తనంతా ఆ ప్రోగ్రాం ద్వారా బయటపెట్టారు. ఇలాంటి ప్రవర్తన ఖండించదగినది. పాపులర్ అని చెప్పి, ఏదైనా మాట్లాడతా అంటే సమాజం ఆమోదించదు. మీలాంటి వ్యక్తులకు కోర్టు ఎందుకు రక్షణ కల్పించాలి" అని సుప్రీం ప్రశ్నించింది. హైకోర్టు కీలక వ్యాఖ్యలు! రణవీర్ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా ఖండిస్తూ అసహనం వ్యక్తంచేసింది. ఇలాంటి భాష ఎవరికైనా నచ్చుతుందా..? అని నిలదీసింది. పాపులారిటీ ఉంటే ఏదైనా మాట్లాడతారా..? మీరు వాడిన భాషను ఎవరైనా ఇష్టపడతారా..? అంటూ రణవీర్ పై సుప్రీం నిప్పులు చెరిగింది. తీవ్రంగా మందలించిన సుప్రీంకోర్టు.. తర్వాత ఊరట కల్పించింది. ఈ వ్యవహారంలో మరో పోలీసు కేసు నమోదు చేయొద్దని ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచివెళ్లే ప్రయత్నాలు చేయొద్దని హెచ్చరించింది. పాస్ పోర్టును తాణె పోలీసులకు అప్పగించాలని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి షోలు చేయొద్దని తేల్చిచెప్పింది.

## శంభాజీ మహారాజ్ గురించి పాఠశాలల్లో ఎందుకు నేర్పించలేదు



శంభాజీ మహారాజ్ జీవిత కథను 'ఛావా' సినిమాతో హృదయాలను హత్తుకునేలా చూపించారు దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ మరాఠా సామ్రాజ్యాన్ని పరిపాలించిన రెండో పాలకుడి పాత్రలో విక్కీ కౌశల్ జీవించేశారు. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. తాజాగా దీనిపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. "ఈరోజే 'ఛావా' సినిమా చూశాను. ధైర్యం, నిస్వార్థం, తన పనిపై అంకితభావం, ఇలా ఎన్నో విషయాలు కలిసిన గొప్ప కథ ఇది. నిజయతీగా ఒక ప్రశ్న వేయాలనుకుంటున్నామనకు ఛత్రపతి శంభాజీ మహారాజ్ గురించి పాఠశాలల్లో ఎందుకు నేర్పించలేదు? ఆయన గురించి పుస్తకాల్లో ఎక్కడా ప్రస్తావించలేదు! కానీ అక్బర్ గొప్ప నాయకుడని.. న్యాయంగా పాలించిన చక్రవర్తి అని నేర్పించారు. ఢిల్లీలో ఓ పెద్ద రహదారికి ఔరంగజేబు రోడ్డు అని పేరు కూడా పెట్టారు. అలా ఎందుకు చేశారు?" అని తన పోస్ట్‌లో ప్రశ్నించారు.ఆకాశ్ చోప్రా పోస్ట్‌పై నెటిజన్లు తమ అభిప్రాయాలను షేర్ చేస్తున్నారు. ఓ నెటిజన్ మీరు చరిత్ర నేర్చుకోలేదా అని అడగ్గా ఆకాశ్ చోప్రా అతడికి సమాధానమిచ్చారు. 'నేను టాపర్‌ని. చరిత్రలో నాకు 80 శాతం మార్కులు వచ్చాయి' అని రిప్లై పెట్టారు. కొందరు ఈ మాజీ క్రికెటర్ ప్రశ్నలకు సపోర్ట్‌గా ఉండగా, మరికొందరు దీన్ని వివాదాస్పదంగా మార్చవద్దని అంటున్నారు. దేశవ్యాప్తంగా 'ఛావా' అద్భుతంగా ఆడుతోంది. తొలిరోజే రూ.31 కోట్లు వసూళ్లు చేసిన ఈ సినిమా ఇప్పటివరకు రూ.121 కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ చరిత్రలో ఏ హిస్టారికల్ సినిమాకు ఈ స్థాయిలో ఓపెనింగ్ రాలేదని ట్రేడ్ వర్గాలు తెలిపాయి.

## నవచిత్ర





## ఆ హీరోతో లిప్ కిస్సులో రీతూ వర్మ!

తెలుగు అమ్మాయి రీతు వర్మ గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు ఇప్పటికే తెలుగు, తమిళ్ లో చాలా సినిమాలు చేసింది. –ప్రేమ ఇష్క్ కాదల్–తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు చాలా తెలుగు సినిమాలు చేసింది. అటుపై కోలీవుడ్ లోనూ చాలా సినిమాల్లో నటించింది. అయితే వెండి తెరపై ఎప్పుడూ హద్దులు మీరింది లేదు. గ్లామర్ పాత్రలకు దూరంగానే ఉంది. లిప్ కిస్సులు..ఇంటిమేట్ సీన్లు అంటే ఏ సినిమా విషయంలోనూ ఛాన్స్ తీసుకోలేదు. జోక్ ను జోక్ లా చూడండి.. మరో క్లారిటీ అలాంటి ఆఫర్లు చాలా వచ్చినా? వద్దనుకుని తన ఫరిది మేర సినిమాలు చేసుకుంటూ వచ్చింది. ఏనాడు గ్లామర్ గేట్లు ఎత్తింది లేదు. అయితే తాజాగా రీతూ వర్మ కూడా సరిహద్దులు దాటేసిందని ఓ వార్త వెలుగులోకి వస్తోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో మజాకాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో హీరోగా సందీప్ కిషన్ నటిస్తున్నాడు. త్రినాధరావు సినిమాలంటే పక్కా కమర్శియల్ చిత్రాలు. యాక్సిడెంట్ తర్వాత వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేస్తున్నా అవసరం మేర మసాలా సన్నివేశాలకు ఛాన్స్ తీసుకుంటాడు. ఈ నేపథ్యంలో మజాకాలో రీతూవర్మ హీరో సందీప్ కిషన్ తో ఓ లిప్ కిస్ సన్నివేశంలో నటించిందని ప్రచారం జరుగుతోంది. ఓ సీన్ డిమాండ్ మేరకు నక్కిన తప్పదు నటించాల్సిందేనని పట్టుబట్టడంతో రీతూ వర్మ ఛాన్స్ తీసుకుందని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తేలాలి. రీతూ వర్మకు గ్లామర్ పాత్రల్లో నటించే అవకాశం వచ్చినా? నటించలేదు. ఈ క్రమంలో చాలా అవకాశాలు కోల్పోయింది. అటు కోలీవుడ్ లో కూడా అవకాశాలు తగ్గడానికి ఇదే కారణమని చాలా కాలంగా అక్కడ మీడియాలో కథనాలొస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం రీతూ వర్మ చేతిలో ఉన్నది కూడా మజాకాచిత్రమే. కోలీవుడ్‌లో ధృవ నక్షత్రం సినిమా చేసింది గానీ ఆ సినిమా రిలీజ్ కి నోచుకోలేదు. చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో మాజాకా చిత్రంతో ఎలాగైనా బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తుంది. ఈ క్రమంలోనే లిప్ కిస్సు కి ఒకే చెప్పిందనే వార్తలొస్తున్నాయి.



## లిల్లీ నుంచి కీర్తి వరకు.. వావ్ అనిపిస్తున్న అనుపమ

మలయాళ ప్రేమమ్ సినిమాతో వెండితెరకు పరిచయమైన కేరళ కుట్టి అనుపమ పరమేశ్వరన్ ఇవాళ తన 29వ పుట్టినరోజును జరుపుకుంటుంది. అ..ఆ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అనుపమ, తక్కువ కాలంలోనే మంచి నటిగా, పక్కింటి అమ్మాయిగా గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్ గా టిల్లూ స్క్వేర్ సినిమాలో లిల్లీ జోసెఫ్ గా నటించి అందరినీ ఆకట్టుకుంది అనుపమ. టిల్లూ స్క్వేర్ లో రెండు విభిన్న షేడ్స్ లో నటించి అనుపమ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. సినిమా మొదట్లో లిల్లీ జోసెఫ్ పాత్ర పెద్దగా ఆకట్టుకోనప్పటికీ, ఆ తర్వాత లిల్లీ జోసెఫ్ ఐఎస్ఎఫ్ గూఢచారి అని రివీల్ అయ్యాక మాత్రం ఓ రేంజ్ లో క్లిక్ అయింది. ఓ వైపు ప్రేయసిగా, మరోవైపు సీక్రెట్ ఏజెంట్ గా అనుపమ ఆ ఇదిలా ఉంటే అనుపమ ప్రస్తుతం డ్రాగన్ అనే తమిళ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాలో కూడా అనుపమ చాలా భిన్నమైన పాత్రలో కనిపించనుంది. రాఘవన్ మాజీ ప్రేయసి కీర్తి పాత్రలో అనుపమ డ్రాగన్ సినిమాలో నటించింది. ఇప్పటికే రిలీజైన డ్రాగన్ ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ట్రైలర్ లో అనుపమ చాలా సింపుల్ గా కనిపించింది. కథ మొత్తంలో తన ప్రియుడికి సపోర్ట్ చేసే పాత్రలో అనుపమ డ్రాగన్ సినిమాలో కనిపించనుంది. టిల్లూ స్క్వేర్ లోని లిల్లీ పాత్రకు, డ్రాగన్ లోని కీర్తి పాత్రకు ఏ మాత్రం పొంతన కనిపించదు. ఇంకా చెప్పాలంటే ఆ రెండు పాత్రలు చేసింది ఒకరేనా అనే అనుమానం కలిగించేలా అనుపమ ఆ పాత్రల్లో ఒదిగిపోయింది. ఫిబ్రవరి 21న డ్రాగన్ ప్రేక్షకుల ముందుకు రానుంది. కాలేజ్ స్టూడెంట్ అయిన రాఘవ బ్రేకప్ తర్వాత అనుకోని విధంగా మోసపోతాడు. రాఘవ మోసానికి గురవుతున్నప్పుడు కీర్తి పాత్ర అతని జీవితంలో ఎలాంటి పాత్ర పోషిస్తుందనే దానిపై డ్రాగన్ కథ నడవనుంది.

## రష్మిక ఇప్పుడు వాళ్ల కంటే తక్కువేం కాదు!



నేషనల్ క్రష్ రష్మిక మందన 'చావా' సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. గత సంవత్సరం చివరిలో అల్లు అర్జున్‌తో కలిసి పుష్ప 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. రష్మిక మందన తాజాగా బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో విక్కీ కౌశల్ తో కలిసి చావా సినిమాతో వచ్చింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొం దిన చావా సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమాలో విక్కీ కౌశల్ నటనకు విమర్శకుల ప్రశంసలు లభిస్తున్నాయి. – యాక్సిడెంట్ తర్వాత వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేస్తున్నా ఇదే సమయంలో రష్మిక నటనపై పలువురి ప్రశంసలు కురిపించారు. సినిమాలో ఆమె పాత్రకి పూర్తి న్యాయం చేసే విధంగా నటించింది అంటూ రివ్యూలు వచ్చాయి. బాలీవుడ్‌లో యానిమల్ సినిమాతోనూ రష్మిక మందన ఆకట్టుకుంది. ఆ సినిమా వెయ్యి కోట్లకు పైకి వసూళ్లను రాబట్టిన విషయం తెలిసిందే. రణబీర్ కపూర్ హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో బాలీవుడ్‌లో రష్మిక మందన మరిన్ని సినిమా ఆఫర్లను సొంతం చేసుకుంటుంది. అయితే బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్స్ తీసుకుంటున్నంత పారితోషికం మాత్రం రష్మిక మందన పొందడం లేదు. దీపిక పదుకునే, ఆలియా భట్ తీసుకుంటున్న రెమ్యూనరేషన్ లో రష్మిక మందన కనీసం సగం మాత్రమే తీసుకుంటుందని ప్రచారం జరుగుతుంది. బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వానీ దాదాపుగా ఐదు కోట్ల పారితోషికం తీసుకుంటుంది. చావా సినిమా కోసం తీసుకున్న పారితోషికం నాలుగు కోట్లు మాత్రమే అని సమాచారం అందుతుంది. ముందు ముందు అయినా రష్మిక మందన తన పారితోషికాన్ని ఎనిమిది నుంచి పది కోట్లుగా పెంచాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి ఏ మాత్రం తక్కువ కాకుండా రష్మిక మందన తన పారితోషికం అందుకోవాలని అభిమానులు, సౌత్ సినీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.బాలీవుడ్ హీరో హీరోయిన్ దాదాపు సమానంగా పారితోషికం అందుకుంటారు. కానీ రష్మిక విషయంలో ఆ ఫార్ములా అమలు కావడం లేదు. సల్మాన్ ఖాన్ తో ప్రస్తుతం నటిస్తున్న సినిమాకి సైతం రష్మిక మందన రెమ్యూనరేషన్ చాలా తక్కువగా ఉంది. అందుకే బాలీవుడ్లో రష్మిక కొత్త సినిమాలను కమిట్ అయితే పారితోషికం విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. సల్మాన్ ఖాన్‌తో నటిస్తున్న సినిమా సైతం సక్సెస్ అయితే రష్మిక మందన బాలీవుడ్ లో మోస్ట్ సక్సెస్ ఫుల్ హీరోయిన్‌గా స్టార్ హీరోయిన్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయి. అప్పుడైనా పారితోషికం పెంచుతుందా అనేది చూడాలి.

## సంక్రాంతికి వస్తున్నాం.. ఓటీటీ రిలీజ్‌పై లేటెస్ట్ అప్డేట్



విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా అందరి అంచనాలను మించి భారీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ కామెడీ క్రైమ్ థ్రిల్లర్ జనవరి 14న సంక్రాంతి కానుకగా రిలీజై మంచి కలెక్షన్లను రాబట్టింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ తో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించడంతో పాటూ లాంగ్ రన్ ను దక్కించుకుంది. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా అని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్న టైమ్ లో ఈ సినిమా డిజిటల్ లో కంటే ముందుగా శాటిలైట్ లోకే రానుందని చెప్పి జీ తెలుగు యాజమాన్యం అందరికీ పెద్ద షాకే ఇచ్చింది. సంక్రాంతికి వస్తున్నం సినిమా జీ5లో కంటే ముందుగానే జీ తెలుగులోనే వస్తుందని అనౌన్స్ చేశారు. .ఫట్ అయితే ఇలా! సంక్రాంతికి వస్తున్నాం డిజిటల్ రైట్స్ ను జీ5 సొంతం చేసుకుంటే, శాటిలైట్ హక్కులను జీ తెలుగు సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే సంక్రాంతికి వస్తున్నాం ఓటీటీ స్ట్రీమింగ్‌పై తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తుంది. టీవీలో టెలికాస్ట్ అయిన రెండు రోజులకే ఈ సినిమాను డిజిటల్ లో స్ట్రీమింగ్ చేయాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ సినిమా టెలికాస్ట్ ఎప్పుడనే విషయాన్ని జీ తెలుగు ఇంకా రివీల్ చేయలేదు. త్వరలో అంటున్నారు తప్పించి డేట్ మాత్రం ఇంకా చెప్పలేదు. శివరాత్రి సందర్భంగా సంక్రాంతికి వస్తున్నాంను టెలికాస్ట్ చేసే ఛాన్సుంది. అయితే టెలికాస్ట్ ఎప్పుడైనా, ఆ తర్వాత రెండ్రోజుల్లో జీ5లో సంక్రాంతికి వస్తున్నాం స్ట్రీమింగ్ కు రానుందని తాజాగా సమాచారం అందుతుంది. ప్రాంతీయ చిత్రంగా తెరకెక్కిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా రూ.300 కోట్ల గ్రాస్ వసూలు చేసి టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో అత్యధిక కలెక్షన్లతో ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. వెంకటేష్ కెరీర్లో కూడా ఇదే బిగ్గెస్ట్ హిట్. ఈ సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరి కెరీర్ ను సంక్రాంతికి వస్తున్నాం సినిమా నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లింది.

## తారకరత్న రెండో వర్ధంతి.. భార్య ఎమోషనల్ పోస్ట్



నటుడు నందమూరి తారకరత్న మరణించి రెండేళ్లు పూర్తయింది. 2023 జనవరి 27న యువగళం పాదయాత్రలో పాల్గొన్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గుండెపోటు రావడంతో ఆయన్ను తొలుత కుప్పంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రెండు వారాల కు పైగా మృత్యువుతో పోరాడుతూ ఫిబ్రవరి 18న మృతి చెందారు. ఆయన ఆయన వర్ధంది. ఈ సందర్భంగా ఆయన భార్య అలేఖ్య భావోద్వేగానికి లోనయ్యారు. భర్త జ్ఞాపకాలను తలచుకుంటూ పోస్ట్ పెట్టారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా విరాట్ కోహ్లీ ముందు 5 రికార్డులు.. బ్రేక్ చేస్తాడా..



**న్యూఢిల్లీ–నవ భూమి:** భారత స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రేపటి (ఫిబ్రవరి 19) నుంచి మొదలయ్యే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. అయితే ఈ టోర్నీలో కోహ్లీ అనేక రికార్డులు బ్రేక్ చేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. 297 వన్డే మ్యాచ్‌లలో 13,963 పరుగులు చేసిన విరాట్, ఈ టోర్నీలో మరిన్ని రికార్డులను దక్కించుకునే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఆ వివరాలేంటో ఇక్కడ చూద్దాం.ప్రస్తుతం కోహ్లీ వన్డే క్రికెట్‌లో 14,000 పరుగుల మార్కుకు చాలా దగ్గరగా ఉన్నాడు. ప్రస్తుతం 13,963 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఛాంపియన్స్ ట్రోఫీలో మరో 37 పరుగులు సాధిస్తే, వన్డేలో అత్యంత వేగంగా 14,000 పరుగులు సాధించిన ఆటగాడిగా విరాట్ అరుదైన ఘనతను దక్కించుకుంటాడు. ఇప్పటికే 14,000 పరుగుల మార్కును సచిన్ టెండూల్కర్ (359 వన్డే మ్యాచ్ లు), కుమార్ సంగక్కర (402 వన్డే మ్యాచ్‌లు)లలో సాధించారు. కానీ కోహ్లీ ప్రస్తుతం 285 ఇన్నింగ్స్‌లలోనే 13,963 పరుగులు చేయడం విశేషం.. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు2008లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 27,381 పరుగులు చేసి, ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్నాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో మరో 103 రన్స్ చేస్తే, విరాట్ రికీ పాంటింగ్‌ను అధిగమిస్తాడు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో మూడో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలుస్తాడు. పాంటింగ్ 27,483 పరుగులతో ఈ రికార్డును కలిగి ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు2009లో భారత జట్టు తరపున ఛాంపియన్స్ ట్రోఫీలో అరంగేట్రం చేసిన కోహ్లీ, ఇప్పటివరకు 13 మ్యాచ్‌లలో 529 పరుగులు సాధించాడు. ప్రస్తుతం యాక్టివ్ ప్లేయర్లలో విరాట్ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ఉన్నాడు. అతను వెస్టిండీస్ మాజీ కెప్టెన్ క్రిస్ గేల్ (791 పరుగులు) రికార్డును అధిగమించి, ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలుస్తాడు.

## బుమ్రా లోటును భర్తీ చేస్తాడా?



**న్యూఢిల్లీ–నవ భూమి:** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందే పేస్ దళపతి బుమ్రా గాయం కారణంగా దూరమవడంతో టీమిండి యాకు గట్టి ఝలక్ తగిలినట్టయింది. ప్రాథమిక జట్టులో బుమ్రా పేరును చేర్చినా వెన్నునొప్పితో బాధపడుతుండడంతో అతడికి విశ్రాంతినివ్వడమే మేలని బీసీసీఐ భావించింది. దీంతో ఇప్పుడు బౌలింగ్ భారమంతా వెటరన్ స్టార్ పేసర్ మహ్మద్ షమిపై పడింది. మరిప్పుడు కీలకమైన ఈ టోర్నీలో బుమ్రా లోటును భర్తీ చేస్తూ షమి జట్టుకు అండగా నిలుస్తాడా?..రెండేళ్ల క్రితం భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్ తర్వాత గాయం కారణంగా షమి ఏడాదిపాటు క్రికెట్‌కు దూరమయ్యాడు. గతేడాది చివర్లో దేశవాళీతో మళ్లీ బంతి పట్టిన షమి.. ఆ టోర్నీల్లో అద్భుత ప్రదర్శనతో సత్తా చాటాడు. అంతేకాదు.. ఇటీవల జాతీయ జట్టులోకి పునరాగమనం చేసి ఇంగ్లండ్‌తో సిరీసలోనూ ఆకట్టుకున్నాడు. అయితే బుమ్రా లేని వేళ.. జట్టు 12 ఏళ్ల చాంపియన్స్ ట్రోఫీ కలను నెరవేర్చడంలో షమి కీలకంగా వ్యవహరిస్తాడా? అనే సందేహం అందరి మదిలోనూ ఉంది. కానీ, షమి ప్రదర్శనపై అనుమానాలు అవసరం లేదనీ, అతడు కచ్చితంగా మెగా ఈవెంట్‌లో సత్తా చాటుతాడని టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీ విశ్వాసం వ్యక్తం చేశాడు. అపార అనుభవమున్న షమి.. కచ్చితంగా బుమ్రాను మరిపిస్తాడన్నాడు. 'వాస్తవానికి షమి 2019లోనూ, అలాగే చివరి వన్డే వరల్డ్‌కప‌లోనూ బుమ్రాకు మించి ప్రదర్శన కనబర్చాడు.

## నవక్రీడ

## ప్రతిభకేదీ గుర్తింపు?



**న్యూఢిల్లీ–నవభూమి:** ఒలింపిక్స్, ఆసియా క్రీడలు.. రెండింటిలోనూ పాల్గొన్న తొలి తెలుగు ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ ఆమె. విశాఖ ఎక్స్‌ప్రెసగా దేశం మొత్తం గుర్తింపు తెచ్చుకున్న ఆ తెలుగమ్మాయికి స్వరాష్ట్రంలో మాత్రం చిన్నచూపే. ఆసియా క్రీడలు మొదలు జాతీయ క్రీడల వరకు ఎన్ని పతకాలు, రికార్డులు సాధించినా సరైన గుర్తింపు లభించక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. రైల్వేస్‌లో వచ్చే చాలీచాలని జీతం, వయసు మీద పడిన తల్లిదండ్రుల బాధ్యత, రెండు గదుల ఇరుకైన ఇంట్లో కనీసం పడుకోడానికి చోటు కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్న భారత స్టార్ అథ్లెట్ యర్రాజి జ్యోతి కష్టాలు ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.విశాఖపట్నంలోని కైలాస పురం, మధుసూదన్ నగర్‌లో రెండు గదుల ఇరుకైన ఇంట్లో మేము నివాసముం టున్నాం. ఇంట్లోని సామాన్ల మధ్యే ఐదుగురం రెండు గదుల్లో ఇరుక్కొని పడుకుంటాం. నాన్న సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా రూ.ఆరు వేల జీతానికి పనిచేస్తాడు. అమ్మ.. కుమారి కొద్ది నెలల కిందటి వరకు నాలుగిళ్లలో పనిచేసేది. ఆమె ఆరోగ్యం బాగుండక పోవడంతో పని మాన్పించాం. అన్నయ్య సురేష్ పోర్టులో చిన్న ఉద్యోగం. పడుకోవడానికి తగినంత చోటు లేక అన్నయ్య ఎక్కువ నైట్ డ్యూటీలకు వెళ్తుంటాడు. నేను ప్రస్తుతం రైల్వేస్‌లో జూనియర్ క్లర్క్‌గా రూ.25 వేలకు ఉద్యోగం చేస్తున్నా. నాన్న, అన్నయ్య సంపాదనతో ఇల్లు గడుస్తోంది. నాకొచ్చే జీతం నా శిక్షణ ఖర్చులకు కూడా సరిపోవు. ఇంతటి దయనీయ పరిస్థితుల్లో ఉన్న మమ్మల్ని పట్టించుకునేవారే కరవయ్యారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**